అనుదినం... జనస్వరం

www.navatelangana.com

సంపుటి : 10 సంచిక : 219

12 పేజీలు వెల : 6.50

నవతెలంగాణ

శుక్రవారం 27-09-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar





ఉసురు తీస్తున్న మానసిక ఒత్తిడి

పనిభారంతో బలవన్మరణాలు

సెలవు రోజూ ల్యాప్‌టాప్‌తో కుస్తీ..ఊపిరి పీల్చటానికీ దొరకని సమయం

కార్పొరేట్ రంగంలో విషపూరితమైన పని సంస్కృతిపై దేశవ్యాప్తంగా చర్చ కొనసాగు తుండగానే చెన్నయ్‌లో ఓ ఉద్యోగి మానసిక ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న సంఘటన హృదయాన్ని కలచివేస్తోంది. కార్తికేయన్ అనే టెకీ గత పదిహేనేండ్లుగా ఓ సంస్థలో పనిచేస్తున్నారు. పని ఒత్తిడి కారణంగా తీవ్ర నిరాశానిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్న ఆయన గత కొంత కాలంగా మందులు వాడుతున్నాడని, చివరికి విద్యుత్ వైర్లు చుట్టుకొని విగతజీవిగా మారాడని కుటుంబ సభ్యులు రోదిస్తూ తెలిపారు.

న్యూఢిల్లీ: కార్పొరేట్ ఉద్యోగం.. లక్షల్లో జీతం అని బంధు, మిత్రులనుకుంటుంటారు. ఇది నాణేనికి ఓవైపు..మరో వైపు కార్పొరేట్ ఉద్యోగాల్లో వర్క్ ప్రెషర్ ప్రాణాలు తీయటానికీ వెనుకాడటం లేదు.అయితే సానుకూల సహజీవనం కంటే పోటీకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్న ఈ రోజులలో ఇలాంటి విషాదకర ఘటనలు జరుగుతూనే ఉంటాయి. ఇవేమీ మనకు కొత్త కావు. కాకపోతే ఆయా ఉదంతాల లోని సున్నితత్వాన్ని మనం గుర్తించడం లేదు. ఫలితంగా మరిన్ని విషాద ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దేశంలోని బహుళజాతి సంస్థలలో పనిచేస్తున్న నిపుణులే ఎక్కువగా ఆత్మహత్యకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. మెరుగైన ఉద్యోగావకాశాల కోసం యువత ప్రధాన నగరాల బాట పడుతోంది. యువతను ఆకర్షిస్తున్న ఆ నగరాలే ఇప్పుడు దురదృష్టవశాత్తూ ఆత్మహత్యలకు కేంద్రాలుగా మారాయని 2022లో 'బిజినెస్ ఇన్‌సైడర్' అనే వెబ్‌సైట్ తెలిపింది. దేశంలోని 53 మెగా నగరాలలో నమోదైన మొత్తం ఆత్మహత్యలలో నాలుగు ప్రధాన నగరాలైన ఢిల్లీ (2,760), చెన్నయ్ (2,699), బెంగళూరు (2,292), ముంబయి (1,436)లోనే 35.5 శాతం జరిగాయని ఆ వెబ్‌సైట్ వివరించింది.

ఇవి ఉదాహరణలు మాత్రమే

దేశంలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయని తాజా గణాంకాలు చెబుతున్నాయి. పని ప్రదేశంలో ఒత్తిడిని తగ్గించాలని, ఉద్యోగుల మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ వహించేలా మేనేజర్లకు శిక్షణ ఇవ్వాలని



యాజమాన్యాలకు సూచనలు అందుతున్నాయి. 2022 జనవరిలో 31 సంవత్సరాల ఐటీ ఉద్యోగి రూప్ కిషోర్ సింగ్ హైదరాబాద్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పని ఒత్తిడిని తట్టుకోలేకపోతు న్నానంటూ అంతకుముందు ఆయన తన కుటుంబ సభ్యులకు ఓ సందేశం పంపారు. అదే సంవత్సరం సెప్టెంబరులో గురుగ్రామ్‌లో 39 సంవత్సరాల అసిస్టెంట్ మేనేజర్ అమిత్ కుమార్ బలవన్మరణానికి పాల్పడ్డారు. అంతకుముందు...తన క్యారెక్టరును దెబ్బతీశారంటూ ఆయన ...10లో

వారానికి యాభై ఆత్మహత్యలు

వృత్తి నిపుణులలో ఆత్మహత్యలు అధికంగా జరుగుతున్నాయని ఇటీవల విడుదలైన గణాంకాలు చెబుతున్నాయి. 2021లో నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం పని ప్రదేశంలో సమస్యల కారణంగా దేశంలో ప్రతి వారం కనీసం యాభై మంది ఆత్మహత్య చేసుకుంటున్నారు. 2021లో దేశంలో 1,64,033 మంది ఆత్మహత్య చేసుకున్నారు. 2020తో పోలిస్తే ఇది 7.2 శాతం అధికం. వాస్తవానికి బలవన్మరణానికి పాల్పడుతున్న వారి సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుందని నిపుణులు తెలిపారు. ఇంత జరుగుతున్నప్పటికీ పలు కంపెనీలు ఇప్పటికీ సమస్యను సరిగా అర్థం చేసుకోవడం లేదు. పని ప్రదేశంలో ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం వెల్లివిరిసేలా చర్యలు తీసుకోవడం లేదు. శారీరక ఆరోగ్య సమస్యలు అందరికీ తెలుస్తాయి కానీ మానసిక ఆరోగ్య సమస్యలు తెలియవు. ఇటీవల జరిగిన ఘటనలను చూసైనా బహుళజాతి, సాఫ్ట్‌వేర్ కంపెనీలు తమ ఉద్యోగులకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తాయని, అవసరమైతే వారికి వైద్య నిపుణులను అందుబాటులో ఉంచుతాతాయని ఆశించడం తప్పు కాదేమో.

30 రోజుల్లో డిజిటల్ హెల్త్‌కార్డులు

క్యాన్సర్‌ను అత్యవసరంగా ఎదుర్కోవాలి

లాభాలార్జించే సర్కారు కాదు

ప్రజల సంక్షేమం కోరే ప్రభుత్వం : సీఎం రేవంత్‌రెడ్డి

దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ ఆస్పత్రిని ప్రారంభించిన ముఖ్యమంత్రి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాబోయే 30 రోజుల్లో ప్రజలకు డిజిటల్ హెల్త్‌కార్డులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గురువారం హైదరాబాద్ విద్యానగర్‌లో దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్యం తమ ప్రభుత్వ ప్రాధాన్యతలని తెలిపారు. వీలైనంత మేరకు ప్రజలకు ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో వైద్యం అందించాల్సిన అవసరముందని చెప్పారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ ఫ్యామిలీ డాక్టర్లు ఉండరనీ, ప్రతిసారి అనేక పరీక్షలు చేస్తే తప్ప వైద్యం అందించలేని పరిస్థితిని వైద్యులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి సంబంధించిన డాటాతో ఒక్కొక్కరికి విడివిడిగా హెల్త్ ప్రొఫైల్ రూపొందించనున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలోని 4 కోట్ల ప్రజల హెల్త్ ప్రొఫైల్స్‌ను డిజిటలైజ్ చేసి ఈ హెల్త్ కార్డుల్లో గతంలో వారు తీసుకున్న చికిత్స వివరాలను పొందుపర్చనున్నట్టు తెలిపారు. దీంతో అత్యవసర పరిస్థితితో పాటు ఎప్పుడు ఏ డాక్టర్ దగ్గరికి చికిత్స కోసం వెళ్లినా ఆ పేషంట్ గత ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వేగంగా చికిత్స అందించడం సులభమవుతుందని సీఎం వివరించారు.

ప్రభుత్వపరంగా తాము విధానాలను రూపొందించగలుగుతామని చెప్పారు. అయితే ఆ విధానాలు ప్రజలకు ఉపయోగపడే విధంగా స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని కోరారు. ఈ రూపకల్పనలో దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్ క్రియాశీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. ఇందుకోసం త్వరలోనే స్వచ్ఛంద సంస్థలతో సహకారం తీసుకుంటామని తెలిపారు. ఎన్జీవోలతో త్వరలో ఒక సమావేశం ఏర్పాటు చేసి వారి సూచనలు స్వీకరిస్తామనీ, వారిని భాగస్వాములను చేసుకుంటామని చెప్పారు. దీంతో తక్కువ రోజుల్లో ఎక్కువ సమాచారాన్ని సేకరించగలుగుతామన్నారు.

క్యాన్సర్ మహమ్మారిని అరికట్టేందుకు తక్షణం దృష్టి సారించాల్సిన అసరముందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తనకు తెలిసిన ఒక పాత్రికేయుడు క్యాన్సర్ బాధను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. తమను సంప్రదించిన తర్వాత చికిత్స కోసం తగిన సాయం చేద్దామనుకునేలోపు మరణించడం కలచివేసిందని విచారం వ్యక్తం చేశారు. ఈ మహమ్మరిని పాలద్రోలేందుకు ప్రభుత్వాలు, సంస్థలు, వ్యక్తులు కలిసికట్టుగా ...11లో

నీళ్లను ఒడిసిపట్టి ప్రజలకందించాలి

ఏఈఈ ఉద్యోగ నియామక పత్రాలందజేసిన సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీళ్లను ఒడిసిపట్టి ప్రజలకందించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని జలసౌధలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఏఈఈలకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్లు, నియామకాల ఆకాంక్షల కోసమే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందనీ, అలాంటి శాఖలో ఉద్యోగులుగా ...11లో



ప్రత్యామ్నాయం-పునరావాసం

ఆ తర్వాతే ఇండ్లు కూల్చాలి

మూసీ అభివృద్ధి పేరుతో పేదలను ఇబ్బందులకు గురిచేయొద్దు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎలాంటి ప్రత్యామ్నాయం, పునరావాసం కల్పించకుండానే హైదరాబాద్ మూసీ నది పరిసర ప్రాంతాల్లో దశాబ్దాలుగా నివాసముంటున్న పేదల ఇండ్లు, గుడిసెలను హైడ్రా అధికారులు వెంటనే తొలగించేందుకు పూనుకోవడాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ముందుగా పునరావాసం కల్పించిన తర్వాతే ఇండ్లను కూల్చే పనిని చేపట్టాలని కోరింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూసీ అభివృద్ధి పేరుతో పేదలను ఇబ్బందులకు గురిచేయొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మూసీ సుందరీకరణ పేరుతో హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్, మూసానగర్, శంకర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఎఫ్‌టీఎల్ జోన్‌లో దశాబ్దాలుగా ఉన్న రెండు వేలకుపైగా పేదల ఇండ్లు కూల్చడానికి హైడ్రా ప్రస్తుతం సర్వే చేసి మార్కింగ్ చేస్తున్నదని తెలిపారు. ఈ పేదలంతా కూలీ పని, చిన్నచిన్న షాపుల్లో ఇతర పనులు చేసుకుంటున్నారనీ, బలహీనవర్గాలకు చెందిన కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయని వివరించారు. పేదరికం, ఆర్థిక ఇబ్బందుల వల్ల గుడిసెలు వేసుకున్న వారు కొందరైతే, స్థలాలను కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్లు చేసుకుని, ఇంటి నిర్మాణానికి మున్సిపల్ అనుమతి తీసుకుని ఇండ్లు కట్టుకున్న వారు కొందరున్నారని వివరించారు. అందువల్ల వారు నివాసం ఉంటున్న సమీప ప్రాంతాల్లో ఇండ్లను కేటాయించాల్సిన అవసరముందని సూచించారు. ప్రభుత్వం వారికి హైదరాబాద్ నగర శివార్లలో డబుల్‌బెడ్రూం ఇండ్లు ఇవ్వడం వల్ల రోజువారీ పనిచేసుకుంటున్న పేదలు ఆ పనులకు వెళ్లడం ఆచరణలో సాధ్యం కాదని తెలిపారు. కావున ప్రత్యామ్నాయం కల్పించకుండా ఇండ్ల తొలగింపునకు పూనుకోరాదని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

చెరువులో భారీ భవనం

డిటోనేటర్లు పెట్టి నేలమట్టం చేసిన అధికారులు

నవతెలంగాణ-కొండాపూర్

సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల పరిధిలోని కుతుబ్‌షాహిపేట, మల్కాపూర్ చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమంగా నిర్మించిన బహుళ అంతస్థు భవనాన్ని గురువారం అధికారులు కూల్చేశారు. మండల రెవెన్యూ అధికారి, ఇరిగేషన్ అధికారులు పోలీసుల బందోబస్తు మధ్య డిటోనేటర్లు పెట్టి భవనాన్ని నేలమట్టం చేశారు. కుతుబ్‌షాహిపేట్, మల్కాపూర్ చెరువులో అక్రమంగా నిర్మించారని పత్రికల్లో కథనాలు రావడంతో.. కలెక్టర్ వల్లూరి క్రాంతి మండల రెవెన్యూ అధికారిని, ఇరిగేషన్ అధికారులను విచారణకు ఆదేశించారు. పరిశీలించిన అధికారులు భవనం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని చెప్పడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు.. డిటోనేటర్లు పెట్టి కూల్చేశారు. పూర్తిగా చెరువు నీటిలో ఉన్న భవనానికి ఒడ్డు నుంచి పిల్లర్ల సాయంతో మెట్లు ఏర్పాటు చేయడం గమనార్హం. కూల్చివేతల సమయంలో విధుల్లో హోంగార్డు గోపాల్ తలకు కాంక్రీట్ ముక్కలు తగిలి గాయమైంది. అధికారులు వెంటనే ఆయన్ని ఆస్పత్రికి తరలించారు.



ఆపరేషన్ మూసీ

రివర్ బెడ్‌లో సర్వే ప్రారంభం..

మూడు జిల్లాల్లో 25 బృందాల పర్యటన

1643 ఇండ్లలో వెయ్యి ఇండ్లకు పైగా మార్కింగ్ పూర్తి


నిర్వాసితుల ఆందోళన..వేరే చోట 'డబుల్' ఇండ్ల కేటాయిస్తామన్న అధికారులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు అభివృద్ధిపై దృష్టిసారించిన ప్రభుత్వం.. ఆపరేషన్ మూసీని ప్రారంభించింది. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఆక్రమణకు గురైన ప్రాంతాలను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. మొదటి విడతగా రివర్‌బెడ్ ప్రాంతంలో ఉన్న నిర్మాణాలకు మార్కింగ్ చేసి, నివాసితులను డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు తరలించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. గురువారం గ్రేటర్ పరిధిలోని మూడు జిల్లాల్లో రెవెన్యూ అధికారుల సర్వే ప్రశాంతంగా జరిగింది. హైదరాబాద్ జిల్లా పరిధిలో 16 బృందాలు, రంగారెడ్డి జిల్లాలో నాలుగు టీమ్స్, మేడ్చల్ జిల్లాలో 5 టీమ్స్.. మూసీ రివర్ బెడ్‌లో ఉన్న ప్రతి ఇల్లూ తిరుగుతూ.. వివరాలు సేకరించి, ఇండ్లకు మార్క్ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు వెళ్లడానికి నివాసితులను ఒప్పించారు. కొన్నిచోట్ల అధికారులకు తమ డిమాండ్లను నివాసితులు తెలియచేశారు. నిర్మాణాలు అధికంగా ఉన్న బహదూర్‌పురాలో ఐదు



బృందాలు, హిమాయత్‌నగర్, నాంపల్లిలో మూడు టీములు పనిచేశాయి. ఉదయం 9 గంటలకే ఫీల్డ్‌లోకి వెళ్లిన అధికార బృందాలు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాయి. సొంత ఇండ్లా? అద్దెకు ఉంటున్నారా? ఎన్నేండ్ల నుంచి ఉంటున్నారు? ఎంతమంది ఉంటున్నారు? ఆధార్ కార్డ్?, రేషన్‌కార్డు?, కరెంట్ బిల్లు?, ఇంటి కాగితాలు, యజమాని ఎవరు? తదితర డాక్యుమెంట్లను పరిశీలించి సర్వే పత్రంలో నమోదు చేసుకున్నారు. చాదర్‌ఘాట్, ...11లో



బిల్కిస్ బానో కేసులో గుజరాత్ సర్కార్‌కు షాక్

దోషులతో బీజేపీ ప్రభుత్వం కుమ్మక్కైనట్టుందని సుప్రీం వ్యాఖ్య

వివరాలు 11లో..

ప్రాణాలు తీసిన పవిత్ర స్నానం

బీహార్‌లో 47 మంది భక్తులు మృతి

వీరిలో 37 మంది చిన్నారులు

సీఎం నితీశ్ సంతాపం

మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా

11లో..





నాణ్యతలేదు

50కి పైగా మందులు గుర్తింపు

ఇందులో పలు ప్రముఖ కంపెనీల ఉత్పత్తులు

ఇవన్నీ మార్కెట్‌లో విరివిగా దొరికేవే

గుర్తించిన సీడీఎస్‌సీఓ

వివరాలు 3లో..

లడ్డూ వెనుక రాజకీయం..

ఓట్ల కోసం నేతల పాట్లు


హిందూత్వ వాదాన్ని తలకెత్తుకుంటున్న టీడీపీ, జేడీయూ

చంద్రబాబుకు కలిసొచ్చిన తిరుపతి ప్రసాద వివాదం

సీతాదేవి కేంద్రంగా నితీశ్ రాజకీయాలు


తమ ఓట్లకు ఎసరు పెడతారేమోనని కలవరపడుతూనే, పవన్ తీరుతో సంబరపడుతున్న బీజేపీ

ఎన్డీఏలో కీలక భాగస్వాములుగా ఉన్న తెలుగుదేశం, జేడీయూ పార్టీలు తమ హిందూ ఓటు బ్యాంకును చెక్కుచెదరకుండా చేసుకునే ప్రయత్నాలలో ఉన్నాయని ఇటీవలి పరిణామాలను బట్టి అర్థమవుతోంది. తిరుపతి లడ్డూ వివాదాన్ని తెలుగుదేశం పార్టీ తనకు అనుకూలంగా మలచుకుంటోంది. లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందంటూ వచ్చిన ఆరోపణలను పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు మొదలు కొని కింది స్థాయి కార్యకర్త వరకూ అందిపుచ్చుకుంటున్నారు. రాష్ట్రంలో తన ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న జగన్‌మోహన రెడ్డి పాలనలో తిరుపతి లడ్డూలో జంతువుల కొవ్వు కలిపారని, ఇదిహిందువుల మనోభావాలను దెబ్బతీయడమే అవుతుందని వారంతా మండిపడుతున్నారు. మరోవైపు



జేడీయూ అధినేత, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కూడా అయోధ్యలో రామ మందిర నిర్మాణాన్ని కొనియాడారు. మందిర నిర్మాణం జరిగిన ఎనిమిది నెలల తర్వాత ఆయనకు ఈ విషయం గుర్తుకు వచ్చింది. సీతాదేవి జన్మస్థలంగా భావిస్తున్న సీతామర్హిలోని పునౌరా ధామ్‌ను అభివృద్ధి చేస్తామని ఆయన ప్రకటించారు. ఈ ఇరువురు నేతల అడుగులు చూస్తుంటే హిందూ ఓట్లన్నీ గుంపగుత్తగా బీజేపీకి పడకుండా చూడాలనే ప్రయత్నంగా కన్పిస్తోంది. లడ్డూ చుట్టూ తిరుగుతున్న ఈ రాజకీయ వివాదాల మాటున ప్రజలెదుర్కొంటున్న అసలు సమస్యలు మరుగున పడుతుండటం కొసమెరుపు. ఈ రాజకీయ క్రీడ భక్తుల విశ్వాసాలను దెబ్బతీయడమే కాక మత విద్వేషాలకు తావిస్తుండటం ఆందోళనాకరం

న్యూఢిల్లీ : కేంద్రంలోని సంకీర్ణ సర్కారులోని పార్టీలు హిందూత్వ అంశాన్ని ఓటు బ్యాంకుగా వాడుకోవటానికి ప్రయత్నిస్తున్నాయి.అటు నితీశ్, ఇటు చంద్రబాబు పోటీపడుతున్నారు. వీరిద్దరి ఓటు రాజకీయాలపై మోడీ మన్‌కీబాత్ మాత్రం బయటకు రావటంలేదు. తిరుపతి లడ్డూ వివాదం ప్రాథమికంగా చూస్తే జగన్‌మోహన రెడ్డిని లక్ష్యంగా చేసుకున్నట్లు కన్పించినా దీర్ఘకాల ప్రయోజనాల రీత్యా తమ హిందూ ఓటు బ్యాంకును పటిష్టపరచుకునేందుకు చేస్తున్న ప్రయత్నంగా చూడవచ్చునని టీడీపీ వర్గాలు ఆంతరంగికంగా చెబుతున్నాయి. 'జగన్‌ను ఇరుకున పెట్టేందుకు చంద్రబాబు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఆయన కేవలం లడ్డూ వివాదాన్నే లేవనెత్తడం లేదు. తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రవేశించేటప్పుడు క్రైస్తవుడైన జగన్ డిక్లరేషన్ ఇవ్వకపోవడాన్ని కూడా ప్రస్తావిస్తున్నారు. ఈ అంశాలను



ముందుకు తేవడం ద్వారా జగన్‌ను కోలుకోకుండా చేయాలని చంద్రబాబు చూస్తున్నారు. ఈ క్రమంలో ఆయన హిందూ భక్తుల మెప్పు కూడా పొందుతున్నారు' అని బీజేపీ సీనియర్ నేత ఒకరు తెలిపారు. 'జగన్‌ను ఆయన ఇరుకున పెడుతున్నప్పుడు టీడీపీతో పొత్తులో ఉన్న మా పార్టీ కూడా ఏం చేయగలదు? బాబును అనుసరించక తప్పదు. ఇక్కడ చంద్రబాబు మంచి ఎత్తుగడ వేశారు' అని చెప్పారు. చంద్రబాబు వ్యూహం వెనుక రాజకీయ ఎత్తుగడలు ఉన్నాయని తాము భావించడం లేదని టీడీపీ నేతలు అంటూనే రాజకీయ ప్రయోజనాలు చేకూరుతాయని అంగీకరిస్తున్నారు. హిందువులలో ఇప్పటికే మంచి మద్దతు ఉన్నందున ...11లో

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూసేకరణ) శాఖ
ఫారం-VI
(ప్రాథమిక నోటిఫికేషన్)

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం-2013, (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1) మరియు రూల్ 19 సబ్ రూల్ (1)ను అనుసరించి)

కలెక్టర్ గారి కార్యాలయం ఫైల్ నం. జె1/764/2023 తేది:20/09/2024
రెవెన్యూ డివిజనల్ అధికారి ఫైల్ నం. బి/90/2024 తేది:20/08/2024
గెజిట్ నెం. 122/2024 తేది:20/09/2024

తెలంగాణ ప్రభుత్వము/ జిల్లా కలెక్టర్, సిద్దిపేట గారి ఆదేశానుసారం దిగువ నిర్దిష్టపరచిన సిద్ధిపేట జిల్లాలోని, సిద్దిపేట (రూరల్) మండలములోని వెంకటాపూర్ గ్రామములో ఉన్న భూమి విస్తీర్ణం ఎ.36.03 గుంటలు ప్రజా ప్రయోజనము నిమిత్తము అనగా కాళేశ్వరం ప్రాజెక్ట్ లో భాగంగా అనంతగిరి రిజర్వాయర్ నుండి కొమురవెల్లి మల్లన్న సాగర్ రిజర్వాయర్ ప్యారాలాల్ కాలువ నిర్మాణము కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరం అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ఈ ప్రకటన జారీ చేయనైనది. ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 35, తేది. 30.06.2017 ద్వారా నీటి పారుదల మరియు కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ శాఖ వారు 10-ఎ అనుసరించి సోషల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ మరియు ఆహార భద్రతను మినహాయింపు ఇవ్వనైనది.

కావున సిద్దిపేట జిల్లాలోని, సిద్దిపేట (రూరల్) మండలములోని వెంకటాపూర్ గ్రామములో ఉన్న భూమి విస్తీర్ణం ఎ.36.03 గుంటలు గల భూమి యొక్క వివరములు, ఈ క్రింది చూపిన వారికి భూసేకరణ పనుల ప్రారంభ నిమిత్తం, ప్రాథమిక నోటిఫికేషన్ జారి చేయనైనది.

షెడ్యూల్

గ్రామము: వెంకటాపూర్ మండలము:సిద్దిపేట(రూరల్) జిల్లా: సిద్దిపేట

క్ర. సం.	సర్వే నం.	భూ సేకరణ చేయు విస్తీర్ణం	భూమి పట్టాదారు/ అనుభవదారు పేరు	భూమి స్వభావం	సరిహద్దులు తూ	ప	ఉ	ద	భూమిపై ఉన్న చెట్లు/ పైపులు/ కట్టడాలు/ బావి/బోర్ ఇతర వివరాలు
1	2	3	4	5	6	7	8	9	10
1	126	0.03/1/2	ముత్యాల పద్మ భర్త లక్ష్మారెడ్డి (ప) గుండాల బాల కిష్టయ్య తండ్రి మల్లయ్య (అ)	పట్టా	127	128	100	134	
2	126	0.03/1/2	ముత్యాల పద్మ భర్త లక్ష్మారెడ్డి (ప) గుండాల దేవయ్య తండ్రి మల్లయ్య (అ)	పట్టా	127	128	100	134	
3	126	1.19	ముత్యాల పద్మ భర్త లక్ష్మారెడ్డి(ప) అంబటి లక్ష్మీ భర్త కనకయ్య(అ)	పట్టా	127	128	100	134	
4	126	1.38	ముత్యాల పద్మ భర్త లక్ష్మారెడ్డి (ప)	పట్టా	127	128	100	134	
5	126	0.37	ముత్యాల పద్మ భర్త లక్ష్మారెడ్డి (ప) దుబ్బ మల్లేశం తండ్రి చంద్రయ్య (అ)	పట్టా	127	128	100	134	
6	127	1.00	దుబ్బ మల్లేశం తండ్రి చంద్రయ్య	లా పట్టా	ఏబీ	126	128	122	బోరు-1 వేప-13
7	127	2.10	అంబటి లక్ష్మీ భర్త కనకయ్య	లా పట్టా	ఏబీ	126	128	122	వేప-5 [illegible]-2
8	128	1.28	ముత్యాల సురేందర్ రెడ్డి తండ్రి వీరా రెడ్డి (ప) బెందరం సుధ భర్త అంజిరెడ్డి (ప) దుంపల సునీత భర్త రాజిరెడ్డి (ప) ముత్యాల శ్రీధర్ రెడ్డి తండ్రి వీరారెడ్డి (ప) ముత్యాల వేణుగోపాల్‌రెడ్డి తండ్రి రాజిరెడ్డి (ప) రాజారి శివకుమార్ తండ్రి లింగయ్య(ప) ముత్యాల లక్ష్మణ్ బాబు తండ్రి నర్సింహా రెడ్డి (ప)	పట్టా	ఏబీ	129	134	126	
9	128	6.38	ముత్యాల సురేందర్ రెడ్డి తండ్రి వీరా రెడ్డి (ప) బెందరం సుధ భర్త అంజిరెడ్డి (ప) దుంపల సునీత భర్త రాజిరెడ్డి (ప) ముత్యాల శ్రీధర్ రెడ్డి తండ్రి వీరారెడ్డి (ప) ముత్యాల వేణుగోపాల్‌రెడ్డి తండ్రి రాజిరెడ్డి (ప) రాజారి శివకుమార్ తండ్రి లింగయ్య(ప) ముత్యాల లక్ష్మణ్ బాబు తండ్రి నర్సింహా రెడ్డి (ప)	పట్టా	ఏబీ	129	134	126	
10	128	0.08	ముత్యాల సురేందర్ రెడ్డి తండ్రి వీరా రెడ్డి (ప) బెందరం సుధ భర్త అంజిరెడ్డి (ప) దుంపల సునీత భర్త రాజిరెడ్డి (ప) ముత్యాల శ్రీధర్ రెడ్డి తండ్రి వీరారెడ్డి (ప) ముత్యాల వేణుగోపాల్‌రెడ్డి తండ్రి రాజిరెడ్డి (ప) రాజారి శివకుమార్ తండ్రి లింగయ్య(ప) ముత్యాల లక్ష్మణ్ బాబు తండ్రి నర్సింహా రెడ్డి (ప) దుబ్బా మల్లేశం తండ్రి చంద్రయ్య (అ)	పట్టా	ఏబీ	129	134	126	
11	134	0.18	గజ్జెల ఎల్లయ్య తండ్రి రామయ్య	పట్టా	ఏబీ	133	128	135	వేప-10, రేగంగి-10, టేకు-5, ఈత-5
		0.10 1/6	బొల్లి మల్లేశం తండ్రి రాజయ్య (ప) గజ్జెల ఎల్లయ్య తండ్రి రామయ్య (అ)	పట్టా	ఏబీ	133	128	135	
12	134	0.18	గజ్జెల లింగయ్య తండ్రి రామయ్య	పట్టా	ఏబీ	133	128	135	వేప-10, రేగంగి-10, టేకు-5, ఈత-5
		0.10 1/6	బొల్లి మల్లేశం తండ్రి రాజయ్య (ప) గజ్జెల ఎల్లయ్య తండ్రి రామయ్య (అ)	పట్టా	ఏబీ	133	128	135	
13	134	1.18	అయిండ్ల రాఘవ రెడ్డి తండ్రి రాం రెడ్డి	పట్టా	ఏబీ	133	128	135	వేప-15, టేకు-20, కానుగ-20, కర్జూరం-5, [illegible]-20, ఈత-20
14	134	2.27	పేర్క నరేందర్ తండ్రి కొమురయ్య	పట్టా	ఏబీ	133	128	135	వేప-12, బోర్-1, పైప్లైన్-1
15	134	1.17	గుండాల ఎల్లవ్వ భర్త రామకిష్టయ్య	పట్టా	ఏబీ	133	128	135	వేప-5, పైప్లైన్, గుడి
		0.01	బొల్లి మల్లేశం తండ్రి రాజయ్య (ప) గుండాల ఎల్లవ్వ భర్త రామకిష్టయ్య(అ)	పట్టా	ఏబీ	133	128	135	
16	134	0.14	గుండాల మల్లేశం తండ్రి రాజయ్య	పట్టా	ఏబీ	133	128	135	వేప-2,టేకు-2
		0.00 1/4	బొల్లి మల్లేశం తండ్రి రాజయ్య (ప) గుండాల మల్లేశం తండ్రి రాజయ్య(అ)	పట్టా	ఏబీ	133	128	135	
17	134	0.08	గుండాల వెంకటయ్య తండ్రి రాజయ్య	పట్టా	ఏబీ	133	128	135	
		0.06 1/4	బొల్లి మల్లేశం తండ్రి రాజయ్య (ప) గుండాల వెంకటయ్య తండ్రి రాజయ్య (అ)	పట్టా	ఏబీ	133	128	135	
18	134	0.14	గుండాల సాయిబాబా తండ్రి మైసయ్య	పట్టా	ఏబీ	133	128	135	
		0.00 1/4	బొల్లి మల్లేశం తండ్రి రాజయ్య (ప) గుండాల సాయిబాబా తండ్రి మైసయ్య	పట్టా	ఏబీ	133	128	135	రేగంగి-5, సీతాఫల్-2
19	134	0.14	గుండాల బాల్ కిష్టయ్య తండ్రి మల్లయ్య	పట్టా	ఏబీ	133	128	135	వేప-2, బోర్-1
		0.00 1/4	బొల్లి మల్లేశం తండ్రి రాజయ్య (ప) గుండాల బాల్ కిష్టయ్య తండ్రి మల్లయ్య (అ)	పట్టా	ఏబీ	133	128	135	
20	134	0.07	గుండాల దేవయ్య తండ్రి మల్లయ్య	పట్టా	ఏబీ	133	128	135	వేప-2,టేకు-2 మైసమ్మ గుడి
21	134	0.25 1/6	గజ్జెల మహేష్ తండ్రి లింగయ్య	పట్టా	ఏబీ	133	128	135	వేప-5,టేకు-5 సీతాఫల్-2
22	134	0.25 1/6	గజ్జెల రాజశేఖర్ తండ్రి ఎల్లయ్య	పట్టా	ఏబీ	133	128	135	వేప-5,టేకు-5
23	135	1.12	గజ్జెల నర్సవ్వ భర్త లింగయ్య(ప) బాల్ రాజ్ కృష్ణమూర్తి (అ)	పట్టా	670	238	236	134	
24	135	0.36	ఎదుమ అంజయ్య తండ్రి వీరయ్య(ప) ముత్యాల రామవ్వ భర్త వెంకటరెడ్డి(అ)	పట్టా	670	238	236	134	ఈత-10, తుమ్మ-10, [illegible]-15, సీతాఫల్-5
25	135	0.22	అయిండ్ల రాఘవ రెడ్డి తండ్రి రాం రెడ్డి	పట్టా	670	238	236	134	
26	135	0.09	ఎదుమ అంజయ్య తండ్రి వీరయ్య(ప) గుండ్ల ఎల్లవ్వ భర్త రామకిష్టయ్య(అ)	పట్టా	670	238	236	134	
27	135	0.01 1/6	తల్లాడి రమేశ్ తండ్రి బాల్ రాజయ్య(ప) గుండాల దేవయ్య తండ్రి మల్లయ్య(అ)	పట్టా	670	238	236	134	
28	135	0.01 1/6	తల్లాడి రమేశ్ తండ్రి బాల్ రాజయ్య(ప) గుండాల బాలకిష్టయ్య తండ్రి మల్లయ్య(అ)	పట్టా	670	238	236	134	
29	135	0.03	తల్లాడి రమేశ్ తండ్రి బాల్‌రాజయ్య(ప) గుండాల సాయిబాబా తండ్రి మైసయ్య (అ)	పట్టా	670	238	236	134	
30	135	0.04 1/6	గుండాల వెంకయ్య తండ్రి రాజయ్య	పట్టా	670	238	236	134	
31	135	0.14 1/6	తల్లాడి రమేశ్ తండ్రి బాల్‌రాజయ్య(ప) గుండాల మల్లేశం తండ్రి రాజయ్య (అ)	పట్టా	670	238	236	134	
32	135	0.14	తల్లాడి రమేశ్ తండ్రి బాల్‌రాజయ్య(ప) గుండాల ఎల్లవ్వ భర్త రామ కిష్టయ్య (అ)	పట్టా	670	238	236	134	
33	136	0.26	గుండాల ఎల్లవ్వ భర్త రామకిష్టయ్య	పట్టా	666	238	138	135	రాతి దిబ్బ-1, ఈత-10, వేప-15, బొప్పాయి-10, పైప్లైన్-1
34	136	0.39	గుండాల వెంకటయ్య తండ్రి రాజయ్య	పట్టా	666	238	138	135	
35	136	0.34	గుండాల మల్లేశం తండ్రి రాజయ్య	పట్టా	666	238	138	135	
		0.04	గుండాల ఎల్లవ్వ భర్త రామకిష్టయ్య(ప) గుండాల మల్లేశం తండ్రి రాజయ్య(అ)	పట్టా	666	238	138	135	
36	136	1.05	గుండాల బాలకిష్టయ్య తండ్రి మల్లయ్య	పట్టా	666	238	138	135	వేప-4, ఈత-2, వేప-4, [illegible]-2
37	136	0.05 1/6	గుండాల ఎల్లవ్వ భర్త రామకిష్టయ్య	పట్టా	666	238	138	135	
38	136	0.01 3/4	గుండాల బాలకిష్టయ్య తండ్రి మల్లయ్య	పట్టా	666	238	138	135	
39	136	0.01 3/4	గుండాల సాయిబాబా తండ్రి మైసయ్య	పట్టా	666	238	138	135	
40	136	0.02	గుండాల వెంకటయ్య తండ్రి రాజయ్య	పట్టా	666	238	138	135	
41	136	0.02 1/6	గుండాల ఎల్లవ్వ భర్త రామకిష్టయ్య(ప) గుండాల మల్లేశం తండ్రి రాజయ్య(అ)	పట్టా	666	238	138	135	
42	136	0.05	గుండాల ఎల్లవ్వ భర్త రామకిష్టయ్య(ప) మంథని ఎల్లయ్య తండ్రి మల్లయ్య (అ)	పట్టా	666	238	138	135	
43	136	0.05	గుండాల ఎల్లవ్వ భర్త రామకిష్టయ్య(ప) మంథని మల్లేశం తండ్రి మల్లయ్య (అ)	పట్టా	666	238	138	135	
44	136	0.8	గుండాల సాయిబాబా తండ్రి మైసయ్య	పట్టా	666	238	138	135	
45	137	0.03 1/2	మంథని ఎల్లయ్య తండ్రి మల్లయ్య(ప) గుండాల వెంకటయ్య తండ్రి రాజయ్య(అ)		136	138	100	101	
46	137	0.03 1/2	మంథని మల్లేశం తండ్రి మల్లయ్య(ప) గుండాల మల్లేశం తండ్రి రాజయ్య(అ)		136	138	100	101	
47	137	0.03 1/6	ముత్యాల సురేందర్‌రెడ్డి తండ్రి వీరారెడ్డి(ప) గుండాల సాయిబాబా తండ్రి మైసయ్య (అ)		136	138	100	101	30-ఈత-4-టేకు,10-వేప, 5-మామిడి
48	137	0.01	మంథని ఎల్లయ్య తండ్రి మల్లయ్య		136	138	100	101	ఈత-8 వేప-8
49	137	0.01	మంథని మల్లేశం తండ్రి మల్లయ్య		136	138	100	101	ఈత-8 వేప-8
50	137	0.01 3/4	ముత్యాల దామోదర్ రెడ్డి తండ్రి వెంకటరెడ్డి(ప) గుండాల దేవయ్య తండ్రి మల్లయ్య (అ)		136	138	100	101	
51	137	0.01 3/4	ముత్యాల నారాయణ రెడ్డి తండ్రి వెంకటరెడ్డి(ప) గుండాలబాల్ కిష్టయ్య తండ్రి మల్లయ్య (అ)		136	138	100	101	
52	138	0.10	చిటుమల్ల లక్ష్మీనారాయణ తండ్రి దర్గయ్య (ప) గుండాల వెంకటయ్య తండ్రి రాజయ్య (అ)	పట్టా	ఏబీ	100	125	136	
53	138	0.06 1/2	చిటుమల్ల లక్ష్మీనారాయణ తండ్రి దర్గయ్య (ప) మంథని ఎల్లయ్య తండ్రి మల్లయ్య (అ)	పట్టా	ఏబీ	100	125	136	
54	138	0.06 1/2	చిటుమల్ల లక్ష్మీనారాయణ తండ్రి దర్గయ్య (ప) మంథని మల్లేశం తండ్రి మల్లయ్య (అ)	పట్టా	ఏబీ	100	125	136	
55	138	0.10	చిటుమల్ల లక్ష్మీనారాయణ తండ్రి దర్గయ్య (ప) గుండాల మల్లేశం తండ్రి రాజయ్య (అ)	పట్టా	ఏబీ	100	125	136	
56	138	0.10	చిటుమల్ల లక్ష్మీనారాయణ తండ్రి దర్గయ్య (ప) గుండాల సాయిబాబా తండ్రి మైసయ్య (అ)	పట్టా	ఏబీ	100	125	136	
57	138	0.05	చిటుమల్ల లక్ష్మీనారాయణ తండ్రి దర్గయ్య (ప) గుండాల దేవయ్య తండ్రి మల్లయ్య (అ)	పట్టా	ఏబీ	100	125	136	
58	138	0.05	చిటుమల్ల లక్ష్మీనారాయణ తండ్రి దర్గయ్య (ప) గుండాల బాల్ కిష్టయ్య తండ్రి మల్లయ్య (అ)	పట్టా	ఏబీ	100	125	136	
59	138	0.06	చిటుమల్ల లక్ష్మీనారాయణ తండ్రి దర్గయ్య (ప) గుండాల సాయిబాబా తండ్రి మైసయ్య (అ)	పట్టా	ఏబీ	100	125	136	
60	138	0.08	బి.టి రోడ్	పట్టా	ఏబీ	100	125	136	
61	238	0.02 1/6	ఎర్ర లచ్చవ్వ భర్త చంద్రయ్య	లా పట్టా	ఏబీ	100	125	136	
62	238	0.02	ఎర్ర రాములు తండ్రి రాజయ్య	లా పట్టా	ఏబీ	100	125	136	
63	238	0.01 1/6	ఎర్ర లచ్చవ్వ భర్త చంద్రయ్య(ప) ఎర్ర పద్మ రాముల తండ్రి రాజయ్య(అ)	లా పట్టా	ఏబీ	100	125	136	
64	238	0.04	బి.టి. రోడ్	లా పట్టా	ఏబీ	100	125	136	
మొత్తము విస్తీర్ణం			36.03						

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013, సెక్షన్ 11(1) ప్రకారం సంబంధిత భూయజమానులకు చట్ట ప్రకారం భూనష్ట పరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీచేయనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్ సిద్దిపేట మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ భూసేకరణ యూనిట్-1, సిద్దిపేట వారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయాల పనివేళలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్ సిద్దిపేట గారు ప్రత్యేక ఉప కలెక్టర్, భూసేకరణ యూనిట్-1, సిద్దిపేట గారిని మరియు వారి సిబ్బంది ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్-12 ప్రకారం పై తెలిపిన భూములలో యేదని ప్రదేశములో ప్రవేశించి సర్వే జరిపి భూశమతాన్ని కొలిచే అధికారం, భూమిని త్రవ్వటానికి లేదా భూ స్వరూపం తెలుపు బోర్ వెయ్యటానికి మరియు అవసరమైన ఇతర చర్యలు చేయ్యటానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, సిద్దిపేట గారి అనుమతి లేకుండా ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన తేది నుండి ఆ నోటిఫికేషన్ లో ఉదహరించబడిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి కొనుగోలు/అమ్మకాలు తాకట్లకు సంబంధించిన చర్యలు చేపట్టరాదు.

ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ అనంతరం పైన చూపిన భూములలో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైన భూసేకరణ పై సెక్షన్ 15(1) ప్రకారం అభ్యంతరములు ఉన్నచో, ఇట్టి నోటిఫికేషన్ జారీ చేసిన (60) దినములలో భూసేకరణ అధికారి ముందు వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/-	సం/-	సం/-	సం/-
తహశీల్దార్, సిద్దిపేట(రూరల్) మండలము	ప్రత్యేక ఉప-కలెక్టర్ (భూసేకరణ) యూనిట్-1కాళేశ్వరం ప్రాజెక్ట్ సిద్దిపేట జిల్లా	అదనపు కలెక్టర్, సిద్దిపేట జిల్లా	జిల్లా కలెక్టర్ సిద్దిపేట జిల్లా

DIPR Ro.No.282/LA-PP/Advt/Pub/2024-25

పాడి రైతుల బకాయిలు వెంటనే చెల్లించాలి

- లీటర్‌పై రూ.5 ప్రోత్సాహకం అందించాలి : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాడి రైతుల బకాయిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. గురువారం హైదరా బాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద తెలంగాణ పాడి ఉత్పత్తి దారుల సంఘం, టీజీ విజయ డెయిరీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన పాడి రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహించి ఆందోళన చేశారు. ప్లకార్డులు, జెండాలు పట్టుకుని తమ డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టుగా ప్రతి లీటర్ పాలపై రూ.5 ప్రోత్సా హకం అందించాలనీ, పాడి సంరక్షణకు మందులు, విత్తనాలు, ఎరువులు, పాల టెస్టర్లు, చాప్ కట్టర్లు, మిల్క్ అనలైజర్లు ఇతర పనిముట్లు 50 శాతం సబ్సిడీపై అందిం చాలని కోరారు. పశుపోషణ పథకాన్ని అమలు చేస్తూ, ప్రభుత్వమే ఇన్సూరెన్స్ చెల్లించాలనీ, పాడి రైతుల పిల్లలకు ఉపకార వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. పశుసంవర్థక శాఖలోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ హరిబండి ప్రసాద్ మాట్లాడుతూ పాడి రైతులకు నెలనెలా చెల్లించాల్సిన బకాయిలు, ఇతర ప్రోత్సాహకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రైతులతో చర్చించి శాశ్వత పరిష్కారం కనుగొ నాలని సూచించారు. రాష్ట్రం వ్యాప్తంగా గ్రామా లను యూనిట్‌గా తీసుకుని పశుగ్రాసం పెంపకం కోసం ఉమ్మడిగా భూమి కేటాయించాలని కోరారు. రైతు సంఘ నాయకులు శోభన్, ఉప్పలయ్య జిల్లాల రైతులు ఈ సందర్భంగా రైతులెదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. పాడి రైతుల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవాలని సమావేశం నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో వీరమల్లు రాజయ్య, జి వెంకటేష్, ఉత్తమ్, రమేష్, రాజయ్య కష్ట, రాఘవ తదితరులు పాల్గొన్నారు

30న ఫార్మాసిస్టు పోస్టులకు జాబ్ మేళా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ఫార్మసీలో డిప్లొమా, డిగ్రీ, మాస్టర్స్ చేసిన వారికి ఈనెల 30న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ చీఫ్ టీ.రాము తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అపోలో ఫార్మసీ కంపెనీ ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళాను ఫార్మాసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్ ఉద్యోగాలకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 30న ఉదయం 11 గంటలకు అభ్యర్థులు నేరుగా బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్లతో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లా యి మెంట్ బ్యూరో వద్ద హాజరు కావాలని ఆయన కోరారు.

సీఎంఆర్ 'ధాన్యం'లో దగా..!

రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లులపై దాడులు

- కస్టమ్ మిల్లింగ్ రైస్ బకాయిలు బట్టబయలు
- ఖమ్మం జిల్లాలో రూ. 82 కోట్ల ధాన్యం బకాయి
- ఎస్ఏఆర్ రైస్‌మిల్లు యజమాని రమాజ్యోతిపై క్రిమినల్ కేసు
- స్థానిక అధికారులతో కుమ్మక్కై అడ్డగోలు వ్యవహారం
- రూ.కోట్లలో ముడుపులపై స్థానిక అధికారిని ప్రశ్నించిన మిల్లర్?



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)లో పెద్దఎత్తున బకాయి పేరుకుపోవడమే కాకుండా దగా జరుగుతున్నట్టు ఎప్పటి నుంచో పెద్దఎత్తున ఆరోపణలొస్తున్నాయి. ఈ క్రమంలో నెంబర్ 1 మహిళా పారిశ్రామికవేత్త, ఎస్ఏఆర్ రైస్‌మిల్ యజమాని రమాజ్యోతి అడ్డగోలు వ్యవహారం బట్టబయలైంది. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బకాయిల విషయంలో రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లయ్స్, టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఖమ్మం జిల్లాలో పెద్దమొత్తం లో బకాయి పడిన కొణిజర్ల మండలం లాలాపురం సమీపంలోని ఎస్ఏఆర్ రైస్ ప్రొడక్ట్స్ మిల్లులోనూ రెండ్రోజులపాటు సోదాలు చేశారు. సీఎంఆర్‌లో 25వేల టన్నుల ధాన్యం వ్యత్యాసం ఉన్నట్టు అధికారులు గుర్తించారు. దీని విలువ రూ.82 కోట్లకుపైగా ఉంటుందని భావిస్తున్నారు. రైస్‌మిల్ యజమాని రమాజ్యోతిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఖమ్మం జిల్లా పౌరసరఫరాల శాఖకు చెందిన ఓ కీలక అధికారికి రూ.కోట్లలో ముడుపులు ఇచ్చి రమాజ్యోతి ఈ వ్యవహారం నడిపినట్టు తెలుస్తోంది. రాష్ట్రస్థాయి అధికారులతో కలిసి ఆ అధికారి సైతం తనిఖీల్లో పాల్గొనడంతో మిల్లు యాజమాన్యం అక్కడే నిలదీసినట్టు సమాచారం. తమ నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని ఇప్పుడిలా దాడులు చేయడమేంటని సదరు అధికారిని మిల్లు యాజమాన్యం ప్రశ్నించినట్టు చర్చ నడుస్తోంది.

సకాలంలో సీఎంఆర్ అప్పగించని మిల్లర్లపై చర్యలు

ధాన్యం ఇచ్చేటప్పుడే మిల్లర్ల నుంచి సెక్యూరిటీ డిపాజిట్ తీసుకోవడంతో పాటు బ్యాంకు గ్యారెంటీ లేకుండా వేల కోట్ల విలువ చేసే ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగించే విధానానికి స్వస్తి పలకాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థానిక అధికారులు రూ.కోట్లలో ముడుపులు తీసుకొని.. మిల్లర్లు సకాలంలో సీఎంఆర్ అప్పగించకపోయినా ఉదాసీనతతో వ్యవహరిస్తుండటంపై ప్రభుత్వం దృష్టి సారించింది. దీనిలో భాగంగానే 2022-23 రబీ, 2023-24 ఖరీఫ్ సీజన్‌లో సీఎంఆర్ అప్పగించని సంస్థలపై ప్రభుత్వం కొరడా ఝులిపిస్తోంది. దీనిలో భాగంగా కొద్దిరోజుల కిందట సూర్యాపేట జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఇమ్మడి సోమనర్సయ్య, ఆయన సోదరుడు సోమయ్యను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఖమ్మం జిల్లాకు చెందిన రమాజ్యోతిపై క్రిమినల్ కేసు పెట్టారు. మిల్లుకు కేటాయించిన ధాన్యానికి తగినట్టుగా బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించకపోగా.. మర ఆడించిన ధాన్యం నిల్వల్లో పెద్ద మొత్తంలో తేడా వస్తుండటంపై రమాజ్యోతితో పాటు మహబూబాబాద్ జిల్లాలోని మరో రెండు మిల్లులపైనా కేసులు నమోదు చేశారు.

అధికారితో కుమ్మక్కు..

స్థానిక అధికారులతో కుమ్మక్కైన రమాజ్యోతి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుంటారనే టాక్ కొణిజర్ల మండలంలో వినిపిస్తోంది. స్థానిక రైతుల ధాన్యం కాకుండా వలస వచ్చిన ఆంధ్రా ప్రాంత రైతుల వద్దను కొనుగోలు చేస్తుంటారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఆమె ఓ లారీ బియ్యాన్ని బయట నుంచి తెప్పించారు. ఆ రైస్ తడిసిందని లారీని తన దగ్గరే ఉంచుకున్నట్టు సమాచారం. ఆంధ్రా నుంచి రేషన్ బియ్యం లోడ్‌లకు లోడ్‌లు తీసుకొచ్చి ప్రభుత్వం ఇచ్చిన ధాన్యానికి బదులు వాటిని మర ఆడించి సర్కారుకు సరఫరా చేస్తుంటారనే ఆరోపణలు రమాజ్యోతిపై ఉన్నాయి. స్థానిక రైతుల వద్ద కొనుగోలు చేయకపోవడం, క్వింటాల్‌కు రెండు కేజీల తరుగు తీయాల్సి ఉండగా ఎస్ఏఆర్ మిల్లులో పది కిలోలు కోత పెడతారని రైతులు వాపో తున్నారు. వీటన్నింటికీ స్థానిక అధికారి ఒకరు ఆమెకు సహకరిస్తుంటా రనే టాక్ వినిపి స్తోంది. ప్రస్తుతం మిల్లు యజమాని పరారీలో ఉన్నారు. దీనిపై జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్‌ను వివరణ కోరగా.. మిల్లర్ రమా జ్యోతిపై క్రిమినల్ కేసు నమోదు చేశామని చెప్పా రు. ధాన్యం వ్యత్యాసాన్ని భర్తీ చేస్తామని యజ మాని అంటున్నా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ వ్యవ హారం లో తమ డిపార్ట్‌మెంట్ అధికారిపై వస్తున్న ఆరోపణలపై స్పందించేందుకు విముఖత వ్యక్తం చేశారు.

2.51 లక్షల క్వింటాళ్ల తేడా

2022-23 రబీ సీజన్, 2023-24 ఖరీఫ్ సీజన్‌కుగాను ఎస్ఏఆర్ రైస్ మిల్లుకు 3,50,622.65 క్వింటాళ్ల ధాన్యాన్ని అప్పటి ప్రభుత్వం అప్పగించింది. 99,122.68 క్వింటాళ్ల ధాన్యాన్ని మాత్రమే ఈ రైస్‌మిల్లులో మర ఆడించారు. మిగిలిన 2,51,499.97 క్వింటాళ్ల తేడా ఉందని అధికారులు గుర్తించారు. ఆ ధాన్యాన్ని బయటకు తరలించడంతో మిల్లర్ రమాజ్యోతిపై కేసు నమోదు చేశారు. అధికారులు తేల్చిన వ్యత్యాసాన్ని ప్రభుత్వానికి చెల్లిస్తామని యజమాని చెబుతున్నారు. స్థానిక అధికారులు మిల్లర్‌తో కుమ్మక్కైన కారణంగానే ఇంత పెద్ద మొత్తంలో తేడా వస్తున్నా పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి.

చాకలి ఐలమ్మ విగ్రహాన్ని త్వరలో ఏర్పాటు చేస్తాం

- మంత్రి పొన్నం ప్రభాకర్
- రవీంద్రభారతిలో ఐలమ్మ జయంతి వేడుకలు

నవతెలంగాణ-కల్చరల్

తెలంగాణ పోరాటానికి, త్యాగానికి గుర్తుగా వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో గురువారం ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మెన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. త్యాగానికి గుర్తుగా ఐలమ్మ పేరును మహిళా విశ్వవిద్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వం పెట్టిందని గుర్తు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఐలమ్మ త్యాగాన్ని గుర్తించని వారు, ఇప్పుడు నిరసనలు తెలుపుతున్నారని విమర్శించారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ బీసీలను విస్మరిం చిందన్నారు. కుల గణనకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో బలహీన వర్గాల ఫెడరేషన్‌లో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది త్యాగాలు చేశారని, వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. ఐలమ్మకు నిజమైన నివాళి అంటే ఆమె పోరాటపటిమను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగడమేనని అన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ.. ఐలమ్మ చరిత్రను పుస్తక రూపంలోకి తీసుకురావాలని అన్నారు. ఐలమ్మ స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమాన్ని నిర్వహించామని గుర్తు చేసుకు న్నారు. గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లిపోయిందని విమర్శించారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ.. తొలి భూ పోరాటా నికి, సామాజిక ఆధునిక పరిణా మానికి నాంది పలికిన ధైర్య శాలి ఐలమ్మ అని కొనియాడారు. తెలంగాణ బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పు కణిక ఐలమ్మ అని అన్నారు. ఈ కార్య క్రమంలో రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్, తెలంగాణ బీసీ కమిషన్ సభ్యులు తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, రాపోలు జయప్రకాష్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కమిషనర్ బి.బాలమాయ దేవి, మహాత్మ జ్యోతి రావు పూలే బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బి.సైదులు, తెలంగాణ అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ ముఖ్య కార్యని ర్వహణ అధికారి కె.అలోక్ కుమార్, తెలంగాణ వెనుకబడిన తరగతుల ఆర్థిక సంస్థ వైస్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మల్లయ్య బట్టు, తెలంగాణ రజక సహకార సంఘాల సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్, చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీ కో చైర్మెన్లు మావురపు నరసింహ, చిట్యాల శ్వేతా ఐలమ్మ, కన్వీనర్లు పాల్గొన్నారు.

గ్లోబల్ సిటీగా హైదరాబాద్

- తరలివస్తున్న అంతర్జాతీయ వాణిజ్య, వ్యాపార సంస్థలు
- విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు : ముఫకంజా ఇంజినీరింగ్ కాలేజీ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ మహానగరం గ్లోబల్ సిటీగా రూపాంతరం చెందుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వాణిజ్య, వ్యాపార సంస్థలు ఇక్కడికి తరలిరావడం, ప్రపంచం నలుమూలల నుంచి పెట్టుబడులు వెల్లువెత్తడమే ఇందుకు నిదర్శనమన్నారు. గురువారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ముఫకంజా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, టెక్నాలజీలో నూతన విద్యార్థుల ప్రారంభోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ మహిపాల్ సింగ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి జాఫర్ జావేద్, గౌరీ పాటిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వృద్ధి రేటులో యావత్ భారతదేశంలోనే తెలంగాణ అగ్రభాగాన నిల్చిందన్నారు. ఇక్కడ పరిశ్రమలను నెలకొల్పేందుకు ప్రపంచ స్థాయిలో పోటీ పడుతున్నాయని చెప్పారు. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు వాణిజ్యవేత్తలు ఆసక్తి కనబరుస్తున్నారని వివరించారు. ఉన్నత విద్యావంతులకు గ్లోబల్ సిటీగా రూపాం తరం చెందుతోన్న హైదరాబాద్ మహానగరంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. ఇప్పుడు ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. భవిష్యత్తును ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దుకునేందుకు ఎంచుకున్న ఏ మార్గమైనా ఉత్సాహంగా ఉల్లాసంగా గడపాలని కోరారు.

తెలంగాణ ప్రభుత్వం
పురపాలక సంఘం ఆర్మూర్, నిజామాబాద్ జిల్లా
ఇ1/10/కౌన్సిల్/ఇన్ పెట్టి మార్చ్/2024. తేది : 26.09.2024

[illegible]

సం/- కమిషనర్, పురపాలక సంఘం ఆర్మూర్

DIPR R.O.No.4607-PP/CL/ADVT/1/2024-25, Dt:26.09.2024



మహారాష్ట్రను ముంచెత్తిన భారీ వర్షాలు

ఐదుగురు మృతి

ముంబయికి ఐఎండీ ఆరెంజ్ అలర్ట్

థానే, పాల్ఘర్, రాయ్‌గడ్ జిల్లాలకు రెడ్ అలర్ట్

ముంబయి : భారీ వర్షాలు మహారాష్ట్రను ముంచెత్తుతున్నాయి. బుధవారం కురిసిన భారీ వర్షాలు పలు నగరాలను అతలాకుతలం చేశాయి. భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలో ఐదుగురు మృతి చెందినట్టు అధికారులు తెలిపారు. ఇందులో ఒకరు ముంబయి నుంచి, ఒకరు రాయ్‌గఢ్ నుంచి, ముగ్గురు కళ్యాణ్ నుంచి ఉన్నారు. రాష్ట్రంలో వర్షాలు మరింతగా పడే అవకాశమున్నదని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) హెచ్చరించింది. అలాగే, ముంబయికి ఆరెంజ్ అలర్ట్‌ను, థానే, పాల్ఘర్, రాయ్‌గడ్ జిల్లాలకు రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. ముంబయిలో ఉరుములు, మెరుపులతో గంటలకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. గురువారం పూణేలో అత్యధికంగా 133 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందనీ, సెప్టెంబర్‌లో ఇదే అధిక వర్షపాతమని గుర్తించింది. ఇది పూణే చరిత్రలో మూడో అత్యధిక వర్షపాతమని తెలిపింది.

భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ముంబయి, థానే, పాల్ఘర్, పూణే, పింప్రి- చించ్వాడ్‌తో సహా పలు జిల్లాల్లో పాఠశాలలు, కాలేజీలు మూతపడ్డాయి. భారీ వర్షాల తర్వాత గురువారం ముంబయిలో వాహన రాకపోకలు, రైలు సర్వీసులు కొనసాగాయి. నగరంలో భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విమానాలు, లోకల్ ట్రైన్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షాలకు ముంబయిలోని అంధేరీ ఈస్ట్‌లో ఒక మహిళ ఓపెన్ డ్రైయినేజీలో మునిగి చనిపోయింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు జరపటం కోసం బృహన్‌ముంబయి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ భూషన్ గగ్రానీ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయటానికి ఆదేశించారు. మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని తెలిపారు. వచ్చేనెల 1 వరకు ముంబయిలో వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. బుధవారం ఉదయం కురిసిన భారీ వర్షాలకు ముంబయిలోని పలు ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. పలు ప్రాంతాల్లో 100 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది.

ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాల్సిందే...

లేదంటే సమ్మెకైనా సిద్ధం

నోటిఫికేషన్లను అడ్డుకుంటాం

కాంగ్రెస్ ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి

ఆర్టిజన్ల మహాధర్నాలో జేఏసీ నేతల హెచ్చరిక



టీజీఎస్‌పీడీసీఎల్ ఆఫీస్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్న ఆర్టిజన్లు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్- జేఏసీ డిమాండ్ చేసింది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్లడానికైనా సిద్ధమని ప్రకటించింది. ఆర్టిజన్లను కాదని, కొత్త నోటిఫికేషన్లు వేసినా, కొత్త నియామకాలు చేపట్టినా అడ్డుకుంటామని హెచ్చరించింది. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లోని మింట్‌కంపౌండ్ టీజీఎస్‌పీడీసీఎల్ ఆఫీస్ వద్ద ఆర్టిజన్లు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. తమను కన్వర్షన్ చేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు.

'వూయ్ వాంట్ కన్వర్షన్' అంటూ పెద్ద పెట్టున నినదించారు. ఈ సందర్భంగా ఆర్టిజన్లను కన్వర్షన్ చేసే వరకు జేఎల్ఎం, సబ్‌ఇంజనీర్, జూనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేటర్స్ పోస్టులను భర్తీ చేయొద్దంటూ టీజీఎస్‌పీడీసీఎల్ చైర్మెన్, ఎమ్‌డీకి జేఏసీ నేతలు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ధర్నానుద్దేశించి జేఏసీ చైర్మెన్ కే ఈశ్వర్‌రావు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో 23వేల మంది ఆర్టిజన్లు పని చేస్తున్నారని తెలిపారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తున్నామంటూ 2017లో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించిందని గుర్తు చేశారు. ఈ విషయాన్ని అనేక వేదికల మీద చెప్పిందన్నారు. ఆ తర్వాత ఆర్టిజన్లను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. ఈనేపథ్యంలో ఆర్టిజన్లు జేఏసీగా ఏర్పడి ఉద్యమానికి సిద్ధమవుతున్నట్టు తెలిపారు. కేసీఆర్ మాదిరిగా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తమను కన్వర్షన్ చేయాలని కోరారు. 23వేల మంది ఆర్టిజన్లలో చాలా మంది రిటైర్డ్ అయ్యారనీ, కొంత మంది విధి నిర్వహణలో ప్రమాదానికి గురై చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా మిగిలింది 20వేల మందేననీ, వారినైనా కన్వర్షన్ చేయాలని కోరారు. ఆర్టిజన్లలో డిప్లొమో చేసిన వారికి సబ్ ఇంజనీర్, ఐటీఐ చదివిన వారికి జూనియర్ లైన్‌మెన్, డిగ్రీ, బిటెక్, ఎంటెక్ చదివిన వారికి జూనియర్ అసిస్టెంట్, టెన్త్, ఇంటర్ చదివిన వారికి సబార్డినేటర్ పోస్టు, చదువుకోలేని వారికి అటెండర్ పోస్టులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈవిధంగా చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపైగానీ, విద్యుత్ సంస్థపైగానీ ఆర్థిక భారం పడదని వివరించారు. ప్రస్తుతం ఈ పోస్టులు ఉన్నాయనీ, ఆ పోస్టుల్లో ఆర్టిజన్లను నియమించాలని సూచించారు. ఈ విషయాలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ ఉద్యమాన్ని ప్రారంభించామని తెలిపారు.

కన్వర్షన్ చేయకుండా రిక్రూట్ చేస్తే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం

ఆర్టిజన్లను కన్వర్షన్ చేయకుండా నోటిఫికేషన్లు ఇచ్చి రిక్రూట్‌మెంట్ చేస్తామంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని జేఏసీ చైర్మెన్ హెచ్చరించారు. ఏ త్యాగాలకైనా జేఏసీ సిద్ధంగా ఉందన్నారు. ఈ విషయంలో ట్రాన్స్‌కో, జెన్‌కో డిస్కామ్‌లు చొరవ చేసి ముందుకెళితే సమ్మెకు వెళ్లడానికైనా సిద్ధమని హెచ్చరించారు. ఆ దశకు పోకుండా కచ్చితంగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. గతంలో కొంత మంది ఉద్యోగులను పర్మినెంట్ చేశారనీ, ఆర్టిజన్లను కన్వర్షన్ చేయడం చట్టం వ్యతిరేకం కాదని చెప్పారు. జేఏసీ కన్వీనర్ ఎంఏ వజీర్ మాట్లాడుతూ జీవో 308 ప్రకారం కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. కొంత మంది ఆర్టిజన్లు ఉన్నత చదవులు చదివినా వారికి ప్రమోషన్లు రాకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. డిపార్టుమెంట్లలో ఎన్నో సర్వీస్ రూల్స్‌కు సవరణలు జరిగాయనీ, ఆర్టిజన్ల విషయంలో ఎందుకు జరగదని ప్రశ్నించారు. ఆర్టిజన్ల గోసను పట్టించుకోవాలని కోరారు. ఎన్నికల్లో కాంగ్రెస్ తమకు అనేక హామీలు ఇచ్చిందనీ, వాటిని నెరవేర్చాలని కోరారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ కో చైర్మెన్ ఎల్లయ్య మాట్లాడుతూ ఆర్టిజన్స్ కార్మికులు రిటైర్‌మెంట్ అయినా కూడా కనీసం బెనిఫిట్స్ పూర్తి చేయడంలేదన్నారు. మరణించిన కుటుంబాలకు సాయం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ నాయకులు శారద మాట్లాడుతూ ఆర్టిజన్లు తమ బాధను చెప్పుకునేందుకే ఇక్కడికి వచ్చారన్నారు. వయస్సు మీరుతున్న ఆర్టిజన్లు తమ పిల్లల భవిష్యత్తు కోసం కలిసికట్టుగా పోరాటం చేయాలని కోరారు. జేఏసీ నేత శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆర్టిజన్స్‌పై కొన్ని యూనియన్లు విలనిజం చూపిస్తున్నాయని విమర్శించారు. ఉద్యమవీరుల స్ఫూర్తితో ముందుకు పోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జేఏసీ కో చైర్మెన్లు, కో కన్వీనర్లు బి శంకర్, వి. నరేందర్, జి నాగరాజ్, జి. అరవింద్‌కుమార్, వడ్ల తిరుపతి, జాయింట్ సెక్రటరీలు, ఆర్గనైజింగ్ సెక్రెటరీలతోపాటు రాష్ట్ర నలుమూల నుంచి ఆర్టిజన్లు తరలి వచ్చారు.

జిల్లాకో స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీ

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ యువత భవిత కోసం రాష్ట్రంలో జిల్లాకో స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీ ఏర్పాటు చేయబోతున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎమ్ఎస్ఎమ్ఈ, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీఎస్) ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడలో "స్వచ్ఛత హి సేవా" కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ స్థాయి నైపుణ్యాలను యువతలో పెంపొందించడం ద్వారా పెట్టుబడులను ఆకర్షించే అగ్రగామిగా తెలంగాణాను తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. ఈ క్రమంలోనే తెలంగాణా నైపుణ్యాల విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా యువతను తయారు చేసేందుకు ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఏటీసీ) మారుస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 65 ఐటీఐలను ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్)తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుందని అన్నారు. గత పదేండ్లలో రాష్ట్రంలోని ఐటీఐల్లో కేవలం 1.5 లక్షల మంది మాత్రమే శిక్షణ పొందగా, ఈ ఏటీసీలతో రానున్న పదేండ్లలో 4 లక్షల మంది శిక్షణ పొందేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు.

కేటీఆర్‌కు సృజన్‌రెడ్డి లీగల్ నోటీస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సూదిని సృజన్‌రెడ్డి లీగల్ నోటీస్ పంపించారు. అమృత్ టెండర్ల విషయంలో లేనిపోని ఆరోపణలు చేసినందుకు లీగల్ నోటీసులు పంపించినట్టు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దగ్గరి బంధువు కావడం వల్లే టెండర్లు ఇచ్చారంటూ కేటీఆర్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని అన్నారు. తన కంపెనీ శోభ కన్‌స్ట్రక్షన్‌ను 2010లో ఏర్పాటు చేశామనీ, 2020 నుంచి ఏఐఆర్, ఐహెచ్‌పీలతో కలిసి జాయింట్ వెంచర్‌గా పనిచేస్తుందని పేర్కొన్నారు. అమృత్ టెండర్లలో రూ.1,110 కోట్ల పనులను నిబంధనల ప్రకారమే దక్కించుకున్నామని అన్నారు. కేటీఆర్ చేసిన ఆరోపణలను ఉపసంహరించుకోవాలనీ, లేకుంటే చట్ట ప్రకారం చర్య తీసుకుంటామని నోటీస్‌లో పేర్కొన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో మత్స్యకారుల హక్కుల కోసం ఉద్యమం

మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో మత్స్యకారుల హక్కుల కోసం ఉద్యమాలు సాగించాలని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు.

గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి చైతన్య సభల ప్రారంభం సందర్భంగా ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. లెల్లెల బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీతారాములు మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకైన ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహించటం నేటి పరిస్థితుల్లో ఎంతో అవసరమన్నారు.

భూస్వాముల దమనకాండకు వ్యతిరేకంగా నిలబడి, అణగారిన రైతులకు, వృత్తిదారులకు ఆమె ధైర్యాన్నిచ్చిం దని గుర్తు చేశారు. ఆర్థిక, సామాజిక సమానత్వం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టిందన్నారు. కార్యక్రమంలో వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంవీ. రమణ, టీఎంకెఎంకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గొడుగు వెంకట్, కల్లెల్లి లలిత ఉపాధ్యక్షులు శీలం శ్రీను, చనమోని శంకర్, మురారి మోహన్ దుబ్బుల దుర్గయ్య, దర్గయ్య, గాండ్ల అమరావతి, బక్కి బాలమాని, గాడేపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేదు

50కి పైగా మందులు గుర్తింపు

ఇందులో పలు ప్రముఖ కంపెనీల ఉత్పత్తులు

ఇవన్నీ మార్కెట్‌లో విరివిగా దొరికేవే

గుర్తించిన సీడీఎస్‌సీఓ



న్యూఢిల్లీ : మార్కెట్‌లో విరివిగా దొరికే 50కి పైగా మందులలో నాణ్యతలేదని తేలింది. సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌-సీఓ) తన తాజా సర్వేలో దీనిని గుర్తించింది. నాణ్యతలేనివిగా గుర్తించబడిన ఈ మందులు హైబీపీ, యాసిడ్ రీఫ్లక్స్ వంటి సాధారణ పరిస్థితులలో వినియోగించ బడతాయి. అయితే, సీడీఎస్‌సీఓ నాణ్యత లోపాన్ని గుర్తించటంతో మార్కెట్‌లో వీటి అమ్మకం, వినియోగంపై ఆందోళనలు కలుగుతున్నాయి. కొత్త మందులు, క్లినికల్ ట్రయల్స్ ఆమోదానికి బాధ్యత వహించే ఉన్నత సంస్థ సీడీఎస్‌సీఓ. అయితే, ఈ మందులు మార్కెట్‌లో విరివిగా అమ్ముడవుతున్నాయని సీడీఎస్‌సీఓ హెచ్చరించింది. పలు కంపెనీలు తయారు చేసిన 50కి పైగా మందు బ్యాచ్‌లలో నాణ్యత కరువైందని తన తాజా సర్వే సమాచారంలో సీడీఎస్‌సీఓ గుర్తించింది. ఇందులో ప్రముఖ కంపెనీలు విక్రయించిన మందులు కూడా ఉండటం గమనార్హం. ఉదాహరణకు, సన్ ఫార్మాస్యూటికల్స్ తయారు చేసిన పుల్మోసిల్ (సిల్డెనాఫిల్ ఇంజెక్షన్) నిర్దిష్ట బ్యాచ్ నాణ్యత లేనిదిగా గుర్తించబడటం గమనార్హం. అయితే, దీనిపై సన్ ఫార్మాస్యూటికల్స్ స్పందించింది. ఆ నాణ్యతలేని ఉత్పత్తిని తాము తయారు చేయలేదనీ, అది నకిలీదని వివరించింది. అలాగే, ఇదే కంపెనీ తయారు చేసిన యాసిడ్ రీఫ్లక్స్, అజీర్ణానికి సాధారణంగా ఉపయోగించే పాంటోసిడ్ నిర్దిష్ట బ్యాచ్ కూడా నకిలీదిగా గుర్తించబడటం గమనార్హం. అలాగే, గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్స్ ద్వారా తయారైన రక్తపోటును నియంత్రించటం కోసం ఉపయోగించే రెండు మెడిసిన్‌ల కలయిక అయిన టెల్మా హెచ్ (టెల్మిసర్తన్ 40 ఎంజీ, హైడ్రోక్లోరోథియాజైడ్ 12.5 ఎంజీ టాబ్లెట్స్ ఐపీ)లోనూ నాణ్యత లేదని గుర్తించబడింది. అయితే, గ్లెన్‌మార్క్ సైతం నిర్దిష్ట బ్యాచ్‌ను తాము తయారు చేయలేదని వివరించటం గమనార్హం. అనేక ప్రముఖ కంపెనీలు కూడా ఇవే సమాధానాలను వినిపించాయి. ఏదైనా నిర్దిష్ట బ్యాచ్ డ్రగ్ ప్రమాణాలను పాటించటంలో విఫలమైతే.. అదే పేరుతో విక్రయించబడే అన్ని మందులూ నాణ్యతను కలిగిలేవని కాదని సీడీఎస్‌సీఓ సీనియర్ అధికారి ఒకరు వివరణ ఇచ్చారు.

గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు
అటవీ శాఖ అనుమతులు అడ్డంకి

పెసా చట్టం జాతీయ సదస్సులో మంత్రి సీతక్క | గ్రామ సభలకు అనుమతులివ్వాలని కేంద్రానికి సూచన

ఇతర జిల్లాలో హైడ్రాలాంటి వ్యవస్థ ఏర్పాటుకు డిమాండున్నట్టు వెల్లడి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అటవీ శాఖ అనుమతులు అడ్డంకిగా మారుతున్నాయని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. కనీస వసతులు కల్పించడానికి సైతం సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల గిరిజన ప్రాంతంలో పాఠశాల భవనానికి అనుమతి లేకపోవడంతో కంటైనర్ పాఠశాలను ఏర్పాటు చేయాల్సి వచ్చిందని చెప్పారు. ఇలా రోడ్లు, మంచినీటి వ్యవస్థ, స్కూల్స్, విద్యుత్, హెల్త్ సెంటర్లు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణాలకు అటవీ చట్టాలు ఆటంకం కలిగిస్తున్నాయని తెలిపారు. గురువారం ఢిల్లీలోని అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పెసా చట్టంపై జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో తెలంగాణ నుంచి మంత్రి సీతక్కతో పాటు పెసా యాక్ట్ అమలులో ఉన్న పలు రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు హాజర య్యారు. కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసిన సీతక్క సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆదివాసీ, గిరిజనుల అభివద్ధి, పెసా చట్టం అమల్లో ఎదురవుతున్న ఇబ్బందులు, పరిష్కార మార్గాలపై ప్రసంగించారు. పెసా యాక్ట్ అమలులో ఉన్న తెలంగాణతో పాటు, 10 రాష్ట్రాల్లో ఎదురవుతోన్న సమస్యలను ఈ సందర్భంగా కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. గనులు, భారీ ప్రాజెక్టులకు అనుమతులు వేగంగా మంజూరవుతున్నాయని, అడవి పుత్రులకు కనీస సదుపాయాలు కల్పించే విషయంలో మాత్రం అనుమతులు రావడం లేదని అన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఎన్నో స్కీంల ద్వారా నిధులు ఇస్తున్నప్పటికీ... అటవీ శాఖ అధికారులు అనుమతులు ఇవ్వకపోవడంతో ఆ నిధులు మురిగిపోతున్నాయని వివరించారు. ఇనాటికి అనేక గిరిజన గ్రామాలకు నేటికీ సరైన రోడ్డు, విద్యుత్తు సదుపాయం, ఇతర మౌలిక వసతులు లేవని గుర్తు చేశారు. అటవీ, పర్యావరణ అనుమతుల్లో ఆటంకాల కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడుతోందని నివేదించారు. అందువల్ల అటవీ ప్రాంత గ్రామాల అభివృద్ధికి గ్రామ సభలకు అధికారం ఇవ్వాలని కేంద్రానికి సూచించారు.

అక్రమ నిర్మాణాలను కాపాడుకునే యత్నం

పేదలను ముందుపెట్టి కొంతమంది కబ్జాదారులు తమ అక్రమ నిర్మాణాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి సీతక్క అన్నారు. చెరువులను కాపాడాలి, భవిష్యత్ తరాలకు ఉపయోగ పడే చర్యల్లో భాగంగానే హైడ్రా కూల్చివేతలు చేపడుతున్నట్టు స్పష్టం చేశారు. చెరువుల పరిరక్షణ కోసం హైడ్రాకు స్వయం ప్రతిపత్తి ఇచ్చామని మంత్రి తెలిపారు. తాజా వరదలతో తీవ్రంగా నష్టపోయిన మహబూబాబాద్, వరంగల్, ఖమ్మం ప్రజల నుంచి హైడ్రాలాంటి వ్యవస్థలను ఏర్పాటు చేయాలనే డిమాండ్ వస్తుందన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో చెరువులు విధ్వంసం అయ్యాయని విమర్శలు చేసిన బీఆర్ఎస్ ఎన్ని చెరువులను పునరుద్ధరించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు తాము ఆ పని చేస్తుంటే ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. కూల్చివేతల్లో పేదవాళ్ల ఇండ్లు ఉంటే న్యాయం చేస్తామని ఇప్పటికే సీఎం హామీ ఇచ్చారని, వారికి త్వరలోనే వేరే చోట డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయిస్తామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ స్కీంలో ఏమైనా తప్పిదాలు జరిగితే కేంద్రమే చర్యలు తీసుకుంటుందన్నారు. కాంట్రాక్ట్ దక్కించుకున్న సృజన్‌రెడ్డిని రేవంత్ రెడ్డి బంధువుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. అదే సజన్ రెడ్డితో కల్వకుంట్ల ఇంటి ఆడపడుచు లిక్కర్ వ్యాపారాలు చేసినట్టు, ఆ స్కాంలో పాత్ర ఉన్నట్టు ఆరోపణలు వచ్చాయన్నారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేకు సజన్ రెడ్డి మేనల్లుడని గుర్తు చేశారు. ఈ నిజాలను దాచి పెట్టి దురుద్దేశాలతో సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వం పై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయండి : కేంద్ర మంత్రికి సీతక్క విజ్ఞప్తి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్నికలు జరగలేదన్న కారణంతో గ్రామ పంచాయతీలకు కేంద్రం ప్రభుత్వం నిలిపివేసిన 15 వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయాలని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి ఎస్.పి సింగ్ బఘేల్‌ను మంత్రి సీతక్క కోరారు. సదస్సు ముగిసిన తరువాత కేంద్ర మంత్రి బఘేల్‌తో ఆమె ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు రావాల్సిన నిధులను విడుదల చేయలని విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల కాకపోవడం వల్ల అభివృద్ధి కుంటుపడు తుందని బఘేల్ దష్టికి తీసుకెళ్లారు. అయితే సీతక్క విజ్ఞప్తికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఇతర రాష్ట్రాల నుంచి సైతం ఇదే రకమైన విజ్ఞప్తులు వస్తున్నందున, గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

జీఎస్టీ రేటు హేతుబద్ధీకరణపై మంత్రుల బృందం సమావేశం

వందకు పైగా వస్తువుల మీద పన్నురేటు సర్దుబాటుపై చర్చ

తదుపరి మీటింగ్ వచ్చేనెల 20న

న్యూఢిల్లీ : జీఎస్టీ రేటు హేతబద్ధీకరణపై ఆరుగురు మంత్రుల బృందం (జీఓఎం) సమావేశమైంది. వందకు పైగా వస్తువుల మీద పన్ను రేటు సర్దుబాటుపై చర్చించింది. కొన్ని వస్తువులపై 12 నుంచి ఐదు శాతానికి పన్నులు తగ్గించటం కూడా ఇందులో చర్చకు వచ్చింది. బుధవారం జరిగిన సమావేశపు విషయాన్ని పశ్చిమ బెంగాల్ ఆర్థిక మంత్రి చంద్రిమ భట్టాచార్య వెల్లడించారు. జీఓఎం తదుపరి సమావేశం అక్టోబర్ 20న ఉంటుందని తెలిపారు. సైకిళ్లు, వాటర్ బాటిళ్ల మీద పన్నుల హేతుబద్ధీకరణపై ఈ సమావేశంలో చర్చకు వస్తుందని వివరించారు. 12 శాతం పన్ను స్లాబ్‌లో మెడికల్, ఫార్మా సంబంధిత ఐటెమ్స్‌పై పన్ను రేటు తగ్గింపు అంశాన్ని కూడా జీఓఎం చేపట్టింది. వచ్చే నెల సమావేశంలో దీనిపై చర్చించాలని నిర్ణయించింది. బేవరేజెస్ వంటి కొన్ని వస్తువులపై ప్రస్తుతం ఉన్న 28 శాతం జీఎస్టీ నుంచి పన్ను రేట్లను పెంచే అవకాశం పైనా మంత్రుల బృందం చర్చించింది. ప్రస్తుతం జీఎస్టీ 5, 12, 18, 28 శాతం స్లాబులతో ఫోర్-టైర్ ట్యాక్స్ నిర్మాణాన్ని కలిగి ఉన్నది. జీఎస్టీ చట్టం ప్రకారం వస్తువులు, సేవలపై 40 శాతం వరకు పన్ను విధించొచ్చు.

వచ్చేనెల 20న జరిగే సమావేశంలో జీఓం తన సభ్యుల అభిప్రాయాలపై చర్చించనున్నది. అలాగే, తమ ప్రతిపాదనలను జీఎస్టీ కౌన్సిల్ ముందు ఉంచనున్నది. జీఎస్టీ కౌన్సిల్‌కు కేంద్ర ఆర్థికమంత్రి నేతృత్వం వహిస్తారు. ఇందులో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి మంత్రులు ఉంటారు. ప్రస్తుత ఆరుగురు సభ్యుల జీఓఎంలో కూడా యూపీ ఆర్థిక మంత్రి సురేశ్ కుమార్ ఖన్నా, రాజస్థాన్ ఆరోగ్య సేవల మంత్రి గజేంద్రసింగ్, కర్నాటక రెవెన్యూ మంత్రి కృష్ణ బైరె గౌడ, కేరళ ఆర్థిక మంత్రి కె.ఎన్ బాలగోపాల్‌లు ఉన్నారు.

సంపాదకీయం

నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు?



'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు?' అన్నట్టు ఉంది నేడు దేశంలో గవర్నర్లు వ్యవహరిస్తున్న తీరు. ఏవరు ఏమనుకుంటే నాకేంటి? ఏలినవారి మనసెరిగి నడుచుకోవడమొక్కటే ఏకైక పరమావధి అన్నట్టు ఉన్నవారి వ్యవహారం రోత పుట్టిస్తోంది. తాజాగా తమిళనాడు గవర్నర్ లౌకిక తత్వంపై చేసిన వ్యాఖ్యలు ఇందుకో పరాకాష్ట! బీజేపీ అధికారంలోకి వచ్చాక ఎన్నికైన బీజేపీయేతర ప్రభుత్వాలను కూలదోయడం, కుదరకుంటే ఇబ్బందులకు గురిచేయడం, ఫెడరల్ స్ఫూర్తికి తూట్లు పొడవడం ఓ విధానంగా సాగుతోంది. ఇందుకు గవర్నర్‌ల వ్యవస్థను అడ్డు పెట్టుకోవడం ఆనవాయితీగా మారింది.

తరచూ ఇలాంటి వివాదాలతో 'సమాఖ్య భావన' బీటలు వారడానికి రాజ్‌భవనే పుణ్యం కట్టుకుంటున్న వైనాన్ని కళ్లకు కడుతున్నాయి. రాష్ట్రపతి ప్రతినిధిగా రాష్ట్రాల్లో గవర్నర్లు నిర్వహించాల్సిన రాజ్యాంగ విహిత బాధ్యతలు పరిమితమైనవి, నామమాత్రమైనవి. ఏదైనా రాజ్యాంగ సంక్షోభం తలెత్తినప్పుడు తెరపైకి వచ్చి అత్యవసరంగా విధ్యుక్తధర్మం నిర్వర్తించాల్సిన గవర్నర్లు ఆ హద్దును దాటి తామే సంచలనాలకు కేంద్రబిందువుగా మారితే ఎలాగుంటుందో తెలుసుకోవడానికి ఈ పదేండ్ల ఉదంతాలు చాలు.

'కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి పూర్తి భిన్నమైన రాజకీయ పక్షం పాలనలో ఏ రాష్ట్రమైనా ఉంటే అక్కడి గవర్నర్ పోషించే పాత్ర ఎలా ఉంటుంది?' రాజ్యాంగసభ సభ్యులుగా బిశ్వనాథ్ దాస్ సంధించిన ప్రశ్న ఇది. అటువంటి సందర్భాల్లో గవర్నర్లు ఢిల్లీ ప్రభువుల సంకుచిత వ్యూహాల్లో పావులై, రాష్ట్ర ప్రభుత్వాల పాలిట అపర సైంధవులుగా పరిణమిస్తారన్న సందేహాన్ని ఆనాడే ఆయన ఎత్తిచూపారు. అది నూరుపాళ్లు వాస్తవమేనని అనేకసార్లు రుజువైంది. తాజాగా 'లౌకికతత్వం మన దేశానికి అవసరం లేదు. సెక్యులరిజం అనే భావన యూరప్ నుంచి వచ్చిందని, మనం దాన్ని అనుసరించవలసిన అగత్యం మనకు లేదు' అని తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగానే కించపరుస్తున్నాయి. ఇలా అసంబద్ధంగా ఏదో ఒకటి మాట్లాడే ఈ 'ప్రథమ పౌరుల' తీరు సమాజాన్ని కలవరపరుస్తోంది. రాజకీయ నిరుద్యోగుల పునరావాస కేంద్రాలుగా రాజ్‌భవన్లు మారడం వలనే ఆ రాజ్యాంగ వ్యవస్థ ఔన్నత్యం ఇంత మసిబారిపోతోంది!

ఆయన సెక్యులరిజం మనకు అనవసరం అని చెప్పి ఊరుకోలేదు. ఇది యూరప్ దేశాల భావన అనీ అక్కడ చర్చికి, రాజ్య వ్యవస్థకు మధ్య చెలరేగిన ఘర్షణ కారణంగా సెక్యులరిజం అన్న భావన రూపుదిద్దుకుందని కూడా ఆయన సెలవిచ్చారు. ఇది అచ్చు గుద్దినట్టు బీజేపీ అభిప్రాయమే. కాకపోతే ఈయన నోటినుంచి బయటకు వచ్చింది. అందులో ఆశ్చర్యం లేదు. తిరువనంతపురంలోని తిరువత్తూరులో హిందూధర్మ విద్యాపీఠం స్నాతకోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాని రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి రాజ్యాంగాన్ని తూలనాడే రీతిలో మాట్లా డడం ఆయన చిత్త వైపరీత్యానికి సంకేతం. అలాంటి వ్యకికి ఆ హోదాలో అర్హతే ఏ మాత్రమూ లేదు.

సెక్యులరిజానికి తప్పుడు భాష్యం చెప్పి దేశాన్ని మోసగించారు అని కూడా రవి వ్యాఖ్యానించారు. సెక్యులరిజం భారతీయ భావన కాదట. సెక్యులరిజం అన్న మాటను చేర్చడాన్ని తప్పుపట్టడం ఆయన లాంటి వారు మాత్రమే చేయగల దుస్సాహసం. ప్రస్తుత గవర్నర్లు కేంద్రం చేతుల్లో కీలుబొమ్మలై ప్రజాతంత్ర విలువలను మంటగలుపుతున్నారు. బూటాసింగ్, భండారీల వారసులు అడుగడుగునా తారసపడుతున్నారు. గవర్నర్ అంటే కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో మెలగవలసిన వ్యక్తి కాదని, ఆ పదవి రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర వ్యవస్థ అని 'ఎస్ఆర్ బొమ్మై వర్సెస్ భారత ప్రభుత్వం' కేసులో సర్వోన్నత న్యాయస్థానం కుండబద్దలుకొట్టింది. అవన్నీ అటకెక్కిపోయిన దురవస్థలో గవర్నర్ల ఎంపికలో పార్టీ విధేయతే ఏకైక ప్రమాణమైంది.

ఆమధ్య 'ప్రభుత్వమంటే నేనే' నంటూ ఢిల్లీ మాజీ ఎల్‌జీ నజీబ్ జంగ్ నోరు పారేసుకోవడం నివ్వెరపరిచింది. 'ప్రతీ దేశం ఏదో ఒక మతంపైనే ఆధారపడిందనీ, భారతదేశం అందుకు మినహాయింపేమీ కాదని' ఇదే తమిళనాడు గవర్నర్ గతంలోనూ వివాదస్పద వ్యాఖ్యలే చేశారు. తరచూ ఇలాంటి వివాదాలతో 'సమాఖ్య భావన' బీటలు వారడానికి రాజ్‌భవనే పుణ్యం కట్టుకుంటున్న వైనాన్ని కళ్లకు కడుతున్నాయి. రాష్ట్రపతి ప్రతినిధిగా రాష్ట్రాల్లో గవర్నర్లు నిర్వహించాల్సిన రాజ్యాంగ విహిత బాధ్యతలు పరిమితమైనవి, నామమాత్రమైనవి.

ఏదైనా రాజ్యాంగ సంక్షోభం తలెత్తినప్పుడు తెరపైకి వచ్చి అత్యవసరంగా విధ్యుక్తధర్మం నిర్వర్తించాల్సిన గవర్నర్లు ఆ హద్దును దాటి తామే సంచలనాలకు కేంద్రబిందువుగా మారితే ఎలాగుంటుందో తెలుసుకోవడానికి ఈ పదేండ్ల ఉదం తాలు చాలు. ఈ వివాదాస్పద గవర్నర్‌లందరూ పూర్వా శ్రమంలో కాషాయదళ కీలక నేతలే కావడం, వీరివల్ల ఇక్కట్లకు గురవుతున్నవన్నీ బీజేపీయేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాలే కావడం యాధృచ్ఛికమేమీ కాదు. కనుక ఇదంతా ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న వారి ప్రాయోజిత రాజకీయ తతంగమేనన్నది సత్యదూరమూ కాదు.

ప్రపంచ పర్యాటక రంగానికి ఊతమివ్వడానికి 27 సెప్టెంబర్ 1970న తీసుకున్న తీర్మానం ప్రకారం అంతర్జాతీయ టూరిజం సమాజం 'ఐరాస వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్, యుయన్‌డబ్ల్యూటిఓ'ను ఏర్పాటు చేసి చట్టబద్ధత కల్పించడంతో ప్రతియేటా 27 సెప్టెంబర్‌న ప్రపంచ దేశాలు 'ప్రపంచ పర్యాటక దినం (వరల్డ్ టూరిజం డే)' పాటించుట 1980 నుంచి ఆనవాయితీగా మారింది. పర్యాటకంతో ప్రపంచ దేశాల, ప్రాంతాల ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ, సామాజిక, ఉద్యోగ ఉపాధుల విలువలు ప్రభావితమవుతాయనే అవగాహనను కల్పించేందుకు 'ప్రపంచ పర్యాటక దినం' వేదికలను వినియోగిస్తారు. 1997నుంచి 'వరల్డ్ టూరిజం డే' వేడుకలను ఒక్కోదేశంలో నిర్వహిస్తూ, టూరిజం అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి పదిమంది ఉద్యోగుల్లో ఒక్కరు పర్యాటక రంగానికి సంబంధించిన ఉద్యోగాల్లోనే ఉన్నారని అంచనా.

సృజనశీల వినూత్న భావనలు, డిజిటల్ విప్లవఫలాలతో టూరిజం పరిశ్రమ రూపు

ప్రపంచ యుద్ధాలు- పర్యాటకంపై ప్రభావం!



రేఖలు ఆసాంతం మారిపోయాయి. వరుస విపత్తులతో అభివృద్ధి చెందిన, చెందు తున్న ప్రపంచ దేశాల సామాజిక, ఆర్థికరం గాలు కుదేలై చితికిపోయాయి. కరోనా విపత్తు వల్ల ప్రపంచ టూరిజం నాలుగు ట్రిలియన్లు నష్టపోయిందని అంచనా వేశారు. పర్యాటక పరిశ్రమలోని మిలియన్ల ఉద్యోగాలను కరోనా మింగేసింది. విపత్తు మబ్బులు పూర్తి తొలగిన వేళ నేడు ప్రపంచ పర్యాటకం కొత్తపుంతలు తొక్కుతున్నది. ఈ ఏడాది ప్రపంచ పర్యాటక దినం-2024 నినాదంగా "పర్యాటకం- ప్రపంచ శాంతి (టూరిజమ్ అండ్ పీస్)" అనే థీమ్ తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. 'ఐరాస సుస్థిరా భివఅద్ధి లక్ష్యాలు-2030'లో ప్రముఖమైన పేదరిక నిర్మూలన, ఆకలిని అంతం చేయడం, లింగ సమానత్వం, ఆర్థిక ప్రగతి లాంటివి సాధించడానికి పర్యాటకరంగం కూడా ఎంతగానో దోహదపడుతుందని గమనించాలి.


ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగంగా పర్యాటకానికి పేరుంది. గత కొన్నేండ్లుగా ప్రపంచ పర్యాటకం అనేక రేట్లు పెరగడం, ఆధునిక హంగులు తొడగడం చూశాం. 1950లో అంతర్జా తీయ పర్యాటకులు 5 మిలియన్లు (2 బిలియన్ల డాలర్ల రెవెన్యూ) నమోదు కాగా, 2019లో 1.3 బిలియన్ల (1,260 ట్రిలియన్ డాలర్ల రెవెన్యూ) వరకు పెరగడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. గ్లోబల్ జీడీపీలో పర్యాటక పరిశ్రమ పదిశాతంగా ఉందని అంటున్నారు. ప్రతియేటా ప్రపంచ పర్యాటకాభివృద్ధి మూడో శాతం పెరగాలని లక్ష్యం చేసుకున్నారు. పర్యా టక పరిశ్రమ ఊపులో ఉన్న భారత్‌లో దేశ జీడీపీలో 9.2 శాతంగా ఉంటూ అతివేగంగా విస్తరిస్తోంది. దేశ పర్యాటక పరిశ్రమలో 43 మిలియన్ల ఉద్యోగులు పని చేస్తూ, ప్రతియేటా పది మిలియన్లకు పైగా విదేశీ పర్యాటకులతో దిన దినాభివృద్ధి చెందుతోంది. దేశవ్యాప్తంగా ఉత్తర భారతం నుంచి దక్షిణం వరకు వెలసిన విలక్షణ జన జాతులు, విభిన్న సంస్కృతులు, వారసత్వ సంపదలు, ప్రకృతి పరిచిన అందాల విందులు, తీర్థయాత్రలు, అద్భుత కట్టడాల రమణీయతలు, పర్యాటకంతో ప్రపంచశాంతి, సోదర భావం, సాంస్కృతిక వినిమయం, పర మత సహనం లాంటి ముఖ్య అంశాలు సిద్ధి స్తాయి.

ఇండియాలోని యూపీ (అయోధ్య), కేరళ, ఉత్తరాఖండ్, హిమాచల్ లాంటి రాష్ట్రాలు పర్యాటకం మీదనే అధికంగా ఆధారపడి ఉన్నాయి. అంతర్జాతీయ విమానాయాన రంగంతో మొదలు అతి చిన్న గ్రామీణ బడుగు కుటుంబాల వరకు అందరినీ అక్కున చేర్చుకొని పర్యాటకులకు ఆహ్లాదాన్ని, స్థానికులను ఉపాధులను ప్రసాదిస్తున్న పర్యాటక పరిశ్రమ మళ్లీ తేరుకొని, పుంజుకుని మిలియన్ల కుటుంబాల్లో నవ్వుల పువ్వులు పూయించాలని కోరుకుందాం. ప్రతి ఒక్కరం జీవితంలో తరుచుగా పర్యాటక ప్రణాళికలు వేసుకొని, పర్యాటకుడిగా ఆనం దానుభూతులు పొందుతూ, పలువురికి ఉద్యోగ ఉపాధుల కల్పనలో పరోక్షంగా దోహదపడదాం. విశ్వ రహస్యాలు, దర్శనీయ స్థలాలు, ప్రకృతి అందాలు తెలుసుకునేందుకు ప్రయాణాలకు సిద్ధమవుదాం.

(27 సెప్టెంబర్ 'ప్రపంచ పర్యాటక దినం')

- డా: బుర్ర మధుసూదన్ రెడ్డి,
9949700037

నిజాంకు మోడీకి పోలికలున్నాయా?



డాక్టర్ దేవరాజు మహారాజు

సెప్టెంబర్ నెల రాగానే తెలంగాణలో విమోచన దినమని కొందరు, విలీన దినమని మరి కొందరు చర్చలు ప్రారంభిస్తారు. వాటిని కాదని ప్రస్తుత కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను ప్రజాపాలనా దినమని ప్రకటించింది. అవన్నీ సరేగానీ, ప్రస్తుత భారత ప్రధాని మోడీకి, ఒకప్పుడు తెలం గాణ రాజ్యాన్ని పాలించిన నిజాం రాజుకు ఏవైనా దగ్గరి పోలికలు ఉన్నాయా - అని మాత్రం ఎవరూ ఆలోచించడం లేదు. నిశితంగా గమనిస్తే చాలా ఉన్నాయి. మోడీ ప్రభుత్వపు నేటి తీరుతెన్నులు ఇప్పుడు దేశ ప్రజలందరికీ తెలుసు. కానీ, నాటి హైదరాబాద్ పాలకుడి పరిపాలనా విధానాలు నేటితరం వారికి అంతగా తెలియకపోవచ్చు. అందువల్ల ఆ విషయాలు ఒకసారి సమీక్షించుకుందాం. పరమత ద్వేషం- ప్రజల్ని పీడించడం- ప్రయివేటు సేవలకు అధికారాలివ్వడం- స్వయాన విద్యా విహీనులు కావడం-వంటి అనేక అంశాల్లో నిజాం రాజుకు, ప్రధాని మోడీకి పోలికలున్నాయి. ఆనాడు నిజాం ప్రభుత్వం రజాకార్లకు అధికారమిస్తే, ఈనాడు మోడీ ప్రభుత్వం గో సంరక్షకులకు, జై శ్రీరామ్ సేనకు, సనాతన వాదులకు అధికారమిచ్చింది. ఆనాడు రజాకార్లు మహిళలతో నగ్నంగా బతుకమ్మలాడిస్తే, ఈనాడు మోడీ భక్తులు మణిపూర్ లో మహిళల్ని నగ్నంగా ఊరేగించారు. నిజాం-మోడీ ఇద్దరూ నిరంకుశ పాలకులే! వీరిద్దరిదీ ప్రజావ్యతిరేక విధానాలే! సాయుధ పోరాటంలో తెలంగాణ ప్రజలు నిజాం అధికారాన్ని మట్టి కరిపించారు. ఈ దేశప్రజలు తమ పోరాటాలతో మోడీ ప్రభుత్వ విధానాలను తిప్పి కొడుతున్నారు. దేశ వ్యాప్తంగా వెలసిన షహీన్‌బాగ్‌లు, రైతుల నిరసనలు తక్కువేమీ కాదు. హైద్రాబాద్ నిజాంది గత చరిత్ర అయితే, కేంద్రంలో అధికారంలో ఉన్న ఆరెస్సెస్ ప్రచారక్ మోడీది - నడుస్తున్న చరిత్ర. మోడీ పాలన అమోఘంగా సాగుతోంది. అనే ఒకవర్గం ఉన్నట్టే-అధ్వాన్నంగా ఉందని అసహ్యించుకునే వారే అధికం! నిజాం మంచోడు, సెక్యులర్ అన్నది కొద్దిమందయితే, ఏపాటి సెక్యులర్? అని ప్రశ్నించే ప్రజలే అధికం!

నిజాం రాజు అంత మంచోడే అయితే, గిరిజన నాయకుడు కొమురం భీం ఎందుకు ఆయన మీద తిరగబడ్డాడు? ఎందుకు పోరాడాడు? మనం ఆలోచించాలి. నిజాం గొప్పోడే అయితే నిజాం రజా కార్లపై- షోయబుల్లాఖాన్ ఎందుకు అక్షరాయు ధాలు సంధించాడు? ఎందుకు హత్య చేయబడ్డాడు? రచయితల్ని, హేతువాదుల్ని హత్య చేయించడంలో మోడీ ఏమీ వెనకబడలేదు. నిజాం మంచోడే అయితే మరి చిట్యాల ఐలమ్మ ఎందుకు నవాబు పాలన మీద తిరగబడింది? కమ్యూనిస్టులు, కాంగ్రెస్ వాళ్లూ ఎందుకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు? 'మా నిజాము రాజు తరతరాల బూజు' అని మహా కవి దాశరథి ఎందుకు ఎద్దేవా చేశాడూ? స్వయంగా తుపాకిపట్టి ఎందుకు పోరాడాడు? గోల్కొండ ఖిల్లా కింద గోరి కడతామని యాదగిరి ఎందుకు పాటెత్తుకున్నాడు? ఆ బీడ్ రోడ్డులో నారాయణ్‌రావు పవార్ ఎందుకు నిజాం కారుమీద బాంబు విసిరాడూ? నిజాం మంచోడు, గొప్పోడు- అని అన్నవాడికి మెదడు సరిగా పనిచేసి ఉండదు. ఇన్నేండ్ల తర్వాత వీరనారి ఐలమ్మ పోరాటానికి గుర్తింపు లభించింది. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లోని కోఠి మహిళా కళాశాలకు చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా పేరు మార్చింది. నిజాం రాజు నిజాయితీ గురించి ఒక విష యం చెప్పుకోవాలి. ఆయన మన ప్రధాని మోడీలాగా ఎం.ఎ. డిగ్రీ సృష్టించుకోలేదు. అయితే తనకూ దేవుడికి (అల్లాకు) సంబంధం ఉందని- మోడీ లాగే ప్రకటించుకున్నాడు.

ఏడో నిజాం నవాబ్ ఉస్మాన్ అలీఖాన్ అధికారంలోకి రాగానే తన తండ్రి కాలం నుండి మంత్రి పదవిలో ఉన్న కిషన్ పర్‌షాద్‌ను తొలగించాడు. ఒక హిందువుకు అత్యున్నత పదవిలో ఉండే అర్హత లేదనే కదా? పరమత సహనం నిజాంకు మోడీకి ఒకేలా ఉన్నట్టుంది కదా? ఇంకా "తూ కిషన్ పర్షాద్ హైతో-మై ఖుదా పర్షాద్ హూ" అని ఈసడించుకున్నాడు. నువ్వు కృష్ణుడి ప్రసాదమైతే, నేను ఖుదా (అల్లా) ప్రసాదాన్ని అని నిజాం చెప్పుకున్నాడు. నాన్ బయాలజికల్ ప్రధాని మాటలు ఇలాగే ఉన్నాయి కదా? పైగా హిందువుల గుర్తులపై, బొట్లపై నిజాం తన మతద్వేషాన్ని వెళ్లగక్కాడు. మోడీ తక్కువ వాడా? 'వారు వేసుకున్న బట్టలతోనే మీరు వారిని గుర్తుపట్టొచ్చు' అని ద్వేషాన్ని దేశవ్యాప్తం చేశారు. నిజాం దౌర్జన్యాలనన్నింటినీ ఆరోజుల్లో 'రహబరే దక్కన్' అనే ఉర్దూ పత్రిక ధైర్యంగా ప్రచురించింది. ఇక్కడి ప్రజలను ఊచకోత కోసేందుకు లాతూర్ నుండి ఒక పరమ కిరాతకుడైన ఖాసిం రజ్వీ అనేవాణ్ణి పిలిపించి, నిజాం అతని అనధికార సైన్యమైనా రజాకార్లకు మితిమీరిన స్వేచ్ఛనిచ్చాడు. అందుకే వారి దౌర్జాన్యాలు హీనాతి హీనంగా ఉండేవి. మోడీ హయాంలో జరిగిన, జరుగుతున్న గుజరాత్, మణిపూర్ మారణకాండలు, దళితులపై దాడులు. అన్యమతస్తుల ఇండ్లపై చేస్తున్న బుల్‌డోజర్ దాడులూ, కూల్చివేతలూ నాటి రజాకార్ల ఆగడాల్ని తలపిస్తున్నాయి. అలాగే రైతుల్ని పీడించడంలో నిజాంకు మోడీకి దగ్గరి పోలికలున్నాయి. ఆనాడు నిజాం విధించే పన్ను (శిస్తు) ఎన్ని రెట్లు అధికంగా ఉండేదంటే-రైతుల రాబడిని మించి ఉండేది. ప్రపంచ ధనికుల్లో ఒకడిగా నిజాం గుర్తింపబడ్డాడంటే కారణం ఇదే. అదంతా పేద రైతుల పొట్టకొట్టి సంపాయించిందే. అధికారికంగా ఇంకా బయటపడలేదు గానీ, మోడీ కూడా ప్రపంచ ధనికుల్లో ఒకడు. దేశ విదేశాల కాంట్రాక్టులన్నీ మోడీ అదానీకి ఇప్పించి, వచ్చిన లాభాలన్నీ తన ఖాతాలో వేసుకుంటున్నాడనీ, ఆ రకంగా అదానీ పేరు చెప్పి మోడీ ప్రపంచ ధనికుల్లో ఒకడవుతున్నాడన్న వాదన ఉంది. ఈ విషయం ఢిల్లీ అసెంబ్లీలో నాటి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తన ప్రసం గంలో వెల్లడించాడు. అది భరించలేకే ఆయన్ను తప్పుడు కేసులో ఇరికించి జైల్లో వేయించాడని విశ్లేషకులు చెప్పిన మాట.



రజాకార్ల అండదండలతో పరిపాలన వెలగబెట్టిన చివరి నిజాం ఉస్మాన్ అలీఖాన్ స్వతంత్ర రా జ్యంగా ఉండిపోవాలని గట్టి ప్రయత్నమే చేశాడు. భారత యూనియన్ ప్రభుత్వం అందుకు ఒప్పు కోలేదు. అప్పుడు చివరి ప్రయత్నంగా పాకిస్థాన్‌లో భాగంగా ఉండడానికి ప్రయత్నించాడు. బంగ్లాదేశ్ ఏర్పడక ముందు అది తూర్పు పాకిస్థాన్-గా పాకిస్థాన్‌లో భాగంగా ఉండేది. దూరమైనా సరే, తన హైదరాబాదు సంస్థానం కూడా పాకిస్థాన్‌లో భాగం కావాలనుకున్నాడు. భారత యూనియన్ ప్రభుత్వం అందుకు ఒప్పుకోలేదు. లొంగిపోవాలని ఒత్తిడి తెచ్చింది.కానీ అది సాధ్యం కాలేదు.17 సెప్టెంబర్ 1948న భారత ప్రభుత్వం, హైదరాబాదు నిజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేసుకుంది.

నిజాం కనుసన్నల్లో - ఖాసిం రజ్వీ ఆధ్వర్యంలో - రజాకార్లు ఆనాటి పేద రైతుల నుండి పన్ను వసూలు చేసేవారు. పన్ను చెల్లించని రైతుల గోర్ల కింది మాంసం కత్తిరించి, గోర్లు ఊడబెరికే వారు. భర్తల సమక్షంలో భార్యల్ని అత్యాచారానికి గురిచేసేవారు. భార్యల కండ్లెదుట భర్తల్ని నరికి చంపేవారు. ఈ బాధలు పడలేక రైతులెవరైనా పారిపోతే వారి ఆచూకీ చెప్పమని కుటుంబ సభ్యుల్ని హింసంచేవారు. ఆచూకీ చెప్పలేకపోతే, ఇంట్లో ఉన్న పిల్లలను ఎగరేసి, కత్తిని గుచ్చి చంపేసేవారు. ఆ రోజుల్లో రజా కార్లను చూసిన వాళ్లు ఎవరూ బతికిన దాఖలాలు లేవు. రజాకార్లు గుర్రాల మీద ఊళ్లోంచి పోతూ ఉంటే ప్రజలు ఇండ్లలోకి వెళ్లి తలుపులేసుకునేవారు. తలుపు సందుల్లోంచి భయం భయంగా చూసే వారు. ఎవరైనా పొరపాటున రజాకార్ల దండుకు ఎదురుపడితే వారిని గుర్రాలకు కట్టి పాశవికంగా ఈడ్చుకెళ్లేవారు. చచ్చిన తర్వాతే వదిలేసి వెళ్లేవారు. ఇప్పుడు ఆలోచిస్తే అసలు వీళ్ల మనుషులేనా అని అనిపిస్తుంది. ఇలాంటి వారిని దేశం మీద వదిలేసిన నిజాం రాజు మనిషేనా అని అనుమానపడాల్సి వస్తుంది. రజాకార్ల దుర్మార్గాన్ని హైద్రాబాద్ సంస్థానం 13 సెప్టెంబర్ 1948 వరకు భరించక తప్ప లేదు. అప్పటికి భారత దేశానికి స్వాతంత్రం లభించింది. కానీ, హైద్రాబాద్ సంస్థానం మాత్రం కిరాతక నిజాం అఘాయిత్యాలకు గురవుతూనే వచ్చింది. భారత ప్రభుత్వానికి ఎవరైనా సహకరిస్తే, వారందరి ప్రాణాలు తీస్తామని రజాకార్లు ఇక్కడి ప్రజల్ని బెదిరించారు. ఆ సమయంలో సుమారు ముప్పయి రెండు వేల మంది స్థానికులు సికింద్రాబాద్ మిలట్రీ కంటోన్మెంట్‌లో తలదాచుకున్నారు.

నిజాం రాజు అంత మంచోడే అయితే, గిరిజన నాయకుడు కొమురం భీం ఎందుకు ఆయన మీద తిరగబడ్డాడు? ఎందుకు పోరాడాడు? మనం ఆలోచిం చాలి. నిజాం గొప్పోడే అయితే నిజాం రజా కార్లపై- షోయబుల్లాఖాన్ ఎందుకు అక్షరాయుధాలు సంధించాడు? ఎందుకు హత్య చేయబడ్డాడు? రచయితల్ని, హేతువాదుల్ని హత్య చేయించడంలో మోడీ ఏమీ వెనకబడలేదు. నిజాం మంచోడే అయితే మరి చిట్యాల ఐలమ్మ ఎందుకు నవాబు పాలన మీద తిరగబడింది? కమ్యూనిస్టులు, కాంగ్రెస్ వాళ్లూ ఎందుకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు? 'మా నిజాము రాజు తరతరాల బూజు' అని మహా కవి దాశరథి ఎందుకు ఎద్దేవా చేశాడూ? స్వయంగా తుపాకిపట్టి ఎందుకు పోరాడాడు? గోల్కొండ ఖిల్లా కింద గోరి కడతామని యాదగిరి ఎందుకు పాటెత్తుకున్నాడు? ఆ బీడ్ రోడ్డులో నారాయణ్‌రావు పవార్ ఎందుకు నిజాం కారుమీద బాంబు విసిరాడూ? నిజాం మంచోడు, గొప్పోడు- అని అన్నవాడికి మెదడు సరిగా పనిచేసి ఉండదు.

రజాకార్ల అండదండలతో పరిపాలన వెలగబెట్టిన చివరి నిజాం ఉస్మాన్ అలీఖాన్ స్వతంత్ర రా జ్యంగా ఉండిపోవాలని గట్టి ప్రయత్నమే చేశాడు. భారత యూనియన్ ప్రభుత్వం అందుకు ఒప్పు కోలేదు. అప్పుడు చివరి ప్రయత్నంగా పాకిస్థాన్‌లో భాగంగా ఉండడానికి ప్రయత్నించాడు. బంగ్లాదేశ్ ఏర్పడక ముందు అది తూర్పు పాకిస్థాన్-గా పాకిస్థాన్‌లో భాగంగా ఉండేది. దూరమైనా సరే, తన హైదరాబాదు సంస్థానం కూడా పాకిస్థాన్‌లో భాగం కావాలనుకున్నాడు. భారత యూనియన్ ప్రభుత్వం అందుకు ఒప్పుకోలేదు. లొంగిపోవాలని ఒత్తిడి తెచ్చింది.కానీ అది సాధ్యం కాలేదు.17 సెప్టెంబర్ 1948న భారత ప్రభుత్వం, హైదరాబాదు నిజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేసుకుంది.

చివరి నిజాం ఉస్మాన్ (ఉన్మాద్) అలీఖాన్ తన పాలనలో మెజారిటీ ప్రజల భాష అయిన తెలు గును నిషేధించాడు. తెలుగు పత్రికలు దొంగతనంగా చదువుకోవాల్సి వచ్చేది. ప్రజలు తమ పండుగలు, ఊరేగింపులు, సభలు-సమావేశాలు బహిరంగంగా జరుపుకునే వీలుండేది కాదు. నాటి కవులు, రచయి తలు, పాత్రికేయులు ఎన్నోకష్టాలు పడ్డారు. ఇప్పుడు మోడీ ప్రభుత్వం చేస్తున్నది కూడా అదే-కవుల్ని, రచయితల్ని చంపించడం లేదా జైల్లో వేయించడం, పాత్రికేయుల్ని మీడియా సంస్థల్ని కొని, తన గోదీ మీడియాను తయారు చేసుకోవడం చూస్తూనే ఉన్నాం. ఒక దేశం - ఒకే ఎన్నికలు - ఒకే భాష - ఒకే మతం లాంటి వాటికి మోడీ ప్రాముఖ్యమిచ్చి అభాసుపాలవుతున్నాడు కదా? నాటి నిజాం నియంతృత్వ పాలనను మత మార్పిడులను ప్రశ్నించిన భాషోద్యమకారుల్ని, పాత్రికేయుల్ని కమ్యూనిస్టు ఉద్యమ కారుల్ని, కాంగ్రెస్ కార్యకర్తల్ని నిజాం ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా హత్య చేయించేది. వట్టికోట అళ్వారు స్వామిని, దాశరథి కృష్ణమాచార్యను జైల్లో పెట్టింది ఆనాటి నిజాం ప్రభుత్వమే కదా? ప్రత్యక్షంగా తుపాకి పట్టుకుని నిజాంకు వ్యతిరేకంగా పోరుసల్పిన కవి యోధుడు దాశరథికున్న ఘన చరిత్ర ప్రపంచంలో మరో కవికి లేదు కదా? రక్తంతో తడిసిన నాటి హైదరాబాదు సంస్థానపు చరిత్ర పుటలు ఎన్నటికీ తడి తడిగానే ఉంటాయి. అలాగే ఇప్పటి మణిపూర్, గుజరాత్ మారణ కాండలు కూడా!

- సుప్రసిద్ధ సాహితీవేత్త,
జీవశాస్త్ర వేత్త (మెల్బోర్న్ నుంచి)


రెపరెపలాడే విప్లవపతాక భగత్‌సింగ్



నాదెండ్ల శ్రీనివాస్
9676407140

'మనుషులను చంప గలరేమో కానీ వారిలో ఉండే ఆశయాలను కాదు' అని చాటిచెప్పిన ధీరుడు సర్దార్ భగత్‌సింగ్. ఆ మహావీరుని 117వ జయంతి నేడు. ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదంతో స్వేచ్ఛాకాంక్షని రగిల్చి, స్వరాజ్య సాధన పోరాటంలో చిరు ప్రాయంలోనే ప్రాణాలొదిలిన త్యాగధనుడు. భగత్‌సింగ్ పేరు వింటేచాలు రక్తం గర్వంతో ఉప్పొంగుతుంది. ఆయన ఆశయాలు, ఆలోచనలు, ఆవేశం ఎంతోమంది యువతలో స్ఫూర్తి నింపింది. గొప్ప విప్లవకారుడిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా చరిత్రలో నిలిచి పోయిన వీరుడాయన. రెపరెపలాడే విప్లవపతాక. కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు 1907, సెప్టెంబరు 27న భగత్‌సింగ్ జన్మించారు. 13 ఏళ్ల వయసులో సహాయ నిరాకరణోద్యమం భగత్ సింగ్ పై విపరీత ప్రభావం చూపింది. ప్రత్యక్షంగా ఆ స్వాతంత్ర్య పోరాటంలో ఆయన మొదటిసారి పాల్గొన్నారు. ప్రభుత్వ పుస్తకాలను, దుస్తులను తగులబెట్టారు. 1919లో జరిగిన జలియన్‌వాలా బాగ్ దురంతం భగత్‌సింగ్ స్వాతంత్ర్యకాంక్షను మరింత రగిలించింది. అయితే గాంధీ అహింసా మార్గంకంటే హింసకు హింసే సమాధానమని నమ్మారు. గాంధీ నాయకత్వంలో జరుగుతున్న స్వతంత్ర పోరాటం రాజీ ధోరణిలో సాగుతోందని, అది మంచిది కాదని చెప్పిన తొలివ్యక్తి భగత్‌సింగ్. గాంధేయవాదంపై భగత్‌సింగ్‌కు నమ్మకం లేదు. గాంధేయవాద రాజకీయాల వల్ల స్వార్థ పరులు పుట్టుకొస్తూనే ఉంటారని ఆయన అభిప్రాయం. అదే సమయంలో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా దేశంలో సైమన్ గోబ్యాక్ ఉద్యమం జరుగుతున్న సమయంలో లాహోర్‌లో లాలా లజపతి రాయ్ బ్రిటిష్ సాయుధ బలగాలను ఎదురొడ్డి నిలిచారు. అప్పుడు బ్రిటీష్‌వారి దాడిలో పంజాబ్ కేసరి నేలకొరిగారు. దీంతో భగత్‌సింగ్, సుఖ్ దేవ్, రాజ్‌గురులలో ఆగ్రహాన్ని నింపింది. చెమర్చిన కళ్లతోనే సాండర్స్ అంతు చూశారు. కసితీరా కాల్చి చంపారు. ఆ హత్యకు కారణమైన వారిని ఉరితీయాలని బ్రిటిష్ ప్రభుత్వం నిర్ణయించింది. అనంతరం 1929లో అసెంబ్లీపై బాంబులు విసి రారు. ఆ సంఘటనలో ఎవరూ గాయ పడక పోయినా ఆ ముగ్గురు లొంగి పోయారు. దేశం నుంచి బహిష్కరణకు గురయ్యారు. అనంతరం వారిపై బ్రిటిష్ ప్రభుత్వం సాండర్స్ హత్యా నేరం మోపింది. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు నేరాన్ని ఒప్పుకున్నారు. కోర్టులో బ్రిటిష్ వ్యతిరేక నినాదాలు చేశారు. కోర్టు వారికి ఉరిశిక్ష విధించింది. భగత్‌సింగ్ జైలులో ఉన్న సమయంలోనే అనేక రచనలు రాశారు. 23 ఏళ్ల వయస్సులో జీవితం విలువ ఏం తెలుస్తుంది. ప్రాణాలంటే అంత లెక్కలేని తనం? అంతా కుర్ర ఆవేశం? అతను ఒక తీవ్రవాది కూడా! ఇలా రకరకాలుగా భగత్‌సింగ్ గురించిన అపోహలు నాడు ప్రచారంలో ఉన్నాయి. భగత్‌సింగ్ వ్యక్తిత్వాన్ని ఆయన భావాలు, దృక్పథం సమాజాన్ని ఆయన అర్థం చేసుకున్న విధానం జీవితం పట్ల, ప్రాణాల పట్ల ఆయనకున్న అభిప్రాయాలు ఏమిటో వారి మిత్రుడు శివవర్మ రాసిన సంస్మృతు లులో వ్యక్తీకృతమవుతాయి. బ్రిటీష్ పాలకుల్ని వెళ్లగొట్టడం మాత్రమే కాదు, ఆ తర్వాత దేశంలో చోటుచేసుకునే దోపిడీలను నిర్మూలిం చాలని చాటిన వ్యక్తి భగత్‌సింగ్. ఆయన అసాధారణ రాజకీయ సైద్ధాంతిక అవగాహన ఉన్న వ్యక్తిగా వారి రచనలు స్పష్టం చేస్తాయి. శాస్త్రీయ దృక్పథాన్నే పంథాగా మార్చుకున్న మానవతావాది. సమాజాన్ని అమితంగా ప్రేమించిన సౌహార్ద హృదయుడు.

జైలుశిక్ష అనుభవిస్తున్న సమయంలో యావజ్జీవ శిక్ష విధిస్తారని భావించిన సుఖ్‌దేవ్ నాలుగు గోడల మధ్య బతకడం కన్నా ఆత్మహత్య చేసుకుని చావడం నయమంటూ రాసిన లేఖకు, ఆత్మహత్య ఆలోచన ప్రగతి నిరోధక చర్య. పిరికి చర్య కూడా! మనం నవ్వుతూ ఉరితాడును కౌగిలించుకుంటున్నాం అంటే ప్రాణాలపై ఆశలేదని కాదు మన దేశాన్ని బానిసత్వం నుంచి విముక్తి చేయడం కోసం ప్రాణాలను సైతం లెక్క చేయం అని అర్థం. ఒకవేళ మన జీవితమంతా జైలు గోడల మధ్య సాగాల్సి వచ్చినా, ఇక్కడి నుంచే మన పోరాట మార్గాన్ని కొనసాగిస్తామని భగత్‌సింగ్ సమాధానమి చ్చారు. జైల్లోని రాజకీయ ఖైదీల హక్కుల కోసం 114 రోజులు నిరాహార దీక్ష చేసి, నిర్బంధంలోనూ పోరాటస్ఫూర్తిని రగిలించాడు. ప్రేమ అంటే జంతు ప్రవృత్తితో కూడిన వ్యామోహం కాదు. నైతిక విలువలు, సంస్కృతిపై ఆధారపడ్డ గొప్ప అనుభూతి. అది ఎన్నడూ మనిషిని దిగజార్చదు. ప్రతి మనిషి తప్పనిసరిగా లోతైన ప్రేమ భావనలు కలిగుండాలి అంటూ ఓ లేఖలో రాశారు భగత్ సింగ్. రెండు పదుల వయసులోనే ప్రేమను నిర్వచించిన భగత్‌సింగ్ మానసిక పరిణితి ఎంతగొప్పదో ఆ మాటల్లోనే అవగతమవుతోంది. తల్లిదండ్రులు బ్రిటిష్ ప్రభుత్వాన్ని క్షమాభిక్ష కోరుతుంటే భగత్‌సింగ్ దానిక్కూడా ఒప్పుకోలేదు.



అణగారిన సమాజానికి చెందిన తమతోటి పౌరులను సమానంగా చూడని వ్యక్తులకు రాజకీయ హక్కులను డిమాండ్ చేసే హక్కులేదని కూడా భగత్‌సింగ్ ఉద్ఘాటించారు. కుక్కలు వంటింట్లో తిరగడం ఇబ్బంది కాదని, దళితుడు గుడిలోకి లేదా బ్రాహ్మణుడి ఇంట్లోకి ప్రవేశించడం అంతా అపరిశు భ్రంగా మార్చే కులహిందూ సమాజాన్ని ఆయన విమర్శించారు. ఈ ఆచారం అమానుషం, ఈ సామాజిక వ్యవస్థలో దళితులను జంతువులకంటే తక్కువ స్థాయికి పరిగణిస్తారు. ముస్లింలు, సిక్కులు, క్రిస్టి యన్ మత సమూహాలు దళితులను తరచుగా సమానులుగా, వారి కమ్యూనిటీలలో కుల హిందువులను కించపరచడం ప్రారంభించాయి. దళితులను ఇతరుల రాజకీయాలకు వాడుకోవద్దని, సంఘటితం కావాలని సూచించారు.

భగత్‌సింగ్‌ను ఉరితీయడానికి రెండు గంటల ముందు కూడా లెనిన్ రివల్యూషనరీ పుస్తకాన్ని చదువుతూనే ఉన్నాడు. ఆ సమయంలో భగత్‌సింగ్‌తో దేశానికి ఏమైనా చెప్పాలని అనుకుంటున్నావా? అని అడిగితే సామ్రాజ్యవాదం తగ్గి విప్లవం కొనసాగాలని పిలుపునిచ్చాడు. 12 గంటల ముందే ఉరితీస్తున్నారని తెలియగానే లెనిన్ రివల్యూషనరీ పుస్తకంలో ఒక్క అధ్యాయం కూడా పూర్తి చేయడానికి నన్ను అనుమతించరా? అని అడిగాడు. ఆయనకు ఆ పుస్తకం పట్ల ఎంత ప్రేమ ఉందో ఈ మాటతో అర్థం చేసుకోవచ్చు. కానీ ఆయన కోరిక వారు తీర్చలేదు. ఉరితీయడానికి వేదికపై నిలబడుకుని ఉన్నప్పుడు దేవుడిని తలచుకోమంటే 'ప్రజలకు కష్టాలు ఇస్తున్నందుకు నేను దేవుడిని చాలా సార్లు తిట్టుకున్నాను. అలాంటిది ఇప్పుడెలా దేవుడిని స్మరిస్తాను' అని అన్నాడు. భగత్‌సింగ్ భారతీయ సమాజంలో పెరుగుతున్న మతతత్వ స్వభావాన్ని విమర్శించడమే కాకుండా, స్వాతంత్ర్య పోరాట సంవత్సరాల్లో అస్పృశ్యత, కులం తీవ్రమైన సమస్యపై కూడా రాశాడు. పదహారేండ్ల వయస్సులో జూన్ 1928లో అతను అంటరానితనం సమస్య అనే శీర్షికతో ఒక వ్యాసం రాశాడు. అంటరానివారిని హిందూ, ముస్లిం మిష నరీ సంస్థల మధ్య విభజించాలని 1923నాటి కాంగ్రెస్ సమావేశంలో మహమ్మద్ అలీ జిన్నా చేసిన ప్రతిపాదన నేపథ్యంలో ఈ వ్యాసం వచ్చింది. ఈ వ్యాసంలో, భగత్‌సింగ్ మొత్తం 30కోట్ల జనాభాలో ఆరుకోట్ల మందిని అంటరానివారిగా ఎలా పరిగణిస్తున్నారో, వారి స్పర్శ ఇతర మానవులను, ఆలయాలను, బావులలోని నీటిని ఎలా కలుషితం చేస్తుందో ఆయన ఎత్తి చూపారు. ఇరవయ్యో శతాబ్దంలోనూ ఇలాంటి వైఖరులు కొనసాగడం నిజంగా సిగ్గుచేటు.

ఒకవైపు భారతీయ ప్రజానీకం ఆధ్యాత్మికతలో చిక్కుకుపోతుంటే, మరోవైపు ఐరోపాలోని భౌతికవాద సమాజాలు శతాబ్దాలుగా విప్ల వాత్మకంగా మారుతున్నాయి. ఫ్రెంచ్, అమెరికన్ విప్లవాల సమయంలో సమానత్వం ఇప్పటికే ప్రకటించబడింది. రష్యా కూడా ఇటీవల అన్ని రకాల అసమానతలను రూపుమాపడానికి విప్లవాన్ని చూసింది. అణగారిన సమాజానికి చెందిన తమతోటి పౌరులను సమానంగా చూడని వ్యక్తులకు రాజకీయ హక్కులను డిమాండ్ చేసే హక్కులేదని కూడా భగత్‌సింగ్ ఉద్ఘాటించారు.

కుక్కలు వంటింట్లో తిరగడం ఇబ్బంది కాదని, దళితుడు గుడిలోకి లేదా బ్రాహ్మణుడి ఇంట్లోకి ప్రవేశించడం అంతా అపరిశుభ్రంగా మార్చే కులహిందూ సమాజాన్ని ఆయన విమర్శించారు. ఈ ఆచారం అమానుషం, ఈ సామాజిక వ్యవస్థలో దళితులను జంతువులకంటే తక్కువ స్థాయికి పరిగణిస్తారు. ముస్లింలు, సిక్కులు, క్రిస్టి యన్ మత సమూహాలు దళితులను తరచుగా సమానులుగా, వారి కమ్యూనిటీలలో కుల హిందు వులను కించపరచడం ప్రారంభించాయి. దళితులను ఇతరుల రాజకీయాలకు వాడుకోవద్దని, సంఘటితం కావాలని సూచించారు. 23 మార్చి 1931రాత్రి 7.30గంటలకి తన స్నేహి తులయిన విప్లవ యోధులు సుఖ్‌దేవ్, రాజ్‌గురులను నిరంకుశ బ్రిటిష్ ప్రభుత్వం వారి ముగ్గురినీ వరుసగా నిల్చో బెట్టి ఉరితీసింది. ఉరికొయ్య ముందు నిల్చుని కూడా ఆ ముగ్గురూ ఏ మాత్రం భయపడలేదు. ఉరికొయ్యని ముద్దాడే ముందు చివరిసారి ఇచ్చిన నినాదం ఇంక్విలాబ్ జిందాబాద్. ఆ ధైర్యమే ప్రవాహంలా మారి నేటితరాలకు చేరింది.



అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలు ఉధృతం

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

నాటి అమరవీరుల త్యాగాలను, వారు చేసిన పోరాటాలను ఆదర్శంగా తీసుకుని నేటి కార్యకర్తలు ఉద్యమించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక ఏదుళ్లచెరువు కాంపాటి వీరస్వామి భవన్‌లో సీపీఐ(ఎం) గ్రామ సీనియర్ నాయకులు ముత్తయ్య అధ్యక్షతన జరిగిన గ్రామ శాఖ మహాసభలో బండి రమేష్ ప్రసంగించారు. మండలంలో ప్రతి గ్రామంలో అనేక మంది అమరులు పార్టీ కోసం పని చేసి ప్రజల కోసం పనిచేసి అమరులయ్యారని, వారి త్యాగాన్ని పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని కార్యకర్తల ప్రజా ఉద్యమాలు చేయాలని ఆయన అన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీల అమలుకై, సంక్షేమ పథకాల అమలకై కార్యక్రమాలు రూపొందించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మాట్లాడుతూ గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని, ఈ సమస్యల పరిష్కారానికి ప్రజలు కదిలించి ఉద్యమాలు చేయాలని, ఆయన గ్రామ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మహాసభ ప్రారంభ సూచకగా పార్టీ జెండాను సీనియర్ నాయకురాలు దొండేటి సుగుణమ్మ ఆవిష్కరించారు. ఈ మహాసభలో వేగినాటి వెంకట్రావు, తుళ్లూరు నాగేశ్వరరావు, ఐద్వా మండల కార్యదర్శి వేగినాటి మంగతాయారు, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గాదే వరున్ ప్రసంగించారు. అనంతరం గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా ఫులకాని వెంకట్ నర్సయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శిగా కుంటా వెంకటేశ్వర్లు, పుట్టల గురవయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ శాఖ మహాసభలో కాంపాటి శ్రీదేవి, పుట్టల బాలమ్మ, దేవ కుమారి, సాలే లక్ష్మి, వినోద, ఎడ్ల ఉమేష్, రాములు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



మున్నేరు వరద బాధితులని ప్రభుత్వం ఆదుకోవాలి

మేయర్, కమిషనర్‌కు సీపీఐ(ఎం) వినతి

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

ఇటీవల వచ్చిన వరదలకు తీవ్రంగా నష్టపోయిన వరద బాధితుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం మూడు లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మూడు లక్షలు మంజూరు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసరావు, భూక్య శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఖమ్మం 3 టౌన్ ప్రాంతంలో మున్నేరు వరదల ముంపునకు గురైన ప్రజలను వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని, నీట మునిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన 16,500 వేయాలని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సాయం అందే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ మేరకు మేయర్, కమిషనర్‌లకు వినతిపత్రం అందజేశారు. మున్నేరు వరద వెంకటేష్ నగర్, పద్మావతి నగర్, బొక్కలగడ్డ, మంచికంటి నగర్, పంపింగ్ వెల్ రోడ్, సుందరయ్య నగర్, ప్రకాష్ నగర్, ఎఫ్‌సిఐ, ప్రకాష్‌నగర్, శ్రీనివాస్ నగర్ ప్రాంతాలలో వేలాదిమంది ఇల్లు వరద ముంపునకు గురయ్యాయని, సర్వం కోల్పోయిన కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 35వ డివిజన్ కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, పార్టీ సీనియర్ నాయకులు బండారు యాకయ్య, ఎస్‌కే సైదులు, పత్తిపాక నాగ సులోచన, సారంగి పాపారావు, చీకటి మల్ల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



ప్రభుత్వ ప్రకటనలకు పరిమితం కావద్దు : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-కారేపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పథకాలు ప్రకటనలకు పరిమితం కావద్దని వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం కారేపల్లి మండలం చర్లపల్లి సీపీఐ(ఎం) శాఖ మహాసభ తాటి సరోజిని అధ్యక్షతన ప్రారంభమైంది. ఈసభలో నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతు భరోసా వెంటనే విడుదల చేసి పంట పెట్టుబడుల కోసం అవస్థలు పడుతున్న రైతన్నలకు ఊరట కల్పించాలన్నారు. రైతు రుణమాఫీ జాప్యం చేసిన కొద్ది ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత పెరుగుతుందన్నారు. వ్యతిరేకత పోరాటాలకు దారి తీయకముందే రుణమాఫీ, రైతుభరోసాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. మారుమూల గ్రామాల్లో ప్రభుత్వ బడుల పట్ల పాలకుల నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. చర్లపల్లిలో మూతవేసిన ప్రభుత్వ బడిని తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్యం లోపించి జ్వరపీడితులు పెరుగుతున్నారని, స్థానిక సంస్థలకు నిధులు విడుదలలో జాప్యం చేయవద్దని కోరారు. ఖమ్మం నుండి వయా ఎర్రబోడు, గాదెపాడు, చర్లపల్లి మీదిగా ఇల్లందుకు ఆర్టీసీ బస్ ప్రారంభించాలని అధికారులను కోరారు. మహాసభ ప్రారంభ సూచకంగా పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు గలిగే బుచ్చిరాములు ప్రారంభించారు. శాఖ కార్యదర్శిగా బత్తుల శ్రీనివాసరావు(శేఖర్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో మండల కార్యదర్శి కే.నరేంద్ర, నాయకులు వజ్జా రామారావు, దాసరి మల్లయ్య, కౌసల్య, బారు నరసింహారావు, చుంచు రాంబాయి, ఎల్లబోయిన వీరబాబు, లక్ష్మయ్య రాంబాబు తదితరులు పాల్గొన్నారు



జూనియర్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు హార్వెస్ట్ విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-ఖమ్మం

ఇనిస్టిట్యూట్ ఆఫ్ మ్యాథమ్యాటిక్స్ ఎడ్యుకేషన్ థానె వారి ఆధ్వర్యంలో జూనియర్ మ్యాథమ్యాటిక్స్ ఒలింపియాడ్ పరీక్ష రాయుటకు అవసరమయ్యే అర్హత పరీక్ష మ్యాథ్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 2024కు తమ విద్యార్థినీ, విద్యార్థులు 30 మంది ఎంపికైనట్లు హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతీరెడ్డి తెలిపారు. ఆగస్ట్ 31న దేశవ్యాప్తంగా నిర్వహించిన మొదటి లెవల్ మ్యాథ్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్లో తమ విద్యార్థినీ, విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఫిబ్రవరి 2025లో నిర్వహించబోయే రెండవ లెవల్ జూనియర్ మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షకు 30మంది ఎంపిక కావడమే కాక, తమ విద్యార్థి జి.అర్జున్ 84 మార్కులతో మొదటి స్థానం సాధించగా, ఎస్.అభిరామ్ 76 మార్కులతో రెండవ స్థానం, ఈషాసింగ్, కృష్ణ సుచేత్, ఆయోగ్ ధీర్ 74 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారన్నారు. గణిత శాస్త్రంలో క్లిష్ట పద్ధతిలో నిర్వహించే ఈ పరీక్షలో తమ విద్యార్థినీ, విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. గురువారం హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతీరెడ్డి విద్యార్థినీ, విద్యార్థులను అభినందించి తదుపరి పరీక్షలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరచాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో ఐఐటి బ్రాంచ్ ఇంచార్జ్ జి.ఉమామహేశ్వరరావు, కె.నాగరాజు, గణిత శాస్త్ర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో సమాజంలో సమానత్వం సాధ్యం

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-ఖమ్మం

విద్యతో మాత్రమే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం వీరనారి ఐలమ్మ జయంతి పురస్కరించుకొని ఖమ్మంలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఎదురుగా ఐలమ్మ విగ్రహానికి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.జ్యోతి, బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత, ఎస్సీ సాధన కమిటీ అధ్యక్షురాలు కే.శ్రీలక్ష్మి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు దుంపటి నగేష్, బీసీ సంఘం అడ్వకేట్ మేకల సుగుణారావు, కల్లుగీత సంఘం జిల్లా



ప్రధాన కార్యదర్శి గాలి అంజయ్య, జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు పిండిప్రోలు రామ్మూర్తి, చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ వెంకటప్పయ్య, ప్రొఫెసర్ బివి.రాఘవులు, రజక సంఘం జక్కుల వెంకట రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, తుపాకుల వెంకన్న, యడవల్లి భాస్కర్ పాల్గొన్నారు.

మహిళా రక్షణ చట్టాలు పకడ్బందీగా అమలు జరగాలి

- ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ
- బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది
- ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి

నవతెలంగాణ-సత్తుపల్లి

మహిళా రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేసిననాడే మహిళల హక్కులు రక్షింపబడతాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ అన్నారు. సత్తుపల్లి మండలం సిద్దారంలో గురువారం జరిగిన ఐద్వా మండల 5వ మహాసభలో సరళ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం అనేక చట్టాలను తీసుకొస్తున్నామని చెబుతున్నా ఆ చట్టాల అమలు విషయంలో నిర్లక్ష్య వైఖరి అవలంభించడం వల్ల మహిళలపై రోజురోజుకి దాడులు, హత్యలు, అత్యాచారాలు పెట్రేగి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టాలను పకడ్బందీగా అమలు చేయకుంటే ఆ చట్టాలున్నా మహిళలకు న్యాయం జరగదని సరళ స్పష్టం చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులను



ఎదిరించేందుకు మహిళలు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఆయా రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. దళిత, గిరిజన మహిళలపై దాడులు మరింతగా ఎక్కువయ్యాయన్నారు. ప్రతిరోజూ దేశంలో మహిళలపై హింసాత్మక ఘటనలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు మెరుగు రమణ మాట్లాడుతూ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. అర్హులైన మహిళలకు ప్రతినెలా రూ. 2500 ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఆ హామీని విస్మరించిందన్నారు. సభ ప్రారంభానికి ముందు ఐద్వా జెండాను రేసు లక్ష్మి చేతుల మీదుగా ఎగుర వేశారు.

ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులుగా జ్యోతి, పార్వతి

మహాసభ అనంతరం సత్తుపల్లి మండల ఐద్వా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా జాజిరి జ్యోతి, కార్యదర్శిగా ఎలగం పార్వతిని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. వీరితో పాటు మరో 13మందిని ఐద్వా మండల కమిటీలో సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ సభలో వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్, పెనుబల్లి మండల ఐద్వా కార్యదర్శి నాగమణి, మారేశ్వరి, నాగేంద్ర, బండి సత్యవతి, వాసం నిర్మల, వెంకటరమణ, రాణి, పద్మ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా

తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత

నవతెలంగాణ- వైరా

రాష్ట్రంలో ఆర్యవైశ్యుల్లో కూడా ఎంతోమంది పేదవారు ఉన్నారని, అటువంటి వారి కోసమే ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేశారని ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ కాల్వ సుజాత అన్నారు. గురువారం వైరా వచ్చిన ఆమె వైరా ఆర్య వైశ్య సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. వైరా శ్రీ వాసవి కళ్యాణ మండపంలో మిట్టపల్లి రాఘవరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల్లో అన్ని పార్టీల వారు అన్ని రకాలుగా ఆర్యవైశ్యుల్ని ఉపయోగించుకుంటున్నారని, రాజకీయ ప్రాధాన్యత మాత్రం తక్కువగా ఉన్నదని, రాబోయే రోజుల్లో ఆర్యవైశ్యుల రాజకీయ ప్రవేశం పెరగాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యుల శాతానికి అనుగుణంగా రాజకీయాల్లో కూడా అవకాశం ఇవ్వాలని కోరారు ఇది తనకు జరిగిన సన్మానంగా భావించటం లేదని, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘానికి జరిగినట్లుగా భావిస్తున్నానని చెప్పారు. ఆర్యవైశ్యులకు ఎవరికి ఎటువంటి పని ఉన్నా తనను సంప్రదించాలని, వ్యాపారస్తులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వైరా నియోజకవర్గంలో ఆర్యవైశ్యులకు ఏదైనా సమస్య ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకొని రావచ్చని ఆమె అన్నారు. వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో ఆర్య వైశ్యులు ముందుంటారని, ఎవరికి అన్యాయం చేయని వ్యక్తులు ఆర్యవైశ్యులని, వారికి



అన్ని వేళలా తన సహాయ సహకారాలు అందజేస్తానని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపాలిటీ చైర్మన్ సూతకాని జైపాల్, కట్ల రంగారావు, మిట్టపల్లి నాగి, శీలం వెంకటరెడ్డి, ఏదునూరి సీతారాములు, కాల్వ సుజాత అభిమాన సంఘ బాధ్యులు అనుమోలు భాస్కరరావు, గ్రంధి ప్రవీణ్, తాటికొండ రాము, మిట్టపల్లి శ్రీనివాసరావు, పెనుగొండ ఉపేంద్రరావు కొణిజర్ల, సుజాతనగర్, కామేపల్లి, మధిర, ఖమ్మం మండలాల ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొని కాల్వ సుజాతకు గజమాలతో ఆహ్వానం పలికి భారీ ర్యాలీ నిర్వహించారు. సన్నాయి మేళం, కోలాటాల బృందంతో సభాస్థలి వద్దకు తీసుకొని వచ్చి అభినందనలు తెలిపారు.



పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ అన్నారు. మండలంలోని వెంకటగిరి, కాచిరాజు గూడెం గ్రామాల్లో సీపీఐ(ఎం) గ్రామ శాఖ మహాసభలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటగిరి గ్రామంలో బండి రమేష్ మాట్లాడారు. ఖమ్మంరూరల్ మండలంలో అనేక గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఉన్నాయని, వాటిని అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంకటగిరి గ్రామంలో అనేకమంది పేదలు ఉన్నారని, ఇళ్ల స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నారని, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇల్లు నిర్మించుకునేందుకు 5 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాచిరాజుగూడెం గ్రామంలో శాఖ మహాసభ అట్టహాసంగా నిర్వహించారు. శౌర్య యాత్ర సభ్యులు ఆటపాటలతో శాఖ మహాసభను ఉర్రుతలుగించారు. వెంకటగిరి శాఖ కార్యదర్శిగా దగ్గుపాటి వైకుంఠం, నంబూరు వెంకటనారాయణ, కాచిరాజుగూడెం శాఖ కార్యదర్శిగా పొన్నం భాస్కర రావు, మహిళ శాఖ కార్యదర్శిగా యల్ది మదనమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్ర మంలో పార్టీ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు ఉరడీ సుదర్శన్‌రెడ్డి, బండి పద్మ, నాయకులు పి.మోహన్‌రావు, పి.సంగయ్య, నందిగామ కృష్ణ, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, పొన్నం వెంకటరమణ, అద్దంకి తిరు మలయ్య, కారుమంచి గురవయ్య, నంబూరి మంగ, గోగుల శ్రీనివాస రావు, నాగాటి రాంబాబు, పొన్నం మురళి, నగేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేకత రాక ముందే మేల్కోవాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం

నవతెలంగాణ-వైరా



ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. మండలంలోని విప్పలమడక గ్రామ పార్టీ శాఖా మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కొల్లా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో వీరభద్రం మాట్లాడుతూ గ్రామాల్లో కనీసం వీధిలైట్లు వేసే పరిస్థితి లేదని, నిధులు లేక గ్రామ పంచాయతీలు కునారిల్లుతున్నాయని అన్నారు. వర్షాలతో గ్రామాలు మురికి కూపాలుగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే బ్లీచింగ్ పౌడర్‌కొనే పరిస్థితి పంచాయతీలకు లేదని వీరభద్రం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కొరకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రైతులకు రుణమాఫీ పూర్తి స్థాయిలో చేసి, రైతుబంధు అందించాలని కోరారు. సిపిఎం ఆధ్వర్యంలో విప్పలమడక గ్రామంలో అభివృద్ధి జరిగిందని, వచ్చే స్థానిక ఎన్నికల్లో ప్రజలు సిపిఎంను తిరిగి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలపై పోరాడే సిపిఎం బలపడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. తొలుత మహాసభ ప్రాంగణంలో అరుణ పతాకాన్ని సీనియర్ నాయకులు తుమ్మల జాన్‌పాపయ్య రుద్రాక్షల వేంకటాచారి ఎగురవేశారు. గ్రామ మాజీ సర్పంచ్ పారుపల్లి కృష్ణారావు రాజకీయ పరిణామాలు వివరించారు. మహాసభలో మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు బాణాల శ్రీనివాసరావు, మేడా శరాబంది, ఎదుళ్ల పుల్లయ్య, గరిడేపల్లి పుల్లయ్య, ఇమ్మడి బాబురావు, మాజీ ఉప సర్పంచ్ యెదుళ్ళ కృష్ణకుమారి, మాజీ వార్డు సభ్యురాలు ముత్తమాల జ్యోత్స్న, మార్కం కళావతి ఇనపనురి శ్రీను, నామాల వెంకయ్య, చావా వేంకటేశ్వరరావు, మొటిపల్లి రామారావు, ఉన్నం రామారావు, గరిడేపల్లి అనిల్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామ శాఖ కార్యదర్శిగా గరిడేపల్లి సుబ్బారావును మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది.



రాష్ట్రస్థాయి స్కేటింగ్‌కు స్మార్ట్ కిడ్జ్ విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో మూడవ తరగతి విద్యార్థి విశ్వ కార్తిక్ రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. వచ్చే నెలలో 3,4 తేదీలలో భువనగిరిలో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి రోలర్ స్కేటింగ్ పోటీలకు జిల్లా నుంచి ఎంపికయ్యాడు. ఈ నెల 22వ తేదీన సర్దార్ పటేల్ స్టేడియంలో ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన రోలర్ స్కేటింగ్ జిల్లా స్థాయి పోటీలలో విశ్వ కార్తిక్ మూడు బంగారు పతకాలను సాధించాడు. రోడ్డు స్కేటింగ్ పోటీలలో, వన్ లాప్ స్కేటింగ్ పోటీలలో, 5 లాప్స్ స్కేటింగ్ కాంపిటీషన్‌లో వరుసగా మూడు బంగారు పతకాలను సాధించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింప చేశాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన తమ పాఠశాల విద్యార్థి విశ్వ కార్తీక్ ను పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య గురువారం ప్రత్యేకంగా అభినందించారు. అభినందన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) సానుభూతిపరురాలి మృతి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మండలంలోని తెల్దారుపల్లి గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సానుభూతిపరాలు నారపొంగు స్వాతి (40) హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. స్వాతి మృతదేహాన్ని గురువారం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొమ్ము శ్రీను, జిల్లా నాయకులు తమ్మినేని కోటేశ్వరరావు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలికి భర్త కొండల్, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నివాళులర్పించిన వారిలో ఆంధ్ర బ్యాంక్ సొసైటీ కర్షక సేవా సమితి వైస్ చైర్మన్ తమ్మినేని విజయలక్ష్మి, సీపీఎం నాయకురాలు తమ్మినేని ఉమా, మడిపల్లి వెంకన్న, మల్లెబోయిన రాజేశేఖర్, రంజాన్, యల్లంపల్లి నాగయ్య, దొడ్డ శ్రీను, పగిడిపల్లి ఉపేందర్, వెంకట్రావు, యల్.సైదులు, వెంకన్న, సీతయ్య, రాములు, వీరబాబు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మండలంలోని గుర్రాలపాడు విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ విద్యుత్తు లైన్లో మరమ్మతులు పనులు, జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు గుర్రాలపాడు, గుదిమళ్ల, వెంకటగిరి గ్రామ పంచాయతీల పరిధిలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ క్రాంతిసింహా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

డంపింగ్ యార్డ్ ను పరిశీలించిన కమిషనర్

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

నగరంలోని డంపింగ్ యార్డ్‌ని గురువారం మున్సిపల్ కమిషనర్ సందర్శించారు. డంపింగ్ యార్డ్‌లో జరుగుతున్న బయోమైనింగ్ ప్రాసెసింగ్ గురించి మరియు అక్కడ ఉన్న పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆటోలు, ట్రాక్టర్ల నుంచి తీసుకొచ్చి పొడి చెత్తని సేకరించే కేంద్రాన్ని పున ప్రారంభించాలని అన్నారు. తడి చెత్త, పొడి చెత్త వేరేగా తీసుకువచ్చేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలని అసిస్టెంట్ కమిషనర్‌కి ఆదేశాలు జారీ చేశారు. ఏబీసీ సెంటర్ యానిమల్ బర్త్ కేర్ సెంటర్ సందర్శించి కుక్కలకి చేస్తున్న సర్జరీని చూడడం జరిగినది.ఏబీసీ సెంటర్ వారితో మాట్లాడుతూ సెంటర్ ని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.

అంగన్వాడీ కేంద్రాలలోని పిల్లలకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-తల్లాడ

తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం అంగన్వాడి కేంద్రాలలోని పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ రత్న మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లల్లో పోషకాహార లోపాలకు గురైన వారికి రక్తహీనత పరీక్షలు, వయసుకు తగ్గ ఎత్తు బరువు, పరీక్షలు నిర్వహించి ఎవరైతే వయసుకు తగ్గ ఎత్తు, ఎత్తుకు తగ్గ బరువు, లేని వారికి ఆరోగ్య సూచనలు చేశామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్స్ పెద్ద పుల్లయ్య, కమల, భద్రమ్మ, రోజా కుమారి సత్యవతి హరీష్ అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫెడరల్ రాజ్యాంగంలో జమిలి ఎన్నికలు సాధ్యం కాదు

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు

నవ తెలంగాణ - బోనకల్

ఫెడరల్ రాజ్యాంగంలో జమిలి ఎన్నికలు ఎప్పటికీ సాధ్యం కాదని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని పెద్దబీరవల్లి గ్రామంలో సిపిఎం పెద్దబీరవల్లి గ్రామ శాఖ మహాసభ పెద్దపోలు కోటేశ్వరరావు అధ్యక్షతన గురువారం జరిగింది. తొలుత మహాసభల ప్రారంభ సూచికంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు సిపిఎం పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మరికొందరి అమరవీరులకు పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, సిపిఎం మధిర పట్టణ మాజీ కార్యదర్శి పాపినేని రామ నరసయ్య మండల కమిటీ సభ్యులు బంధం శ్రీనివాసరావు, పెద్దపోలు కోటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన మహాసభలో పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెరువు కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆనాటి జమీందారులకు, భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో చాకలి ఐలమ్మ వీరోచితమైన పోరాటం చేసిందన్నారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చరిత్రలోనే నిలిచిపోయింది అన్నారు. అనేకమంది పోరాట యోధులు ఈ పోరాటంలో అమరులయ్యారన్నారు. ఆ పోరాటం స్ఫూర్తితోనే సిపిఎం ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. వైరా బహిరంగ సభలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రైతులందరికీ రెండు లక్షల రూపాయల లోపు రుణమాఫీ చేసినట్లు



ప్రకటించారన్నారు. కానీ అనేక గ్రామాలలో రుణమాఫీ కాని రైతులు 50 శాతం వరకు ఉన్నారన్నారు. కెసిఆర్ కూడా లక్ష రూపాయల రుణమాఫీ చేస్తానని ఐదు సంవత్సరాల పరిపాలనలో కూడా చేయకుండా రైతులను మోసం చేశాడని, అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతులను మోసం చేస్తుందని విమర్శించారు. అనంతరం నూతన శాఖ కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొదటి శాఖ కార్యదర్శిగా చింతలచెరువు రమేష్ ,రెండో శాఖ కార్యదర్శిగా పెద్దపోలు రామారావు, మాజీ ఎంపిటిసిలు కర్లకుంట దేవమణి, కర్లకుంట ముత్తయ్య, కెవిపిఎస్ నాయకులు కర్లకుంట నరేష్, నాయకులు ఆళ్ల పుల్లమ్మ, మిరియాల వెంకటకృష్ణ, సిపిఎం జానకిపురం శాఖ కార్యదర్శి కుక్కల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సురేష్‌కు సన్మానం

నవతెలంగాణ-వైరాటౌన్



టీజీఈ జేఏసీ కార్యదర్శిగా ఎన్నికైన డాక్టర్ కుప్పిశెట్టి సురేష్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ కుప్పిశెట్టి సురేష్ సేవలు మరింతగా ఉద్యోగులకు అందించాలని, స్థానిక వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎల్.నవీన్ జ్యోతి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్లు ,అధ్యాపకులు, పెన్షనర్లు, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ సంఘాల జేఏసీ (టీజీఈ జేఏసీ) రాష్ట్ర కార్యదర్శిగా తమ కళాశాలలో సివిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ కుప్పిశెట్టి సురేష్ ఎన్నిక కావటం పట్ల చాలా సంతోషం తెలుపుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు పాత్ర పోషించాలని కోరారు. అనంతరం డాక్టర్ కుప్పిశెట్టి సురేష్ మాట్లాడుతూ..ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జేఏసీ ఆధ్వర్యంలో చురుకైన పాత్ర పోషిస్తానని తెలుపుతూ తనకు సన్మానం చేసినందుకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన జ్యోతి, కళాశాల టీచింగ్, నాన్ -టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయి పోరాటాలు నిర్మించాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వర్గ సభ్యులు అరుణ

నవతెలంగాణ-వైరాటౌన్



శాఖ సభ్యులు అందరూ గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి ప్రజలను కదిలించి గ్రామస్థాయి పోరాట నిర్మించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వర్గ సభ్యులు గాలి అరుణ అన్నారు. పూసలపాడు గ్రామంలో సీపీఐ(ఎం) గ్రామ శాఖ మహాసభ గాలి ప్రేమ సాగర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గాలి అరుణ మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు పథకాలు అమలు చేయడంలో విఫలం అయిందని, రానున్న కాలంలో గ్రామస్థాయి ఉద్యమాలు ఉధృతం చేయాలన్నారు. రానున్న కాలంలో ఎర్రజెండా నాయకత్వాన్ని కోరుకుంటారని, ప్రజల్లో మార్పు వచ్చేంత వరకు వర్గ పోరాటాలు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శిగా ద్రోణాదుల నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల కార్యదర్శి తోట నాగేశ్వరావు, మండల కమిటీ సభ్యులు ద్రోణాదుల నాగేశ్వరరావు, గాలి సాంబశివయ్య, వై.రాధయ్య, పూర్ణ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలలోనే పిల్లలకు సంరక్షణ

నవతెలంగాణ-వేంసూరు

అంగన్వాడీ కేంద్రాలలోనే తల్లులకు, పిల్లలకు సంరక్షణ ఉంటుందని సీడీపీఓ కనకదుర్గ అన్నారు. గురువారం మండల పరిధిలో బీరాపల్లి సెక్టర్లో శంభునిగూడెం రైతు వేదిక నందు ఐసిడిఎస్ సూపర్వైజర్ కే. భవాని ఆధ్వర్యంలో సామూహిక శ్రీమంతాలు నిర్వహించి గర్భిణీలు తీసుకోవలసిన పోషకాహారం జాగ్రత్తలు గూర్చి వివరించారు. పోషణ మాస వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఇందు ప్రియ, రంగు కోటేశ్వరచారి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పోషణ అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాలకు పుస్తకాలు వితరణ

నవతెలంగాణ-కూసుమంచి

మండలంలోని జెడ్పీహెచ్ఎస్ చేగొమ్మ పాఠశాలల్లో గురువారం డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, డాక్టర్ బొల్లికొండ శ్రీదేవీ, శ్రీదేవి నర్సింగ్ హెూమ్, ఖమ్మం వారి స్వంత ఖర్చులు రూ.37 వేల విలువ గల డైరీలు, తెలుగు, హిందీ, ఇంగ్లీష్ చూసి రాత పుస్తకాలు, నోట్స్‌లు లయన్స్ క్లబ్ ఖమ్మం ఆధ్వర్యంలో 125 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ సంవత్సరం పదవ తరగతిలో ప్రథమ ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులకు ప్రైజ్ మనీ ఇస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఖమ్మం ప్రెసిడెంట్ డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, డాక్టర్ బోలికొండ శ్రీదేవి, రీజనల్ చైర్ పర్సన్ డిసిపి రావు, సెక్రెటరీ శ్రీరామ్, ట్రెజరర్ గోవిందరావు, లైయన్స్ క్లబ్ మెంబర్స్ విశ్వేశ్వరరావు, డి .నాగేశ్వరరావు, టి. హుస్సేన్, వెంకయ్య, ఎస్.శ్రీనివాసరావు, రిటైర్డ్ తహసీల్దార్ దుర్గయ్య, ఎంఈఓ ఆర్.వీరస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.రాధాకృష్ణ, ఎఎంసి చైర్మెన్ వి.తిరుపమ్మ, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కే.సురేష్, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా స్వచ్ఛత హి సేవ కార్యక్రమం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

స్వచ్ఛతా హి సేవ 2024-25 కార్యక్రమంలో భాగంగా 40 వ డివిజన్ మోమినన్ ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛత ప్లేడ్జ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ సానిటరీ ఇన్స్‌పెక్టర్ పాఠశాల సిబ్బంది, జవాన్లు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మహిళా సంఘం మండల మహాసభ

నవతెలంగాణ-ఎర్రుపాలెం

అఖిల భారత మహిళా సంఘం ఐద్వా మండల మహా సభ శుక్రవారం నిర్వహిస్తున్నట్లు మహిళా సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి లక్ష్మీ, దేవరకొండ అనిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని మామునూరు గ్రామంలో మహిళా సంఘం నాలుగవ మండల మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో భవిష్యత్ కార్యచరణను నిర్ణయించుకొని రానున్న రోజులలో మహిళలు స్వేచ్ఛగా చైతన్య వంతంగా నిలిచేందుకు కావలసిన పోరాటాలను రూపొందించుకుంటామని తెలిపారు. ఈ మహాసభకు ఐద్వా రాష్ట్ర కమిటీ నాయకురాలు బుగ్గవీటి సరళ, ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు బండి పద్మ హాజరవుతారని తెలిపారు. మహిళలందరూ సకాలంలో హాజరై మహిళా సంఘం మండల మహాసభను విజయ వంతం చేయాలని కోరారు.

పశువుల కాపరి అదృశ్యం

- గాలిస్తున్న గజ ఈతగాళ్లు

నవతెలంగాణ-వేంసూరు



మండల పరిధిలోని కందుకూరులో పశువుల కాపరి తుంగా రామారావు(50) బుధవారం పశువులను మేతకు తోలుకొని వెళ్లిన రామారావు సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. బుధవారం తమ్మిలేరు వాగు సాయంత్రానికి 15 అడుగులు వరద ప్రవాహం రావడంతో వాగులో కొట్టుకుని పోయి ఉండవచ్చు అని అనుమానంతో తహసీల్దార్ బాబ్జి ప్రసాద్, ఎస్సై వీరప్రసాద్ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లను తీసుకుని వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు గాలింపు కొనసాగుతూనే ఉంది.

టీజీఈజేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా డాక్టర్ కొప్పిశెట్టి సురేష్

నవతెలంగాణ-ఖమ్మం



తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, అధ్యాపకులు, కార్మికులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, రాష్ట్ర జేఏసీకి కార్యదర్శిగా డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని సుమారు 205 పైగా వివిధ రకాల ఉద్యోగుల సంఘాల నాయకుల విస్తృత సమావేశం మంగళవారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జేఏసీ అధ్యక్షులు ఎం.జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరు శ్రీనివాసరావు నూతన టీజీఈజేఏసీ రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ నూతన కార్యవర్గంలో డాక్టర్ కొప్పిశెట్టి సురేష్‌ను టీజీఈజేఏసీ రాష్ట్ర కార్యవర్గంలో రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. డాక్టర్ కొప్పిశెట్టి సురేష్, ప్రస్తుతం తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ మాట్లాడుతూ వివిధ రకాల కారణాలవల్ల క్రమబద్ధీకరణ కాని కాంట్రాక్టు అధ్యాపకులు క్రమబద్ధీకరణ అంశాన్ని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తొందరగా వీరి క్రమబద్ధీకరణ జరిగేటట్లు తమ వంతు పాత్ర నిర్వహిస్తానన్నారు.

కమిషనర్ల బదిలీపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిలో లేదు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్



వైరా మున్సిపాలిటీ కమిషనర్ల బదిలీపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు అన్నారు. గురువారం సీపీఐ(ఎం) గండగలపాడు గ్రామ శాఖ మహాసభలు పల్లెబోయిన కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా పార్టీ పతాకాన్ని సినీయర్ నాయకులు వాసిరెడ్డి విద్యాసాగర్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీ ఏర్పడి ఆరు సంవత్సరాల పూర్తి అయితే ఇప్పటికి పన్నెండు మంది కమిషనర్‌లు వచ్చి బదిలీపై వెళ్లారని, రాజకీయ జోక్యంతో కమిషనర్‌లు పనిచేయలేని పరిస్థితి నెలకొందని అన్నారు. వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి వచ్చిన ఇరవై కోట్ల రూపాయలు ఖర్చు చేయకుండా వెనుకకు వెళ్ళాయని, ఆ నిధులను వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి తిరిగి విడుదల చేయాలని, మధ్యలో నిలిచిపోయిన అంతర్గత రహదారులు, డ్రెయినేజీ నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, కార్యదర్శివర్గ సభ్యులు చింతనిప్పు చలపతిరావు, మల్లెంపాటి రామారావు, మచ్చా మణి, శాఖ కార్యదర్శి గుమ్మా నరిసింహారావు, ఇమ్మడి సుధీర్, సంక్రాంతి కృష్ణమూర్తి, దేవభక్తిని నరిసింహారావు, చేబ్రోలు కృష్ణమూర్తి, కిన్నెర మోతీ, కిన్నెర నారాయణ, చిత్తారు మురళి, కామినేని రవి, పాపగంటి రాంబాబు, రాచబంటి విజయ, గుమ్మా లక్ష్మిసాయి, దూద్దుకూరి వీరమ్మ, సీతారామమ్మ ఇమ్మడి వీరభద్రం, బలేబోగు తిరుపతిరావు, ఖాజా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలి

- సీపీఐ(ఎం) వైరా నియోజకవర్గం ఇన్‌చార్జి భూక్యా వీరభద్రం

నవతెలంగాణ-వైరాటౌన్



మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూములను, ఎన్ఎస్పీ కాలువల భూములను సర్వే చేసి ఇండ్ల స్థలాలు లేని పేద ప్రజలకు పంపిణీ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, వైరా నియోజకవర్గం ఇన్‌చార్జి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని గురువారం సీపీఐ(ఎం) పి.ఎస్-2 శాఖ, పల్లిపాడు గ్రామ శాఖల మహాసభలు నిర్వహించారు. మహాసభ ప్రారంభ సూచికగా సీనియర్ నాయకులు పారుపల్లి చంద్రశేఖర్‌బాబు, పారుపల్లి శ్రీనాథ్ బాబు పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా భూక్యా వీరభద్రం మాట్లాడుతూ ఒక వైపు నివాస స్థలాలు, ఇండ్ల లేక పేద ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు కొంతమంది పలుకుబడి ఉన్న వ్యక్తులు ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని విమర్శించారు. వేంటనే స్థానిక ఎమ్మెల్యే, మున్సిపాలిటీ అధికారులు స్పందించి వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎస్పీ కాలువల భూములు, ప్రభుత్వ భూములను సర్వే చేసి ఇండ్లు లేని పేద ప్రజలకు ఇండ్ల స్థలాలు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కార్యదర్శులుగా డాక్టర్ గుడిమెట్ల మోహన్‌రావు, దామా వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు చింతనిప్పు చలపతిరావు, బోడపట్ల రవీందర్, రాచబంటి బత్తిరన్న, ఎస్.ఎం.రఫీ, మాడపాటి రామారావు, మాడపాటి వెంకటి, సామినేని నరసింహారావు, తాటి ఎసు, తాండ్ర అమీన్, బాబు తదితరులు పాల్గొన్నారు.

33 వ డివిజన్ సీపీఐ(ఎం) శాఖ కార్యదర్శిగా యర్రా సాయికుమార్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



ఖమ్మం త్రీ టౌన్ 33 వ డివిజన్ సీపీఐ(ఎం) శాఖ కార్యదర్శిగా యర్రా సాయికుమార్‌ని గురువారం నిర్వహించిన శాఖ మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం శాఖ మహాసభల్లో ఎన్నికైన శాఖ కార్యదర్శి యర్రా సాయికుమార్ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో నాకు ఈ కార్యదర్శి పదవిని అప్పజెప్పిన సీపీఐ(ఎం) త్రీ టౌన్ కమిటీకి ధన్యవాదాలు తెలియజేస్తూ భవిష్యత్తులో పార్టీ నిర్వహించే ప్రతి కార్యక్రమంలో పాల్గొంటానని, అదే విధంగా 33వ డివిజన్‌లో పార్టీ బలోపేతానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానన్నారు. రానున్న కాలంలో ఈ డివిజన్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల మీద నిత్యం పనిచేస్తానని, ప్రజలకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటానని తెలిపారు. క్రమశిక్షణగా ఉండటం వలన డివైఎఫ్ఐ త్రీ టౌన్ అధ్యక్షుడిగా ఉంటూనే మరొక బాధ్యత కేటాయించడం తనపై నమ్మకానికి సహాయ సహకారాలు అందిస్తూ పార్టీకి ఎప్పుడు అందుబాటులో ఉంటానని తెలిపారు.

మద్దినేని అనంతరామయ్యకు నివాళి

నవతెలంగాణ-కామేపల్లి

మద్దినేని అనంతరామయ్య చిత్రపటానికి మాజీ మంత్రి రామ్‌రెడ్డి దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే కోరం కనకయ్య, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి పూలదండలు వేసి నివాళులర్పించారు. మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి ముఖ్య అనుచరుడు మద్దినేని నరసింహారావు నాన్న అనంతరామయ్య కుటుంబాని వారు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల గ్రామాల నాయకులు, ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

నవతెలంగాణ-వైరాటౌన్

మున్సిపాలిటీలోని 14 వార్డు పరిధిలో గల శాంతినగర్ ఎస్టీ కాలనీ రైతు వేదిక సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఎన్ఎస్పీ కాలువపై నిర్మాణం చేపట్టిన ఇంటిని గురువారం మున్సిపాల్టీ అధికారులు, సిబ్బంది ప్రొక్లైన్‌తో కూల్చివేశారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ ఎస్టీ కాలనీ పక్కన ఎన్ఎస్పీ కాలువ స్థలాలను కొంతమంది ఆక్రమించి బిల్డింగ్ నిర్మాణాలను చేపట్టారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా బిల్డింగ్ నిర్మాణం చేపట్టడంతో మున్సిపల్ కమిషనర్ వేణు, టౌన్ ప్లానింగ్ అధికారి భాస్కర్ నిర్మాణ పనులను పరిశీలించి ప్రొక్లైన్‌తో బిల్డింగ్ నిర్మాణాన్ని తొలగించారు. ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూములలో నిర్మాణాలు చేపడుతున్న భవనాలను హైడ్రా అమలు చేయడంతో అక్రమ నిర్మాణం పనులను కూల్చి వేశారు. దీంతోపాటు మరికొంత మంది స్థానికులు ఖాళీగా ఉన్న ఎన్ఎస్పీ కెనాల్ పై ఏర్పాటు చేసిన పల్లె పకృతి వనంలో ఇల్లు నిర్మాణం చేపట్టేందుకు కర్రలు, జెండాలు పాతి పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణు, టౌన్ ప్లానింగ్ అధికారి భాస్కర్, రెవెన్యూ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.



బావిలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

నవతెలంగాణ-కల్లూరు



మతిస్థిమితం లేని వ్యక్తి ప్రమాదశాస్తు బావిలో పడి గురువారం మృతి చెందాడు. ఎస్ఐ ఎస్కే. షాకీర్ తెలిపిన వివరాలు ప్రకారం పట్టణంలోని పుల్లయ్య బంజర్ రోడ్‌లో గల నన్న కృష్ణయ్య(73) మతిస్థిమితం సరిగా లేనందున బుధవారం మధ్యాహ్నం 12:30 గంటలకు ఇంటి నుండి బయటకు వెళ్లి పోయినాడు అని నన్నా బ్రహ్మానందం ఇచ్చిన ఫిర్యాదు ఇవ్వగా మ్యాన్ మిస్సింగ్ కేసు నమోదు చేయటం జరిగినది తెలిపారు. కల్లూరు బంధువులు వెతికిలాడిన దొరకలేదని పోలీసులు ఫిర్యాదు చేశారు. బొడ్డు సెంటర్లో గల పాడుబడ్డ బావిలో ప్రమాదవశాస్తు పడి మృతి చెంది శివమై పైకి తేలేరు. గమనించిన వారు కుటుంబ సభ్యులకు తెలపగా పోలీసులు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి పంచన మా నిమిత్తం తరలించారు.

యూట్యూబర్ వ్యాఖ్యలతో రెండు వర్గాల మధ్య ఘర్షణ

- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వైనం
- గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలి : ఏసీపీ బీ.తిరుపతిరెడ్డి

నవతెలంగాణ-నేలకొండపల్లి



మండలంలోని చెరువుమాదారం గ్రామంలో ఓ యూట్యూబర్ చేసిన వ్యాఖ్యలు సంచలనం కలిగించాయి. ఆయన చేసిన వ్యాఖ్యల క్లిప్పింగ్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో గ్రామంలోని రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారి తీసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలోకి వెళ్తే ఇటీవల వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఒక యూట్యూబర్ చేసిన వీడియో క్లిప్పింగ్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో రెండు వర్గాల మధ్య విభేదాలు నెలకొని పరస్పరం దూషించుకున్నారు. దీంతో గ్రామంలో రెండు వర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఒక వర్గం వారి అంత్యక్రియల కార్యక్రమానికి దూరంగా ఉండాలని మరొక వర్గం వారు తీర్మానించుకున్నారు. విషయం తెలుసుకున్న ఎదుటి వర్గం వారు తమ వ్యవసాయ పనులకు ఆ వర్గం వారిని రానివ్వకూడదని తీర్మానించుకున్నట్లు తెలిసింది. తమ వర్గం వారిని ఎదుటి వర్గం వారు కించపరిచి దూ షించారని, ఎవరికి వారు భావించి పోలీసులకు ఫి ర్యాదు చేసుకున్నారు. నేల కొండపల్లి పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాల వారిని గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు పిలిపించి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం రూరల్ ఏసీపీ పీ.తిరుపతిరెడ్డి విలే కరులతో మా ట్లాడుతూ గ్రామంలో శాంతియుత వాతా వరణం నెలకొల్పాలని పరస్పరం ఒకరినొకరు సహకరించుకుంటూ జీవనం సాగించాలని చెప్పారు. ఎవరు ఎటువంటి అపోహలకు గురికావద్దని ఆయన సూచించారు. గ్రామంలో అలజడి, ఘర్షణ, అశాంతి వాతావరణానికి కొంతమేర మద్యం కూడా కారణమవుతుందన్నారు. దానిని నివారించేందుకు సంబంధిత అధికారులతో చర్చిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి సిఐ టీ.సంజీవ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఎర్రుపాలెం



మండల పరిధిలోని మీనవోలు గ్రామ సమీపంలో గురువారం గుర్తు తెలియని వాహనం తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు మీనవోలు గ్రామం నుండి పల్సర్ బైక్ పై వెళుతున్న మధిర పట్టణం వట్టికొండ వారి వీధికి చెందిన షేక్ షారుక్ (26) విజయవాడ వైపు వెళు తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో షారుక్ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తల్లి దండ్రులు ఇరువురు ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎర్రుపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐలమ్మ స్ఫూర్తితో మహిళలు హక్కుల సాధనకై పోరాడాలి

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



ఖమ్మం కార్పొరేషన్

వీరవనిత, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో మహిళలు తమ హక్కుల సాధనకు పోరాటాలు చేయాలని బీసీ సంక్షేమశాఖ అధికారి జ్యోతి అన్నారు. గురువారం వీరనారి మణుల ఆశయ సాధన సమితి జిల్లా కార్యాలయంలో ఆ సమితి జిల్లా ఉపాధ్యక్షురాలు త్రివేణి అధ్యక్షతన నిర్వహించిన చిట్యాల ఐలమ్మ జయంతి సభలో జ్యోతి పాల్గొని మాట్లాడారు. మహిళలు పోరాటాల ద్వారానే తమ సాధికారతను సాధించగలరని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వపరంగా మహిళలకు లభించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునేందుకు తోటి మహిళలను చైతన్య పర్చాలని పిలుపునిచ్చారు. ప్రముఖ హృద్రోగ వైద్య నిపుణులు, ప్రముఖ సామాజిక ఉద్యమ నాయకులు ఎంఎఫ్.గోపీనాథ్ మాట్లాడుతూ చిట్యాల ఐలమ్మ భూమికోసం భుక్తి కోసం పెట్టి చాకి విముక్తి కోసం పోరాడిన చరిత్రను మహిళలు విస్తృతంగా అధ్యయనం చేయాలని సూచించారు. అనంతరం రాజ్యాంగ పీఠిక చదివి , రాజ్యాంగ పరిరక్షణ అంశంపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్ర బాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడాల ఝాన్సీ, జిల్లా గౌరవ అధ్యక్షురాలు షేక్. నజిమా, గౌరవ సలహాదారులు పుల్లూరి నాగయ్య, ప్రత్యేక ఆహ్వానితులు గుంటేటి వీరభద్రం, జంగిపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

చింతకాని : చింతకాని మండలం రామకృష్ణాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నల్లగట్ల మురళీ అధ్యక్షతన వీరనారీ చిట్యాల ఐలమ్మ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గండారపు రామారావు, పంచాయతీ సిబ్బంది ఖాదర్ బాబు, కొప్పుల నాగేశ్వరరావు, పోతురాజు యాదగిరి, ఆశ వర్కర్లు పాలకుర్తి పద్మ, కామేశ్వరి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వేంసూరు : నేటి మహిళలకు స్ఫూర్తి చిట్యాల ఐలమ్మని మండల రజక సేవా సంఘం అధ్యక్షుడు తాళ్లూరి రామారావు అన్నారు.గురువారం ఐలమ్మ జయంతి సందర్భంగా అడసర్లపాడులో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో శివ నాగేషు తదితరులు పాల్గొన్నారు.

వైరాటౌన్ : తెలంగాణ సాయుధ పోరాటంలో చిట్యాల ఐలమ్మ పోరాటం కీలకమైన పాత్ర వహించిందని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ తెలిపారు. గురువారం స్థానిక చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి రజియా సుల్తానా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కే.శ్రీకాంత్, సిహెచ్.మధు, బండి ఈశ్వర్, సుధాకర్, కవిత, ప్రముఖ ప్రజా గాయకుడు మేదర వెంకట ముత్యం తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి రూరల్ : 15వ ప్రత్యేక పోలీసు పటాలము, బి.గంగారం, సత్తుపల్లి నందు చిట్యాల ఐలమ్మ 129వ జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పటాలపు కమాండెంట్ పిజెపిసి.చట్టర్జీ పాల్గొని చిట్యాల ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు, పరిపాలన అధికారులు, ఆర్ఎస్ఐలు, పటాలపు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కామేపల్లి : దొరల గడీలు బద్దలు కొట్టి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రత్యేక చరిత్ర కలిగిన చిట్యాల ఐలమ్మ తెలంగాణ మహిళల ఉద్యమస్ఫూర్తి అని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్, మాజీ జెడ్పిటిసి ప్రవీణ్ నాయక్ కొనియాడారు. పండితాపురం గ్రామంలో ఐలమ్మ జయంతి నిర్వహించిన ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బానోతు నరసింహ నాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎస్‌కె. పతే మహమ్మద్, ఎల్‌హెచ్‌పిఎస్ మండల అధ్యక్షులు భూక్య నాగేంద్రబాబు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాడిబండ్ల ప్రసాద్, శీలం పుల్లయ్య, అంగోత్ మోహన్, బానోతు చింటూ, బద్దల శేఖర్, చల్ల నాగేశ్వరరావు, చింతల వెంకయ్య, పగిడిపల్లి రాములు, అంబడిపూడి సత్యం, గుండ్ల చిరంజీవి రాయల నాగ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ-పాల్వంచ



పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పరిసర ప్రాంతాలను, డ్రైనేజీ నిర్మాణం పనులను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలోని అన్ని వార్డులు, ల్యాబ్, ఎక్స్రే రూమ్, ఫార్మసీ, ఆపరేషన్ థియేటర్స్‌ను తనిఖీ చేశారు. డాక్టర్స్ రూమ్స్‌కు వెళ్లి డాక్టర్స్‌తో రోగుల వివరాలు వారికి అందుతున్న వైద్యంపై డాక్టర్లతో చర్చించారు. ఆసుపత్రిలోని వైద్యం కోసం వచ్చిన చిన్నారులను వృద్ధులను, గర్భిణీలను ప్రతి ఒక్కరినీ ఆప్యాయతంగా పలకరిస్తూ వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలోని మందులకొరత లేకుండా చూడాలని డాక్టర్స్, హాస్పిటల్ సిబ్బంది ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆసుపత్రి లోపల, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు. నూతనంగా నిర్మిస్తున్న డయాలసిస్ సెంటర్ పనులను పరిశీలించిన కలెక్టర్ వీలైనంత త్వరలో డయాలసిస్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని సిబ్బందిని సూచించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలోని ప్రధాన సమస్యలను కలెక్టర్‌కి డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు వివరించగా త్వరితగతిన పనులను పూర్తి చేపిస్తానని కలెక్టర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రవిబాబు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ భాస్కర్ నాయక్, వివిధ శాఖల అధికారులు ఆసుపత్రి సూపర్డెంట్, ఆర్ఎంఓ, డాక్టర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

కాలువ తీసి వదిలేశారు...

- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

నవతెలంగాణ-దమ్మపేట



దమ్మపేట పరిధిలోని అర్బన్ కాలనీకి వెళ్ళే దారిలో అధికారులు తీసిన కాలువ ప్రమాదకరంగా మారింది. అర్బన్ కాలనీకి వెళ్ళే దారిలో నాలుగు నెలల క్రితం డ్రైనేజీ వాటర్ వెళ్ళడానికి కాలువ తీశారు. అయితే ఇది అర్బన్ కాలనీకి వెళ్ళే రహదారి పక్కన ఈ కాలువ ఉంటంతో కాలనీ వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అసలే చిన్న రోడ్డు అందులో తీసిన కాలువ వర్షం పడినప్పుడు మరింత ప్రమాదకరంగా మారుతుంది. దీంతో ప్రజలు పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో పంచాయతీ అధికారులకు విషయం తెలపడం జరిగిందని అర్బన్ కాలనీ వాసులు చెబుతున్నారు. అయితే వారు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఒకపక్క వర్షాలు పడుతుండగా చిన్న పిల్లలు కాలువలో పడే ప్రమాదం ఉందని కావునా సత్వరమే పంచాయతీ అధికారులు స్పందించి డ్రైనేజీ వాటర్ వెళ్ళడానికి తీసిన ఈ కాలువను పూడ్చి రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

చదువుతోపాటు సంస్కారం నేర్చుకోండి

నవతెలంగాణ-చర్ల





కళాశాలలో చదివే ప్రతి ఒక్క విద్యార్థి చదువుతోపాటు సంస్కారం నేర్చుకోవాలని పలువురు విద్యావేత్తలు హితవు పలికారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల చర్ల నందు మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ రెండవ సంవత్సరం విద్యార్థులు ఫ్రెషర్స్ డేని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి హెచ్ వెంకటేశ్వరరావు విచ్చేసి పిల్లలను ఉద్దేశించి మాట్లాడారు. క్రమశిక్షణతో మంచి నడవడికతో అధ్యాపకులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని చక్కగా చదువుకుని చర్ల కళాశాలకు, జిల్లాకి రాష్ట్రస్థాయిలో మంచి పేరు, గుర్తింపుని తీసుకురావాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ నరేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి దుమ్ముగూడెం కళాశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి, జిజెఎల్ఏ జిల్లా అధ్యక్షులు, మణుగూరు కళాశాల లెక్చరర్ ఖుర్షీద్ అహ్మద్, లైబ్రేరియన్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు గరుడాచలం , చర్ల కస్తూర్బా విద్యాలయం ఎస్ఓ, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

స్వర్ణ జ్యోతిని సన్మానించిన యూటీఎఫ్ నాయకులు

నవతెలంగాణ-మణుగూరు



నూతన విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన స్వర్ణ జ్యోతిని టీఎస్ యూటీఎఫ్ నాయకులు గురువారం సన్మానించారు. మండల ప్రధాన కార్యదర్శి షేక్ మీరా హుస్సేన్, ఉపాధ్యక్షులు తోట విజయలక్ష్మి ఆధ్వర్యంలో అధికారి కార్యాలయంలో పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందించారు. శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా జి.స్వర్ణ జ్యోతి ఉపాధ్యాయ హక్కుల కోసం పోరాడుతూనే, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయుటకు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు బి.ఐలయ్య, కుమారస్వామి, కృష్ణమూర్తి, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది భాగ్య, సీఆర్పీ నర్సు బాయ్, తదితరులు పాల్గొన్నారు.

రైతు పొలం బాట కార్యక్రమంలో విద్యుత్ శాఖ

నవతెలంగాణ-జూలూరుపాడు

మండలంలోని అనంతారం గ్రామంలో రైతు పొలం బాట కార్యక్రమంలో జిల్లా సుపెరిండెంట్ ఆఫ్ ఇంజనీర్ మహేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు వాడటం వలన నాణ్యమైన విద్యుత్‌ను పొందగలుగుతారని, మోటర్లు, ట్రాన్స్ఫార్మర్లు కాలిపోవని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈ రంగస్వామి, ఏడీ యాసిన్, ఏఈ సతీష్, సబ్ ఇంజనీర్ ప్రవీణ్, ఎస్ఎల్ఐ నరసింహారావు, లైన్మెన్ రమేష్, జేఎల్ఎం భాస్కర్, హెల్పర్‌లు వెంకటేశ్వర్లు, గోపాల్, రైతులు పాల్గొన్నారు.

కోతులు, కుక్కల బెడద నివారించండి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నబి

నవతెలంగాణ-ఇల్లందు

తిలక్ నగర్, విజయ లక్ష్మి నగర్ గ్రామ పంచాయతీల పరిధిలో కోతులు, కుక్కల బెడద నివారించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అబ్దుల్ నబీ అధికారులను డిమాండ్ చేశారు. వీటి మూలంగా ప్రజలు నిత్యం ఇబ్బందుల పాలవుతున్నారని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు 21 ఫీట్ శాఖా మహాసభ సందర్భంగా గురువారం లాల్ మొహమ్మద్ నగర్‌లో పతాకావిష్కరణ చేసి మహాసభలు ప్రారంభించారు. ఈ సందర్భంగా చిట్యాల ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ దిగ్గజం మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్యలకు నివాళులర్పించారు. ఈ మూడేళ్ల కాలంలో మండలంలో అమరులైన పార్టీ నేతలు గుగులోత్ ధర్మ, దేవులపల్లి యాకయ్య, కారం సంజీవయ్య, కూకట్ల శంకర్ల పేరుతో మహాసభను నిర్వహించమన్నారు. ఈ మహాసభలో ఆలేటి కిరణ్, కుమార్ మన్యం మోహన్ రావు, తాళ్లూరి కృష్ణ, మొలుగు శ్రీనివాస్, సుల్తానా, భాగ్యలక్ష్మి, గాజుల లీలా సంపత్, రాజు సత్యనారాయణ అఖిల తదితరులు పాల్గొన్నారు.

ఒకే పంచాయతీ ఒకే ఎన్నిక...?

భద్రాద్రికి మోగనున్న ఎన్నికల నగర

- పంచాయతీ ఎన్నికలకు సిద్ధమవుతున్న ఆశావాహులు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం గ్రామపంచాయతీ ఎన్నికల ఉత్కంఠకు తెరపడనుంది. ఒకే పంచాయతీగా ఉంచి ఎన్నికలు నిర్వహించాలని ఇప్పటికే పంచాయతీ అధికారులకు ఆదేశాలు వెలువడ్డాయని తెలుస్తుంది. ఈ నేపథ్యంలో అంతర్గతంగా అధికారులు సైతం ఓటర్ జాబితాను కూడా సిద్ధం చేస్తూ పంచాయతీ ఎన్నికలకు కావలసిన అంతర్గత కార్యక్రమాలను సైతం శరవేగంగా కొనసాగిస్తున్నారని తెలుస్తుంది. 2013లో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ 20 వార్డులకు ఎన్నికలు జరగగా 2018 పాలకమండలి పదవీకాలం ముగిసినప్పటికీ భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా చేయాలా లేక మూడు పంచాయతీలుగా విభజించి ఎన్నికలు నిర్వహించాలన్న దానిపైన కాలయాపన చేసిన గత ప్రభుత్వం స్థానిక ప్రజల అభిప్రాయ సేకరణ చేయకుండా మూడు పంచాయతీలుగా విభజిస్తూ అసెంబ్లీ తీర్మానం చేసిన విషయం కూడా తెలిసిందే. భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీని ఒకే పంచాయతీగా ఉంచి ఎన్నికలు నిర్వహించాలని అన్ని రాజకీయ పక్షాలతో పాటు వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమించిన ఫలితంగా భద్రాచలాన్ని ఒకే పంచాయతీగా ఉంచి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ చివర్లో గాని నవంబర్ మొదటివారంలో గాని రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న పంచాయతీ ఎన్నికలతో పాటు భద్రాచలానికి సైతం ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తులు ముమ్మరం చేశారు.

పాలకమండలి ఏర్పాటుతోనే అభివృద్ధి

భద్రాచలం గ్రామపంచాయతీకి 2013లో పంచాయతీ ఎన్నికలు జరగగా 20 మంది వార్డు సభ్యులతో పాలకమండలి ఏర్పడ్డ నాటి నుండి మేజర్ గ్రామ పంచాయతీ శరవేగంగా అభివృద్ధి చెందింది. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య జవాబుదారితనంగా పాలకమండలి సభ్యులు వ్యవహరించగా అన్ని వార్డుల పరిధిలో స్థానిక సమస్యల పరిష్కారంలో అప్పటి పాలకమండలి చిత్తశుద్ధితో వ్యవహరించిందని చెప్పాలి. 2018తో పాలకమండలి ముగియగా భద్రాచలంలో ఉన్న చట్టాల నేపథ్యంలో మున్సిపాలిటీగా అప్ గ్రేట్ చేసే అవకాశం లేకపోవడంతో అధికారుల చేతిలోనే ఆరు సంవత్సరాలుగా పాలన కొనసాగుతుంది. అక్టోబర్ నవంబర్ మాసాలలోనే రాష్ట్రవ్యాప్తంగా జరిగే పంచాయతీ ఎన్నికలతో పాటే భద్రాచలం గ్రామపంచాయతీ కూడా ఎన్నికలు జరిపేందుకు ప్రభుత్వం కసరత్తులు ముమ్మరం చేసిన నేపథ్యంలో అన్ని పార్టీలలో ఆశావాహుల సంఖ్యల సైతం అదే స్థాయిలో పెరుగుతుంది. గతంతో పోల్చుకుంటే ఈ దఫా ఎన్నికలు మరింత ఆసక్తికరంగా జరిగే అవకాశం ఉంది.

ఒకే పంచాయతీగా ఎన్నికలు జరిగితేనే అభివృద్ధి



2013 నుండి 2018 వరకు మేజర్ గ్రామ పంచాయతీ పాలకమండలి ఆధ్వర్యంలో అనేక రకాలుగా అభివృద్ధి చెందింది. పాలకవర్గ సభ్యులు ప్రజలకు అందుబాటులో ఉండి స్థానిక సమస్య పరిష్కారానికి కృషి చేశారు. గత ప్రభుత్వం అనాలోచితం నిర్ణయంతో మేజర్ గ్రామ పంచాయతీని మూడు పంచాయతీలుగా విభజించింది. గత ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అన్ని పక్షాలను కలుపుకొని ఒకే పంచాయతీగా ఉండాలని పలు దఫాలుగా ఉద్యమాలు సైతం నిర్వహించాము. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ ప్రభుత్వం భద్రాచలం విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరించి ఆంధ్రలో కలిసిన ఐదు పంచాయతీలను భద్రాచలంలో కలిపేందుకు కృషి చేశాలి.

- బండారు శరత్ బాబు, మాజీ వార్డ్ మెంబర్

జాతీయ రహదారి విస్తీర్ణం పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-టేకులపల్లి



మండల కేంద్రమైన టేకులపల్లిలోని బోడు ఎక్స్ రోడ్‌లో నేషనల్ హైవే పై జంక్షన్ ఆర్ అండ్ బీ వెడల్పు ప్రక్రియలో భాగంగా ఇండ్లు కోల్పోతున్న స్థానికులు చేసిన ఆవేదన నిమిత్తం ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య గురువారం పరిశీలించారు. పది కుటుంబాలకు చెందిన బాధితులకు సంబంధించిన స్థలాలతో పాటు ఇండ్లు కోల్పోతున్నామని తెలిపారు. నేషనల్ హైవేకి సంబంధించిన ఈఈ, డీఈ అధికారులను పిలిపించి, అక్కడ జరుగుతున్న నష్టాన్ని వివరించడం చేశారు. వరంగల్ నుండి భద్రాచలం వరకు నేషనల్ హైవే పనులు తొందర్లోనే కొనసాగిస్తామని సంబంధిత అధికారులు వివరించారు. ఎమ్మెల్యే సూచించిన సమాచారంపై అధికారులకు తెలుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డివిజన్ డీఎస్పీ, ఎస్ఐ పోగుల సురేష్, గ్రామపంచాయతీ కార్యదర్శి యు.దీప్తి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కోరం సురేందర్, ఇస్లావత్ రెడ్యానాయక్, బోడ మంగీలాల్ నాయక్, మూడ్ సంజయ్ నాయక్, గణేష్, పోషాలు, భద్రు నాయక్, గడ్డం మధు రెడ్డి, భూక్యా సర్దార్ నాయక్, రవి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లను వేధించిన వారిపై చర్యలు తీసుకుంటాం

- ఆందోళన విరమించండి
- జిల్లా వైద్యారోగ్య శాఖ అడ్మినిస్ట్రేటివ్ అధికారి బాలాజీ హామీ

నవతెలంగాణ-బూర్గంపాడు



బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లను వేధిస్తూ, నోటికి వచ్చినట్లు దూషిస్తున్న డాక్టర్, హెచ్ఈఓ, ఏఎన్ఎంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని ఆశా వర్కర్లందరూ విధులు బహిష్కరించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా చేపట్టారు. ఉదయం 10 గంటల నుంచి ధర్నా ప్రారంభమైంది. ధర్నా విషయం తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ బాలాజీ ధర్నా నిర్వహిస్తున్న ఆశా వర్కర్ల వద్దకు వచ్చారు. ధర్నాకి నాయకత్వం వహిస్తున్న సీఐటీయూ నాయకుల సమక్షంలో ఆశా వర్కర్లతోటి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ బాలాజీ చర్చలు జరిపారు. ఆశా వర్కర్లను వేధిస్తున్న డాక్టర్, హెచ్ఈఓ, ఏఎన్ఎం పై చర్యలు తీసుకునేంతవరకూ తాము వీధులకు హాజరు కాబోమని ఆశా వర్కర్లు స్పష్టం చేశారు. తాము ఎన్ని రోజులైనా విధులు బహిష్కరించి పోరాటాన్ని కొనసాగిస్తామని, మమ్మల్ని వేధించిన వారిపై చర్యలు తీసుకునే విషయంలో స్పష్టమైన హామీ ఇస్తే తప్ప ధర్నా విరమించేది లేదని ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులు తేల్చి చెప్పారు. దీంతో చర్చలకు హాజరైన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జిల్లా డీఎంఅండ్‌హెచ్ఓ భాస్కర్ నాయక్‌తో సంప్రదించి రెండో విడత చర్చలకు హాజరయ్యారు. రెండోసారి జరిగిన చర్చల్లో సోమవారం సాయంత్రం నాటికి ఆశా వర్కర్లను వేధింపులకు గురి చేసిన వారిపై చర్యలు తీసుకుంటా మని హామీ నిచ్చారు. వారిపై చర్యలు తీసుకోకపోతే మంగళ వారం నుంచి మరల విధులు బహిష్కరించి ఆందోళన బాట పడతామని ఆశ వర్కర్లు, వారి పోరాటానికి నాయకత్వం వహిస్తున్న సీఐటీయూ నాయకులు స్పష్టం చేశారు. అందుకు అంగీకరించిన అడ్మిని స్ట్రేటివ్ ఆఫీసర్ సోమవారం నాటికి సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను ఆశా వర్కర్లు విరమించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవి అప్పారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారిలు మాట్లాడుతూ ఆశా వర్కర్ల పట్ల వారి శ్రమ పట్ల చులకన భావంతో వ్యవహరిస్తున్నారని వారు పేర్కొన్నారు. వారి పద్ధతి మాను కోకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మోరంపల్లి బంజర పీహెచ్సీ నాయకురాలు బుచ్చమ్మ, తారాదేవి, కృష్ణవేణి శ్రీలత, విజయ, నాగేశ్వరి, నాగమణి, సంపత్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు ఎందుకు పెంచరు...?

- సీఐటీయూ ఎస్సీకేఎస్ సూటి ప్రశ్న

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణికి రూ.4800 కోట్లు నికర లాభాలు సాధించినప్పటికీ కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు ఎందుకు పెంచటం లేదో సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో సెంట్రల్ వర్కషాపులో జరిగిన సమావేశాలలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికుల ఆకలిబాదలు ప్రభుత్వానికి పట్టాదా అని సీఐటీయూ ప్రశ్నించింది. ఎన్నికలముందు కార్మికుల వేతనాలు పెంచుతామని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేలు పోటిచేసిన వారు చెప్పినమాటలు ఇచ్చిన హామీలు ఎన్నికల్లో గెలిచన తరువాత మర్చి పోయారా అని సీఐటీయూ ప్రశ్నించింది. కాంట్రాక్టు కార్మికుల శ్రమ లేకుండా ఉత్పత్తి జరిగిందా లాభాలు మాశ్రమ లేకుండా ఎక్కడనుండి వచ్చాయవో కార్మికులకు సమాధానం చెప్పాలన్నారు. 4800 కోట్లు లాభాలు వస్తే మెత్తం లాభాలమీద బోనస్ చెల్లించకుండా సగం లాభాలవీరీద బోనస్ ప్రకటించటం అన్యాయం కాదా? ఆబోనస్ కూడా కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5000 ప్రకటించటం న్యాయ సమ్మతంగా లేదని సీఐటీయూ పేర్కొన్నది. ప్రకటించిన 5000 ఇవ్వటానికి షరతు పెట్టడం మంచిది కాదని సీఐటీయూ ఎస్సీకేఎస్ తెలిపింది. ఎటువంటి షరతులు లేకుండా అన్నీ విభాగాల కాంట్రాక్టు కార్మికులకు రూ.5000 బోనస్ ఇవ్వాలన్నారు. ఓబీలో ప్రత్యక్షంగా ఉత్పత్తిలో భాగస్వాములైన కాంట్రాక్టు కార్మికులకు రూ.5000 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. బోనస్ ప్రకటన చేసేటప్పుడు మంత్రి పక్కన కూర్చోని చప్పట్లు కొట్టిన గుర్తింపు, ప్రాతినిధ్యసంఘాల నేతలు కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచాలని ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. జివో నెంబర్ 22 అమలుకు ఎందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వటం లేదో ఆర్థికమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జివో 22 అమలుచేసి వేతనాలు పెంచాలని లేదంటే కోల్ ఇండియా హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఎస్సీకెఎస్ డిమాండ్ చేసింది. వేతనాల పెరుగుదల కోసం సెప్టెంబర్ 30న హైద్రాబాద్ ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. హైద్రాబాద్ ధర్నా పోరుబాట కార్యక్రమంలో సీఐటీయూ ఎస్సీకెఎస్ బ్రాంచ్ కార్యదర్శి డి.వీరన్న, ఎస్సికెఎస్ సెంట్రల్ వర్క్ షాపు నాయకులు సంపత్, నాయకులు శ్రీనివాస్, నాగమణి, లక్ష్మినాగేంద్రబాబు, వెంకటేశివర్లు, కిరణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల ఆనందమే ఆశ్రమం లక్ష్యం

నవతెలంగాణ-అశ్వాపురం



వృద్ధుల ఆనందమే తమ ఆశ్రమం లక్ష్యమని ఆరిఫా రోస్ని వృద్ధుల ఆశ్రమ నిర్వాహకురాలు షైనాజ్ బేగం అన్నారు. వచ్చేనెల అక్టోబర్ ఒకటో తేదీన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా కలెక్టర్, జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాలనుసారం వృద్ధాశ్రమంలో వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం వయోవృద్ధుల చేత క్రీడాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెహరాజ్ దంపతులు పాల్గొని వృద్ధులతో ఆటపాటల కార్యక్రమాలను నిర్వహించారు.

భగత్ సింగ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వంశీ

నవతెలంగాణ-జూలూరుపాడు

భగత్ సింగ్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ జీవితం భారత దేశ యువతకు స్ఫూర్తిదాయకమని, అటువంటి మహనీయుని త్యాగాలను నేటి సమాజానికి తెలపాల్సిన బాధ్యత పాలకులదేనని వారు ఉద్ఘాటించారు. భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శివ, బాలాజీ, అనిల్ కుమార్, సాయి తేజ, రామ్ చరణ్ తేజ, మరియు హేమంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే డబ్బులు తక్షణమే ఇవ్వాలి

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-మణుగూరు

బీఎల్ఓలుగా డ్యూటీలు చేస్తున్నటువంటి ఆఫీసర్స్‌కి డ్యూటీ, సర్వే చేసినటువంటి వారికి వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకులు సత్రపల్లి సాంబశివరావు డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఎల్ఓలు ధర్నా నిర్వహించి, మాట్లాడారు. బీఎల్ఓ ఆఫీసర్‌తో సర్వేలు నిర్వహిస్తూ పనిచేయిస్తున్నారని అన్నారు. కానీ వారికి అవసరమైనటువంటి ట్యాబులు, సర్వే నిర్వహించినందుకు డబ్బులు, ఎలక్షన్ నిర్వహణలో ఇవ్వాల్సిన డబ్బులు కూడా నేటికీ అందలేదన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీఎల్ఓలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సింజెంట ఐకాన్ క్రిమి సంహారక మందు వల్ల ఎలాంటి ఇబ్బందులు కలగవు

డాక్టర్ దుర్గా భవాని

నవతెలంగాణ-పినపాక

దోమల నియంత్రణకు పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అన్ని గ్రామ పంచాయతీలలో ప్రత్యేక చర్యలు చేపట్టామని పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దుర్గ భవాని తెలిపారు. గురువారం పినపాక మండలం గోపాలరావుపేట గ్రామంలో దోమల మందు పిచికారి కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి, మాట్లాడారు. ఇంటి లోపల గోడలపై పిచికారీ చేసే దోమల మందు సింజెంట ఐకాన్ క్రిమి సంహారక మందు వల్ల ఆరోగ్య పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగవని, ఈ మందు ద్వారా ఇంట్లోకి దోమలు రాకుండా నివారించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, గ్రామపంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రాములు

నవతెలంగాణ-మణుగూరు



భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ విడుదల చేసే బూడిద వలన 15 ఎకరాల భూమిలో బూడిదతో పేరుకుపోయిందని, దీనివలన 10 మంది రైతులు జీవన ఉపాధి కోల్పోయారని, వెంటనే బీటీపీఎస్ బూడిద భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొడిశాల రాములు డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ(ఎం) సాంబాయిగూడెం శాఖా మహాసభ జరిగింది. మహాసభ ప్రారంభానికి ముందు సీనియర్ నాయకురాలు వాదం నరసమ్మ సాంబాయిగూడెం సెంటర్‌లో జెండా ఆవిష్కరించారు. అనంతరం కామ్రేడ్ కృష్ణకుమారి ప్రాంగణంలో (పసునూరు సంజీవరెడ్డి) ఇంటి వద్ద బట్టసత్యం అధ్యక్షతన జరిగిన మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. భద్రాద్రి పవర్ ప్లాంట్ కారణంగా పరిసర ప్రాంతాల గ్రామాలు కాలుష్యానికి గురవుతున్నాయన్నారు, డి సల్ఫర్ రేషన్ ప్లాంట్ నిర్మించిన తర్వాతే విద్యుత్ ఉత్పత్తి చేయాలని, కానీ దానికి విరుద్ధంగా ప్లాంట్ నిర్మించకుండా విద్యుత్ ఉత్పత్తి చేయడం వలన ఈ పరిసర ప్రాంతాలలో గాలిలో సల్ఫర్ శాతం ఎక్కువైందన్నారు. విషవాయువుల కారణంగా పరిసర ప్రజలు అంతుచిక్కని వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. భారీ వర్షాల కారణంగా పేరంటాల చెరువు అలుగు 6 మీటర్ల లోతులో కోత గురైందని, వెంటనే అలుగును నిర్మించి పగిడేరు, సాంబాయిగూడెం మధ్యలో రాకపోకలు కొనసాగించాలన్నారు. పేరంటాల చెరువు కట్టను అక్రమ గ్రావెల్ తవ్వకాల నిర్వహిస్తున్నారు. తవ్వకాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు డి లెనిన్ బాబు, సత్రపల్లి సాంబశివరావు, బొల్లంరాజు, టేకుల సత్యవతి, సంజీవరెడ్డి, సోమిరెడ్డి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యదర్శిగా టేకుల సత్యవతి



సాంబాయిగూడెం సీపీఐ(ఎం) గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా టేకుల సత్యవతిని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. భవిష్యత్తులో పార్టీ నిర్మాణానికి స్థానిక సంస్థల ఎన్నికలలో చురుకైన పాత్ర నిర్వహించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

గ్రామాన్ని దత్తత తీసుకొని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా : ఎమ్మెల్యే

నవతెలంగాణ-చంద్రుగొండ



తిప్పనపల్లి పంచాయతీలోని మహబూబ్‌నగర్ గ్రామంలో అశ్వరావుపేట శాసనసభ్యులు ఆదినారాయణ మీ ఇంటికి మీ ఎమ్మెల్యే భాగంలో గ్రామంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని శాఖల అధికారులతో రచ్చబండ కార్యక్రమంలో పలు సమస్యల గురించి గ్రామస్తులు చర్చించారు. కాలువ నిర్మించాలని గ్రామస్తులు కుమార్ కోరారు. తరచూ విద్యుత్ అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు చరవానిలో ఎత్తే పరిస్థితిలో లేరని అజిగర్ ఆరోపించారు. గ్రామానికి రాకపోకలు సరిగా లేవని, రహదారులు, పాఠశాల శిథిలావస్థ చేరిందని బాగు చేయాలని రంజాన్ కోరారు. వైద్య సేవలు సరిగా అందడం లేదని గ్రామాల్లో ఇళ్లకు నెంబర్లు ఇవ్వడం లేదని తమకు ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని బాదుషా కోరారు. గ్రామంలో మంచినీటి ఎద్దడి తీవ్రంగా ఉందని మిషన్ భగీరథ పథకం ద్వారా పైపులు వేశారని అవి తమకు ఉపయోగపడలేదని రేషన్ కార్డు లేదని గ్రామానికి చెందిన యువతి కరీంబి సమస్యను వివరించారు. గ్రామానికి చెందిన కబరస్తాన్‌కి రహదారి ఏర్పాటు చేయాలని, అంగన్వాడీ కేంద్రానికి భవనాన్ని మంజూరు చేయాలని కోరారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు ఆయా శాఖ అధికారులతో గ్రామస్తులు సమాధానం చెప్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ గ్రామస్తులు తెలిపిన విధంగా వాటి పరిష్కారానికి ప్రణాళిక తయారు చేయించి గ్రామానికి రంగాల అభివృద్ధి చేస్తానని నియోజకవర్గంలో ఐదు గ్రామాలను దత్తత తీసుకుంటానని తెలిపారు.

గీత కార్మికులకు 2వ విడత కాటమయ్య రక్షా కవచ్ శిక్షణ

- శిక్షణలో పాల్గొన్న దమ్మపేట గీత కార్మికులు

నవతెలంగాణ-దమ్మపేట



దమ్మపేట గీత కార్మిక సొసైటీకి చెందిన 26 మందికి ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ, జిల్లా బీసీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన కాటమయ్య రక్షా కవచ్ శిక్షణలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర కాటమయ్య రక్ష కవచ్ కోఆర్డినేటర్ ఆలూరి కోటయ్య, గుణగంటి కృష్ణ, ఆబ్బగాని కొటయ్య శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం అశ్వారావుపేట పట్టణంలో గల గోగులబంధంలో గల తాటి వనాలలో గీత కార్మికులకు శిక్షణ ఇచ్చారు. ఈక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారిణి విజయలక్ష్మీ, సీనియర్ అసిస్టెంట్ పాయం నాగరాజు, అట్టం లక్ష్మణరావు, ఎక్సైజ్ ఎస్ఐ కే.రాజేశ్వరరావులు మాట్లాడారు. ప్రభుత్వం గీత కార్మికులు చెట్లు ఎక్కి, దిగే క్రమంలో జరుగు ప్రమాదాల నివారణ కోసం కాటమయ్య రక్షా కవచ్ సేఫ్టీ మోకుని తయారు చేపించిందన్నారు.

ఇదిలా ఉండగా ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ రక్షణ కవచ్ మోకును స్వయంగా పరిశీలించారు. అనంతరం గీత కార్మికులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట గీత కార్మిక సొసైటీ ప్రెసిడెంట్ బంధం చెన్నారావు, సభ్యులు పానుగంటి రామారావు, పర్సా నాగయ్య, మట్టా సత్యనారాయణ, కొనకళ్ళ సత్యనారాయణ, యార్లగడ్డ ఆంజనేయులు, పానుగంటి లక్ష్మణ్ గౌడ్, కట్టా ప్రసాద్, యార్లగడ్డ కొండలరావు, యార్లగడ్డ ఏసుబాబు, గీత కార్మిక సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని వినతి

టేకులపల్లి : సింగరేణి సులబ్, నర్సరీ, ఓబీ, కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని డైరెక్టర్'పా' వెంకటేశ్వరరావుకు సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వెంకన్న మెమోరాండం ఇచ్చినట్టు ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ గురువారం తెలిపారు. 2023-24 వార్షిక లాభాలలో కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించి ఒక్కొక్కరికీ రూ.5వేలు చెల్లించాలానే నిర్ణయం ఆహ్వానించదగ్గ విషయం అయినప్పటికీ సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న అన్ని రకాల కాంట్రాక్ట్ కార్మికులతో పాటు సులబ్ కార్మికులు నిత్యం దుర్గంధం వేదజల్లే ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ జీవిస్తున్నారని తెలిపారు. అలాగే ఓబి కార్మికులు బొగ్గును వెలికితీయడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నరని, కార్మికులకు కూడా లాభాల్లో వాటా ఇవ్వాలని డైరెక్టర్ పాకు కార్మికుల కష్టాలను వివరించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

భద్రాచలం రూరల్ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని భద్రాచలం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రామకృష్ణ అన్నారు. భద్రాచలం స్వచ్ఛతా హీ సేవలో భాగంగా గురువారం ఐటీసీ వావ్ సంస్థ ఈశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భద్రాచలం ఏరియా ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రామానికి హాజరైన రామకృష్ణ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే తరాన్ని పుట్టబోయే పిల్లల్నీ ఆరోగ్యంగా రక్షించుకోవాలన్నా మనం పీల్చే శ్వాస స్వచ్ఛంగా రావాలన్నా ప్రతి పౌరుడు విధిగా మొక్కలు నాటి వృక్షంగా మారే వరకు బాధ్యత తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ వావ్ సంస్థ కో- ఆర్డినేటర్ రమ్య, ఫీల్డ్ కోఆర్డినేటర్లు సౌజన్య, రాజేశ్వరి, గ్రామ పంచాయతీ సూపర్వైజర్లు సంధ్య, జగదీష్, నిఖిలేష్, ఎం.మనోహర్, రమేష్ నాగేంద్ర, బీమపాక మనోహర్ సిఆర్పీలు, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జేఏసీ ఆధ్వర్యంలో బీటీపీఎస్‌లో నిరసన

మణుగూరు : రామగుండంలోని విద్యుత్ ఉత్పత్తి (1×800 ఎండబ్ల్యు) కేంద్రాన్ని తెలంగాణ జెన్కో నే నిర్మించాలని డిమాండ్ చేస్తూ టీజీపీఈ (తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్) జేఏసీ ఆధ్వర్యంలో మణుగూరులోని బీటీపీఎస్‌లో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి జేఏసీ నాయకులు ప్రసంగిస్తూ రామగుండంలో మూసివేసిన ఆర్టిఎస్ (రామగుండం థర్మల్ స్టేషన్) స్థానంలో సింగరేణి, జెన్కో సంయుక్త ఆధ్వర్యంలో విద్యుత్ కేంద్రాన్ని నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం చూడటం సరైన చర్య కాదని విమర్శించారు. ఈ చర్యను వ్యతిరేకిస్తూ జేఏసీ ఆధ్వర్యంలో దశల వారి ఆందోళనను చేపట్టినట్లు హెచ్చరించారు. ఆందోళన షెడ్యూల్‌ని వివరిస్తూ నేటి నుంచి ఆదివారం వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియచేస్తామని చెప్పారు. అనంతరం ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే మూడో తేదీ వరకు గేట్ మీటింగ్‌లు, చివరన 4, 5వ తేదీల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ బిటిపిఎస్ బ్రాంచ్ అధ్యక్షులు బి.రవి ప్రసాద్, రవితేజ, సాయి, కార్మిక సంఘ-327 రీజనల్ అధ్యక్షులు బి.కృష్ణ, కార్మిక సంఘం-1535 అధ్యక్షులు వి.ప్రసాద్, సీఐటీయూ నాయకులు వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో మోటివేషన్ (ఇంపాక్ట్) ప్రోగ్రాం

దుమ్ముగూడెం : మండల కేంద్రమైన దుమ్ముగూడెం గ్రామంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మోటివేషన్ (ఇంపాక్ట్) ప్రోగ్రాం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మోటివేషన్ ఇంటూరి భాస్కర రావు విద్యార్థులకు అద్భుత సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు వరరాజు మల్లికార్జున, రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లెల శ్రీనివాస్ రావు, ఇతర అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతులు లేని మందుల షాపులు నడపవద్దు

నవతెలంగాణ-చర్ల



ఎటువంటి అనుమతులు లేకుండా అల్లోపతి మందులను విక్రయించవద్దని ఖమ్మం జిల్లా ఔషద నియంత్రణ సహాయ సంచాలకులు జి.రాజ్యలక్ష్మి మందుల విక్రయదారులను హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని సత్యనారాయణపురం గ్రామంలో ఎటువంటి అనుమతులు, లైసెన్సు లేకుండా అల్లోపతి మందులు విక్రయిస్తున్న ఒక గ్రామీణ వైద్యుని వద్ద ఔషద నియంత్రణ శాఖ సుమారు రూ.20 వేల విలువైన 29 రకాల మందులను జప్తు చేసి, అట్టి మందులను భద్రాచలం కోర్టులో ప్రవేశ పెట్టారు. ఇట్టి తనిఖీ రాజ్యలక్ష్మి పర్యవేక్షణలో జిల్లా ఔషధ తనిఖీ అధికారి, సిహెచ్. సంపత్ కుమార్ నేతృత్వంలో జరిగింది. అనుమతులు లేకుండా మందుల విక్రయం నేరమని, లైసెన్సు లేకుండా ఎటువంటి మందులు విక్రయించరాదని, నిబంధనలు ఉల్లంఘించినచో డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం 1940 కింద క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని వారు తెలిపారు.

బాలికను గర్భవతిని చేసిన యువకుడు

- తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పి మైనర్‌ను లొంగదీసుకుని గర్భవతిని చేసిన ఘటనలో ఆళ్ళపల్లిలోని ఓ యువకుడిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయినట్లు స్థానిక ఎస్సై ఈ.రతీష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన యువకుడు ఇల్లందు సుభాష్ నగర్‌కు చెందిన బాలికతో ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో నిన్ను ప్రేమిస్తున్నాను అంటూ వెంటపడి మాయమాటలు చెప్పి, శారీరకంగా వాడుకొని గర్భవతిని చేశాడని, యువతి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్‌లో హత్యాచారం కేసు, ఫోక్స్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ప్రజా శ్రేయస్సే పోలీసుల ధ్యేయం : ఎస్సై

పినపాక : ప్రజల కోసమే పోలీసులు ఉన్నారని, ప్రజా శ్రేయస్సే పోలీసుల ధ్యేయం అని గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఎన్నో సౌకర్యాలు మెరుగు పడ్డాయని ఈ బయ్యారం ఎస్ఐ రాజ్ కుమార్ అన్నారు. మండలంలోని బోటుగూడెం గ్రామపంచాయతీ పరిధిలో గల చింతలపాడు వలస ఆదివాసి గ్రామాన్ని సిఆర్పిఎఫ్ సిబ్బందితో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. అత్యంత మారుమూల ప్రాంతాల్లో నివాసం ఉండే ఆదివాసీలతో కలిసి కష్టసుఖాలను తెలుసుకున్నారు. అసాంఘిక శక్తులకు సహకరించి కేసుల పాలు కావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ బాలాజీ నాయక్

నవతెలంగాణ-దుమ్ముగూడెం



సంక్షేమ వసతి గృహాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత పై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా చైల్డ్ హెల్త్, ఇమ్యునైజేషన్ ఆఫీసర్ బాలాజీ నాయక్ యాజమాన్యానికి సూచించారు. గురువారం అయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏకలవ్య బాయ్స్, గర్ల్స్ హాస్టల్‌ని జిల్లా సర్వైలెన్స్ ఆఫీసర్ సాయి కళ్యాణ్‌తో కలిసి సందర్శించారు. ముందుగా హాస్టల్లోని వంటగది పిల్లల డార్మెటరీస్, టాయిలెట్స్, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులతో మాట్లాడారు. పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అలాగే పరిశుభ్రమైన ఆహారం, నీరు మాత్రమే స్వీకరించాలని తెలిపారు. ఆరోగ్యపరమైన ఏ సమస్య వచ్చినా వెంటనే హాస్టల్లోని ఏఎన్ఎంకి తెలియజేసి దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పుల్లారెడ్డి, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ



రోడ్డు ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలు కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ఐడీఓసీలోని సమావేశ మందిరంలో రోడ్డు భద్రత పై జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం ఎస్పీ రోహిత్ రాజ్‌తో కలసి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో రోడ్డు ప్రమాదాల కారణంగా ఏ ఒక్కరూ వైకల్యం బారిన పడకుండా, ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు లేకుండా, రహదారి ప్రమాదాలు సంభవించకుండా రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే రోడ్డు ప్రమాదాల వివరాలు నమోదు చేయాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. రోడ్లపై కేజీ వీల్స్ తిరగకుండా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలు పూర్తిగా నివారించడానికి జాతీయ రహదారి పక్కల ఉన్న గ్రామాలలో పోలీసు కళా బృందాల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. ఫస్ట్ రెస్పాండర్‌గా ఉండేందుకు జాతీయ రహదారుల పక్కన ఉండే పెట్రోల్ బంకులు, దాబాలలో పనిచేసే వారికి, యువతకు, ప్రథమ చికిత్స, సీపీఆర్ పై అవగాహన కలిగించాలన్నారు. జిల్లా పరిధిలో ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లను గుర్తించడం జరిగిందని, ఆయా ప్రాంతాలలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దని సూచించారు. అటవీ ప్రాంతం ఉన్న ప్రాంతాల్లో నెమ్మదిగా వెళ్లేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. ఓవర్ లోడింగ్ వాహనాలపై తగు చర్యలు తీసుకోవాలని రవాణా శాఖాధికారి సదానందంకు సూచించారు.

ఈ సమీక్ష సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, ఆర్‌ఎంబి ఈఈ వెంకటేశ్వరరావు, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, జిల్లా వైద్యశాఖ అధికారి భాస్కర్ నాయక్, డీసీహెచ్ఓ రవిబాబు, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, ఇల్లందు మున్సిపల్ కమిషనర్లు, కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు గోపాలమిత్రలు వినతి

నవతెలంగాణ-చంద్రుగొండ



మండలంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గురువారం పర్యటించారు. జిల్లా గోపాలమిత్ర కమిటీ ఆధ్వర్యంలో వారి సమస్యలపై వినతి పత్రం అందజేసినట్టు గోపాలమిత్రులు తెలిపారు. ఈ సందర్భంగా గోపాలమిత్ర కమిటీ బాధ్యతలు మాట్లాడుతూ గోపాల మిత్రులకు కనీస వేతనం రూ.24వేలు చెల్లించాలని, పశుసంవర్ధక శాఖలో విలీనం చేయాలని అన్నారు. గోపాలమిత్ర కమిటీ గత 24 సంవత్సరాల నుంచి పశుసంవర్ధక శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా 1530 మంది పనిచేస్తున్నారని, ఎల్లవేళలా రైతులు అందుబాటులో ఉంటున్నారని సరైన సమయంలో కృత్రిమ గర్భాదారణతో పాటు ప్రాథమిక చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటున్నామని పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకుల శ్రీనివాస్, ప్రసాద్, సురేష్, రాము, సత్యనారాయణ, మధు, రవి, తాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందులో తొలిసారి ఈఎన్టీ సర్జరీ సేవలు

- ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీ
- ఆపరేషన్ నిర్వహించిన డిసిహెచ్ఎస్

డా. రవిబాబు : పలువురి అభినందనలు

నవతెలంగాణ-ఇల్లందు



ఆధునికమైన వైద్య సేవలు అందుబాటులో లేని ఏజెన్సీ ఏరియా నియోజకవర్గమైన ఇల్లందు ప్రభుత్వాసుపత్రిలో తొలిసారి ఈఎన్టీ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో మొట్టమొదటిసారిగా ఇల్లందు ఏరియా హాస్పిటల్ నందు అత్యాధునిక పరికరాలతో ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీ చేయడం గమనార్హం. గత 12 సంవత్సరాలుగా ముక్కు దిబ్బడ, శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతూ తరచూ తలనొప్పితో బాధపడుతన్న ఇల్లందు మున్సిపాలిటీ స్టేషన్ బస్తికి చెందిన అబ్దుల్ కలీం అనే పేషెంట్‌కు డీసీహెచ్ఎస్, ప్రముఖ ఈఎన్టి వైద్యులు డాక్టర్ రవిబాబు, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ రవి తేజస్విని ఆధ్వర్యంలో ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీ నిర్వహించారు. ప్రస్తుతం పేషెంట్ పరిస్థితి ఆపరేషన్ తర్వాత నిలకడగా ఉంది. డీసీహెచ్ ఎస్ రవిబాబును, ఇతర వైద్య బృందాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య, రాష్ట్ర టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, కలెక్టర్ జితేష్ పాటిల్, ఏరియా హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.హర్షవర్ధన్ అభినందించారు.

డిమాండ్ ఉన్న బొమ్మలనే తయారు చేయండి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-ములకలపల్లి



మార్కెట్లో డిమాండ్ ఉన్న బొమ్మలు తయారు చేయాలని కలెక్టర్ జితేస్ వి.పాటిల్ సూచించారు. గురువారం మండలంలోని మాదారం గ్రామంలో ఏర్పాటు చేసిన నాయక పోడు ట్రైబల్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ సెంటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వం అందించే సహకారంతో ఆర్థికంగా బలపడాలని అన్నారు. పోనికి రకం చెట్ల కట్టెతో తయారు చేసే చెక్క బొమ్మలు ఎంతో ఆకర్షణయంగా ఉంటాయని, దీనికై పోనిక మొక్కల పెంపకానికి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పెంచేందుకు ప్రణాళిక తయారు చేయాల్సిందిగా ఇన్‌చార్జ్ ఎంపీడీవో మహాలక్ష్మిని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం సభ్యులు తయారు చేసిన చెక్క బొమ్మలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు గిరిజన మహిళలు తాము సాగు చేసుకుంటున్న పోడు భూమికి పట్టాలు ఇప్పించాలని కలెక్టర్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రూప్ సభ్యులు పశువుల బుచ్చయ్య, అధ్యక్షులు అంజన్ కుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వారు తయారు చేసిన బొమ్మను బహుమతిగా అందజేశారు. నాయకపోడు జాతి పుట్టుక, జీవన విధానం పుస్తకాన్ని వారు కలెక్టర్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లారావు, ఎంపీఓ లక్ష్మయ్య, ఏపీఎం రాంబాబు, ఐటీడీఏ అధికారులు, మండల అధికారులు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశస్త యాప్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ

నవతెలంగాణ-అశ్వారావుపేట



ప్రశస్త యాప్ పై ఉపాధ్యాయులకు పూర్తిస్థాయి శిక్షణ, అవగాహనను కల్పించినట్టు ఎంఈఓ పి.ప్రసాదరావు తెలిపారు. నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ పాఠశాలలో ఉపాధ్యాయులకు రెండు రోజులపాటు నిర్వహించనున్న వికలాంగ విద్యార్థులకు సంబంధించిన యాప్ పై శిక్షణను గురువారం ఆయన ప్రారంభించారు. ముందుగా ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నూతనంగా ఎంఈఓ బాధ్యతలు స్వీకరించనున్న క్రమంలో పలు ఉపాధ్యాయులు ప్రసాద్ రావునును పూల బొకేలు అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు హరిత, టి.వీరేశ్వరరావు, వెంకయ్య ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు ప్రభాకరాచార్యులు, రామారావు, సోమరాజు, జ్యోతి, మల్లేశ్వరరావు నాయక్, బి.హనుమంతు నాయక్, రాజు, సీసీఓ మహబూబ్, ఎంఐఎస్ మాడి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట : ప్రశస్థ యాప్ నిర్వహణపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమంను ఏర్పాటు చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఈ శిక్షణ కార్యక్రమంను మండల విద్యాశాఖ అధికారి కీసరి లక్ష్మి అధ్యక్షతన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు నాగలక్ష్మి, కనకదుర్గ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించి ప్రత్యేక అవసరాల విద్యార్థులకు కావలసిన వివిధ అంశాలపై ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల ఎంఐఎస్ కోఆర్డినేటర్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు : జూలూరుపాడు హై స్కూల్లో వికలాంగ పిల్లలను పాఠశాల వారిగా గుర్తించి ప్రతి పిల్లవాణ్ణి ఈ ప్రశస్థ యాప్ నందు యాడ్ చేసి వారిని స్క్రీనింగ్ చేయడం జరుగుతుందని, ఈ స్క్రీనింగ్ ద్వారా గుర్తించిన ప్రత్యేక అవసరాలు గల ప్రతి పిల్ల వానికి వారికి ప్రభుత్వం నుంచి అందవలసిన ప్రతి సౌకర్యాన్ని కల్పించాలని మండల రిసోర్స్ పర్సన్స్ ఆర్ సాంబశివరావు, జె.శ్రీనివాస్ అన్నారు. అదేవిధంగా ఈ ప్రశస్త యాప్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌కు జిల్లా విద్యాశాఖ నుంచి ఏఈ అండ్ సిఎమ్మో సైదులు, సతీష్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్ఓ సంజీవరావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, పాపకొల్లు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మీరా సాహెబ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన ప్రయివేటు సెక్యూరిటీ గార్డులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

నవతెలంగాణ-ఇల్లందు



సోలారీస్ కంపనీ సోలార్ ప్లాంట్‌లో తొలగించిన ప్రయివేటు సెక్యూరిటీ గార్డులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఎస్ఓటు జీఎం బొల్లం వెంకటేశ్వర్లకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు అబ్దుల్ నబీ మాట్లాడారు. దొంగతనాలు బాగా జరుగుతున్నాయని గత జనవరిలో 35 మంది ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను పనిలోకి తీసుకున్నారని అన్నారు. 8 నెలలు పనిచేసిన తర్వాత ఈ నెల మూడో తారీఖున ఒక్క వాట్సాప్ మెసేజ్‌తో 35 మంది సెక్యూరిటీ గార్డులను విధుల నుండి తొలగిస్తున్నట్లు, మీరు విధులకు రావొద్దని యాజమాన్యం ప్రకటన చేశారని అన్నారు. సోలార్ ప్లాంట్ వద్ద, సింగరేణి జీఎం ఆఫీస్ వద్ద ధర్నాలు చేసి అధికారులకు వినతి పత్రాలు సమర్పించినప్పటికిని సమస్య పరిష్కారం కాలేదన్నారు. పనిచేసిన చివరి నెల ఇవ్వాల్సిన జీతం కూడా సోలారీస్ కంపెనీ ఎగ్గొట్టిందని వాపోయారు. సమస్య పరిష్కారం కాకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని తాళ్లూరి కృష్ణలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సోలార్ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు కిరణ్ సతీష్, గాంధీ, కుమార్, వెంకటేష్, మనోజ్, చెన్నై, ప్రసాద్, సంపత్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

- ట్రాఫిక్ ఎస్ఐ మధు ప్రసాద్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సన్మార్గంలో నడవడం ద్వారా భవిష్యత్తు బంగారు మయంగా మారుతుందని ట్రాఫిక్ ఎస్ఐ మధు ప్రసాద్ అన్నారు. గురువారం అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ భద్రాచలం కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ నిర్మూలన, ట్రాఫిక్ రూల్స్ పై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్కు హాజరైన ఆయన మాట్లాడారు. విద్యార్థులు, యువత డ్రగ్స్ వాడకూడదని, అదేవిధంగా డ్రగ్స్ సప్లై చేయకూడదని చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన శిక్షలు పడతాయని తెలిపారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. అనంతరం ఏఎస్ఎఫ్ భద్రాచలం పట్టణ మహాసభ జరిగింది. ఈ మహాసభకు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉపేందర్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు సాధన పల్లి సతీష్, మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు అశోక్ కుమార్, కంభం మెట్టు శ్రీనివాస్, కవితకు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన ధీరవనిత ఐలమ్మ

- ఐలమ్మ చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళి

నవతెలంగాణ-టేకులపల్లి



భూమి కోసం భుక్తి కోసం బానిస విముక్తి కోసం పోరాడిన ధీరవనిత ఐలమ్మ అని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఐలమ్మ జయంతి సందర్భంగా చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించి, మాట్లాడారు. ఈ సందర్భంగా విచ్చేసిన ఎమ్మెల్యేకు కళాశాల ప్రిన్సిపాల్ బి.సులోచన రాణి పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు. కళాశాలలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా ప్రతిస్పందించి ఎమ్మెల్యే సమస్యల పరిష్కారం సత్వరం మే జరగాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బసవమ్మ, సత్యవతి, ముంతాజ్ అలీ, శంకర్రావు, వేణుగోపాల్, శ్రీనివాస్ రావు, బాబురావు, యాకూబ్, వరలక్ష్మి ప్రమోద్ కుమార్, నాగేశ్వరరావు, ఆఫీస్ స్టాఫ్ రమేష్, రవి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు : తెలంగాణ ప్రజల తెగువను ప్రపంచానికి చాటి చెప్పి, మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన ధీరవనిత చిట్యాల ఐలమ్మ అని మున్సిపల్ చైర్మెన్ దమ్మలపాటి వెంకటేశ్వర రావు అన్నారు. ఐలమ్మ జయంతి వేడుకలు గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపాలిటీ డీఈ మురళి, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో...

పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామలింగేశ్వర రావు మాట్లాడారు. పుష్పాలతో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తోర్తి జాన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మరో ప్రోగ్రాం ఆఫీసర్ విలియం ప్రసాద్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వినోబా నగర్ గ్రామంలో చాకలి ఐలమ్మ జయంతి

జూలూరుపాడు : ఐలమ్మ జయంతి సందర్భంగా వినోబా నగర్ గ్రామంలో సాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె జయంతి సందర్భంగా ఆ మహనీయురాలిని స్మరించుకోవటం గొప్ప అవకాశం అని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తంబారపు శ్రీను, సిరికొండ పెద్ద నరసింహారావు, రమేష్, సుభాకర్, వేణు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రజక కుల పెద్దలను సన్మానించిన పార్టీ శ్రేణులు

అశ్వాపురం : మండలంలోని మొండికుంట గ్రామంలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీటీసీ కమటం నరేష్ అధ్యక్షతన చిట్యాల ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి రజక సంఘ నాయకుడు చెన్నూరి అంతయ్య, నెల్లిపాక సొసైటీ చైర్మెన్ తుక్కాని మధుసూధన్ రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమటం నరేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రజక సంఘం పెద్దలు, మహిళలు, యువజన నాయకులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం జ్వలించిన నిప్పుకణిక ఐలమ్మ అని తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్ అన్నారు. గురువారం ఐలమ్మ జయంతిని తహసీల్దార్ కార్యాలయంలోని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించగా కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి ఐలమ్మ చిత్రపటానికి పూలపమాల వేసి నివాళులు అర్పించారు. ఆర్ఐ కల్లూరి వెంకటేశ్వరరావు, కళాశాల అధ్యాపకులు వై.మల్లికార్జున్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాసరావు, అధ్యాపక అధ్యాపకేతర, రెవెన్యూ కార్యాలయం సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

నాలుగేండ్ల తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

- లాభాల బోనస్‌కు లీగల్ అథారిటీ లేదు
- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.రాజకుమార్

నవతెలంగాణ-మణుగూరు



నాలుగు సంవత్సరాలు తర్వాతే సింగరేణి ఎన్నికల నిర్వహించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజకుమార్ అన్నారు. ఓసి-2, కార్మికుల పని ప్రదేశాలలో పిట్ మీటింగులు నిర్వహించిన అనంతరం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏడవ దశ సింగరేణి ఎన్నికలు నిర్వహించిన అనంతరం 9 నెలల తర్వాత రికగ్నైజేషన్ సర్టిఫికెట్ లేబర్ అధికారులు అందించిందన్నారు. సింగరేణిలో ఎన్నికల జోక్యం ఎక్కువ అయిందన్నారు. కార్మిక సంఘాలతో పని లేకుండా ఎమ్మెల్యేలే పైరవీలు చేస్తూ ఉన్నారని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కూడా లాభాల బోనస్ వచ్చిదంటే అది ఏఐటీయూసీ పోరాట ఫలితాలు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా సెక్రటరీ వై.రాంగోపాల్, ఉపాధ్యక్షులు రామ నర్సయ్య, సహాయ కార్యదర్శి మేకల ఈశ్వర్, పుల్లారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ సురేందర్, కుమారస్వామి, రవికుమార్, సందీప్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తూరుబాక కల్వర్టును పరిశీలించిన అధికారులు

- ప్రత్యామ్నాయంగా డైవర్షన్ రహదారి ఏర్పాటు

నవతెలంగాణ -దుమ్ముగూడెం

మండలంలోని భద్రాచలం చర్ల ప్రధాన రహదారి తూరుబాక గ్రామ సమీపంలో కల్వర్టు కుంగి రాకపోకలకు ప్రమాదంగా మారడంతో విషయం తెలుసుకున్న అధికారులు గురువారం ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా ఉండేందుకు భారీ కేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యామ్నాయ మార్గాలను వాహనదారులకు సూచించారు. దీంతోపాటు వాహనాలను రాకపోకలు సాగించేందుకుగాను ప్రత్యామ్నాయంగా డైవర్షన్ రహదారి మార్గం ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతోపాటు కల్వర్టు నిర్మాణం కోసం సుమారు రెండు కోట్ల 65 లక్షలు ఎస్టిమేట్లు పంపినట్లు ఆర్అండ్‌బి డీఈ హరిలాల్ నవతెలంగాణకు తెలిపారు. కుంగిన కల్వర్టును పరిశీలించిన వారిలో తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్, సీఐ బొడ్డు అశోక్, ఎస్సై గణేష్ లతోపాటు రెవెన్యూ పోలీస్ సిబ్బంది ఉన్నారు.



దొండేటి నిర్మల్‌రావుకు తమ్మినేని పరామర్శ

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

అనారోగ్యంతో ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు దొండేటి నిర్మల్‌రావును పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. నిర్మల్‌రావు ఆరోగ్య క్షేమాలను తెలుసుకొని మనోధైర్యంగా ఉండాలని తెలిపారు. తమ్మినేని వీరభద్రం వెంట సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్, జిల్లా కమిటీ సభ్యులు కొమ్ము శ్రీను, దాసరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు

అక్టోబర్ 4, 5, 6 తేదీల్లో ఉపాధ్యాయులకు శిక్షణా

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

ఉపాధ్యాయులకు ఉచిత శిక్షణ తరగతులు స్టూడెంట్స్, టీచర్స్, ఎడ్యుకేటర్స్ పేరెంట్స్ (ఎస్‌టీఈపీ) వారి సారథ్యంలో ఉచితంగా ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు అక్టోబర్ 4 ,5, 6 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు (డబ్ల్యుఈఓ) ప్రపంచ పర్యావరణ సంస్థ తెలంగాణ స్టేట్ గ్రీన్ రేంజర్ షేక్ మహమూద్ పాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా సెలవులు సందర్భంగా ఉపాధ్యాయులు వ్యక్తిత్వ వికాస మార్గదర్శకులుగా కావడానికి ఈ శిక్షణ తరగతులు దోహదపడతని తెలిపారు. గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామం శ్రీ రమణారావు -సావిత్రమ్మ ధ్యాన ఆరోగ్య ఆశ్రమంలో ఉపాధ్యాయులు కుటుంబ సమేతంగా ఈ తరగతులకు హాజరు కావచ్చుని పేర్కొన్నారు. ఈ తరగతుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు ఉచిత భోజన వసతితో పాటు పార్టిసిపేషన్ ధృవీకరణ పత్రం అందజేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు సెల్ నెంబర్ 903064440, ధర్మారెడ్డి సెల్ నెంబర్ 8143234555లను సంప్రదించాలని సూచించారు.

మత్స్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో గురువారం గోదావరి వరద ముంపు ప్రభావిత ప్రాంతాల్లో రక్షణ కొరకు తెప్పపై అవగాహన సదస్సు నిర్వహించారు. గంగోలు చెరువు వద్ద ఏర్పాటు చేసిన సదస్సులో వరదలు వచ్చిన సమయంలో ఎవరైనా నీట మునిగిన సమయంలో వారిని తెప్ప పై వెళ్లి ఎలా రక్షించాలో అనే దానిపై అవగాహన కల్పించారు. చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండలాల నుండి వచ్చిన మత్స్యకారులు వారి సమస్యలను, మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తున్న పరికరాల గురించి మత్స్య శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్, ఎంపీడీవో ఈదయ్య, ఎంపీ ఓ రామకృష్ణ, ఆర్ఐ కల్లూరు వెంకటేశ్వరరావు, ఎంబడి అర్జున్ రావు, మత్స్యకార్లు పాల్గొన్నారు.

యువజన ఉత్సవాలలో అనుబోస్ విద్యార్థులు ప్రతిభ

నవతెలంగాణ-పాల్వంచ

2024 జిల్లా స్థాయి యువజన ఉత్సవాల్లో పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. యువకృతి వ్యాసరచన పెయింటింగ్ డాన్సులలో పాల్గొని అత్యంత ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను అనుభవ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ టి బాలకృష్ణ అభినందించారు. జిల్లా స్థాయి పోటీలలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో కూడా పాల్గొని గెలుపొందాలని సూచించారు. ఆటపాటలతో పాటు చదువులో కూడా ఇదేవిధంగా రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ టీ. ఆవని, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రవికుమార్, డాక్టర్ ఎస్వి. సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ వి.వెంకన్న వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్ మేళా

నవతెలంగాణ-ఖమ్మం

వివిధ కంపెనీలలో ఖాళీగా ఉన్న 850 ఉద్యోగాల భర్తీకి గాను శనివారం ఉదయం 10 గంటల నుండి స్థానిక ఎస్ఆర్అండ్‌బిజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి ఎస్.మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 18 నుండి 40 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతీ, యువకులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇంటర్వ్యూ కోసం సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో వచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9063858341లో సంప్రదించాలని పేర్కొన్నారు.

మండల విద్యాశాఖ అధికారికి అభినందనలు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండల ఇన్చార్జి విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన బి మురళీమోహన్‌రావుని టిఎస్ యుటిఎఫ్ మండల కమిటీ అభినందనలు తెలిపారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం వనరుల కేంద్రంలో కలిసి వారిని అభినందించారు. మండల ప్రధాన కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలాగా ప్రయత్నించాలని విద్యార్థులకు నాణ్యమైన విద్యను మధ్యాహ్న భోజనం అందేలాగా కృషి చేయాలన్నారు. బాధ్యతలు చేపట్టిన బి.మురళిమోహన్‌రావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులతో ఉపాధ్యాయ సంఘాలతో కలిసి తన వంతు మండల విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ ఎర్రుపాలెం మండల అధ్యక్షులు బండారు నాగరాజు, ఉపాధ్యక్షులు కంచర్ల శ్రీనివాసరావు, కోశాధికారి లంకా నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు నీలం అజయ్ కుమార్, సుబ్బరామ రాజు, ఎం.నాగేశ్వరరావు, ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

భూ తగాదాపై కేసు నమోదు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

భూ తగాదా విషయంలో జరిగిన ఘర్షణపై ఖమ్మంరూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగూడెం గ్రామానికి చెందిన వీరెల్లి సత్యనారాయణ వ్యవసాయ భూమిలోకి అదే గ్రామానికి చెందిన వీరెల్లి అప్పారావు బుధవారం అక్రమంగా ప్రవేశించి భూమిని దున్నాడు. ఈ సంఘటనపై సత్యనారాయణ ఫిర్యాదు మేరకు అప్పారావుపై కేసు నమోదు చేసినట్లు ఇన్స్పెక్టర్ రాజు తెలిపారు.

వైద్య , ఆరోగ్య శాఖలో ఫేస్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు విధానాన్ని వ్యతిరేకించాలి

నవతెలంగాణ-ఖమ్మం

వైద్య ఆరోగ్య శాఖలో ప్రవేశపెట్టిన ఫేస్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు విధానాన్ని వ్యతిరేకిస్తూ గురువారం ఖమ్మంలోని హెచ్‌వన్ (ఐఎన్‌టియుసి), (సిఐటియు) యూనియన్లు ఉమ్మడి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో హెచ్1 యూనియన్ జిల్లా అధ్యక్షులు వి.కృష్ణారావు, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు (సిఐటియు), జె.కొండల్ రావు, బి.వేణుగోపాల్ మాట్లాడుతూ సాంకేతికతతో కూడిన ఈ హాజరు విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తూ పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సందీప్, నిర్మల జ్యోతి, జ్యోతి రత్న, కృష్ణవేణి, జానకి, శివ, మహేష్, నవనీత, జయమ్మ సభ్యులు గీత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో విభాగంలో బ్లూమింగ్ మైండ్స్ విద్యార్థుల ప్రభంజనం

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని బ్లూమింగ్ మైండ్స్ పాఠశాల అండ్ జూనియర్ కళాశాల విద్యార్థులు సిబిఎస్ఈ క్లస్టర్-7 ఖో,ఖో టోర్నమెంట్‌లో ప్రభంజనం సృష్టించారు. హైదరాబాద్‌లోని బాచుపల్లెలో విఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి రెసిడెన్షియల్ పాఠశాల వేదికగా ఈనెల 22 నుండి 25వ తేదీ వరకు జరిగిన సిబిఎస్ఈ క్లస్టర్-7 అండర్ 17 ఖోఖో బాలుర విభాగంలో బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్ జూనియర్ కళాశాల, ఖమ్మంకు చెందిన విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శనలో మిగిలిన జట్లకు గట్టి పోటీనిచ్చి, క్లస్టర్-7లో 3వ స్థానంలో రజత పతకాలను గెలుపొందడం జరిగిందని తెలిపారు. గురువారం పాఠశాలలో అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ఖో-ఖో పోటీలో రజత పతకాలను సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ పి.అశోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వి.కిరణ్ కుమార్, వైస్ ప్రసాద్ , వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

కమ్యూనిస్టులే పేద ప్రజలకు రక్షణ వలయం

- సీపీఐ(ఎం) జిల్లా నాయకులు పుల్లయ్య

నవతెలంగాణ-అశ్వారావుపేట



ప్రపంచంలో కార్మికులకు, కష్ట జీవులకు కమ్యూనిస్టు పార్టీలే రక్షణ కవచాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని మొద్దులు గూడెంలో గ్రామ శాఖల మహా సభలను మండల కమిటీ సభ్యులు నారం అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ పార్టీ ప్రతీ సభ్యుడు ప్రజలతో మమేకం అయితేనే స్థానికంగా పార్టీ బలపడుతుందని అన్నారు. ఈ మహాసభల్లో జిల్లా కమిటీ సభ్యులు పిట్టల అర్జున్ ప్రస్తుత రాజకీయాలు - పార్టీలు విధానాలు పై రాజకీయ రిపోర్ట్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముందుగా సీనియర్ నాయకులు నారం చిన వెంకటేశ్వరరావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మడిపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బయోమైనింగ్ ద్వారా చెత్త నియంత్రణ

- జిల్లా కలెక్టర్ జితేష్ వీ. పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ



బయో మైనింగ్ ద్వారా చెత్త నియంత్రణ చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వీ.పాటిల్ అన్నారు. గురువారం మున్సిపాలిటీల్లో డంపింగ్ యార్డ్లు ప్రక్షాళన కోసం బయో మైనింగ్ విధానంపై ఐడిఓసి కార్యాలయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ జితేష్ వీ. పాటిల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలోని డంపింగ్ యార్డ్లలో బయో మైనింగ్ విధానంలో చెత్త ను శుద్ధి చేసేందుకు వీలుగా అన్ని పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ బయో మైనింగ్ విధానం ద్వారా డంపింగ్ యార్డ్ లో భారీగా పేరుకుపోయిన చెత్తను మిషన్ల ద్వారా శుద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. వివిధ పరిమాణంలో ఉన్న వ్యర్థాలు అంటే ప్లాస్టిక్ బాటిళ్లు, కొబ్బరి బోండాలు, రాళ్లు, బట్టలు వంటివి, ప్లాస్టిక్ మెటీరియల్‌లోను రీసైక్లింగ్ చేయగలిగినవి, రీసైక్లింగ్ చెయ్యలేనివి వివిధ దశలలో బయటకు వస్తాయన్నారు. గ్లాస్‌ను కూడా ఫెర్నెస్‌లో వేసి రీసైకిల్ చేసి, అన్ని వేరు వేరు చేయగా వచ్చిన మెటీరియల్‌ను వర్మీ కంపోస్ట్‌గా మార్చగలిగే మ్యాన్యుర్‌ను పార్కుల్లో మొక్కలకు, డివైడర్‌లో మొక్కలకు ఎరువుగా ఉపయోగపడుతుందని, మిగిలిన రాళ్లను లో లెవెల్ ఏరియాను కప్పి పెట్టడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. అదేవిధంగా ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిలింగ్ చేసే కంపెనీలకు అమ్మడం ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం చేకూరుతుందని తెలిపారు. జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలలో బయోమైనింగ్ ప్లాంటును ప్రారంభించడానికి తగిన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చెత్తశుద్ధి అనంతరం డంపింగ్ యార్డ్‌లోని కాళీ ప్రదేశాలలో సుబాబులు, జామాయిల్ సాగు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో ఆదాయ వనరులుగా బాంబో మొక్కలు మరియు బాదం మొక్కలు సాగు చేయడం ద్వారా ఆదాయం సమకూరుతుందని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, ఆర్డీవోలు దామోదర్ రావు, మధు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబురావు, జిల్లా కాలుష్య నివారణ అధికారి రవీందర్, నాలుగు మున్సిపాలిటీల కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తులతో స్వయం సాధికారత

- అసంఘటిత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

నవతెలంగాణ-అశ్వారావుపేట



సాంప్రదాయ, చేతివృత్తులతో ఆయా సామాజిక వర్గాలలో స్వయం సాధికారత చేకూరుతుందని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. కల్లు గీత కార్మికుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన కాటమయ్య రక్షాకవచ్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా అబ్కారీ శాఖ అశ్వారావుపేట సర్కిల్ పరిధిలోని అశ్వారావుపేట, దమ్మపేట మండలాల గీత కార్మికుల భద్రత కోసం అబ్కారీశాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖలు సంయుక్త ఆధ్వర్యంలో భద్రతా అవగాహణ శిబిరం నిర్వహించారు. నియోజక వర్గం కేంద్రంలోని గోగులమంద తాటి వనంలో గీత కార్మికులకు భద్రతా కిట్ ఎలా ఉపయోగించాలో గీత కార్మికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొని మాట్లాడారు. గీత కార్మికులు సంప్రదాయంగా వాడుతున్న మోకులు వలన అనేక ప్రమాదాలకు గురి అయి, అంగ వైకల్యం పాలవుతున్నారని, కొన్ని సందర్భాలలో ప్రాణాలు కూడా కోల్పోతున్నారని, అందువలన ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమం కోసం భద్రత పరికరాలను రూపొందించింది అన్నారు. వీటిని వినియోగించడంతో వృత్తి భద్రత ఏర్పడుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అబ్కారీ ఎస్ఐ రాజేశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారిణి విజయలక్ష్మి, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.



షరతులు లేకుండా రుణాలు మాఫీ చేయాలి

- పాత పద్ధతిలోనే రైతుబంధు వెంటనే అందజేయాలి
- బొంతు రాంబాబు, దుగ్గి కృష్ణ డిమాండ్

నవతెలంగాణ-కామేపల్లి



షరతులు లేకుండా బ్యాంకు రుణాలు వెంటనే మాఫీ చేయాలని, ఎంత మాఫీ అయితే అంతకంటే పెంచి రుణాలు ఇవ్వాలని, షరతులు లేకుండా పాత పద్ధతిలోనే రైతుబంధు వెంటనే ప్రభుత్వం రైతులకు అందజేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని జాస్తి పల్లి గ్రామంలో సీపీఐ(ఎం) గ్రామశాఖ ఆరో మహాసభ రాయల వెంకన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహా సభకు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ హాజరై మాట్లాడారు. నూతన శాఖ కార్యదర్శిగా రాయల సత్యనారాయణనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి అంబటి శ్రీనివాస్‌రెడ్డి, బాదావత్ శ్రీనివాస్, ఉప్పుతల వెంకన్న, వీరస్వామి, అంజయ్య, వీరభద్రం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ఆధునిక పరిణామానికి నాంది చిట్యాల ఐలమ్మ

నవతెలంగాణ-పాల్వంచ

తెలంగాణ వీరవనిత సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన మహిళ ధైర్యశాలి చిట్యాల ఐలమ్మ అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు గురువారం వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్లో ఘనంగా నిర్వహించారు ఆమె చిత్రపటానికి కలెక్టర్ టిసిఎంఎస్ చైర్మన్ కొత్తల శ్రీనివాసరావు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి రమాదేవి డి ఆర్ డి ఓ విద్యాచందన మైనార్టీ సంక్షేమ అధికారి సంజీవరావు బీసీ కమ్యూనిటీ సంఘ నాయకులు ఇంద్రాల దుర్గయ్య సుంకర అజిత్ నేరాల రమేష్ చిటికెన ముసలయ్య ముదిగొండ రాంబాబు సర్వేశ్ నీలావతి లలిత విజయలక్ష్మి అంజమ్మ కుదుమూరు సత్యనారాయణ కార్యాలయం సిబ్బంది జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఈ ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

మహిళా లోకానికే వన్నె తెచ్చిన వీరనారీ ఐలమ్మ

రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ కొత్వాల

భూస్వాముల పెత్తందారీ విధానాలకు తనదైన శైలిలో ఉద్యమించి, ఉద్యమస్ఫూర్తితో మహిళా లోకానికే వన్నె తెచ్చిన తెలంగాణ వీరవనిత చిట్యాల ఐలమ్మ అని డీసీఎంఎస్ చైర్మెన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ జయంతి సందర్భంగా గురువారం పాల్వంచ పోలీస్ పెట్రోల్ బంక్ వద్ద బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు మసన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్వాల పాల్గొని ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొండం వెంకన్న, కాంగ్రెస్ నాయకులు కాపర్తి వెంకటాచారి, వాసుమల్ల సుందర్‌రావు, శనగా రాంచందర్‌రావు, గంధం నరసింహారావు, విశ్రాంత ఉద్యోగి ఎస్.శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాలతో హైడ్రామాలు వద్దు

- మాజీ ఎంపీ మీడియం బాబురావు
- ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించాలి....!
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



హైడ్రా పేరుతో భయ ఆందోళనకు గురి చేస్తూ పేదల జీవితాలతో చెలగాటలు ఆడితే సీపీఐ(ఎం) చూస్తూ ఊరుకోదని, పట్టణంలో చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారులు మరోసారి పునరాలోచించుకోవాలని మాజీ పార్లమెంటు సభ్యులు మీడియం బాబురావు అన్నారు. గురువారం సుందరయ్య నగర్ శాఖ మహాసభ సందర్భంగా ఏర్పాటు చేసిన పథకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాబురావు పాల్గొని మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా రోడ్డు పక్కనే జీవిస్తున్న పేదలను ఆక్రమ పేరుతో ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా బుల్డోజర్లతో కూల్చేసే ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పేదలకు చిరు వ్యాపారస్తులకు ప్రత్యామ్నాయం చూపించి అప్పుడు ఖాళీ చేపించాలని హైడ్రా తరహా పాలన భద్రాచలం మంచిది కాదని బాబురావు స్పష్టం చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వెంటనే ప్రారంభించాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు

పార్లమెంటే ఎన్నికల ముందు హడావుడిగా భద్రాచలంలో ప్రారంభించిన ఇందిరమ్మ పథకం నేటి వరకు అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందని వెంటనే ఇందిరమ్మ పథకాన్ని ప్రారంభించి అర్హులైన పేదలందరికీ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సుందరయ్య నగర్ శాఖా మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పట్టణంలో నిర్మాణాలు పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే పేదవాళ్లకు కేటాయించాలని కోరారు. గత ప్రభుత్వం పేదవాడికి సొంత ఇల్లు లేకుండా చేసిన ఫలితంగానే ఎన్నికల్లో ఘోర ఓటమి పాలైన విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తు చేసుకోవాలని మచ్చ సూచించారు. పేదవాళ్ల జోలికి వచ్చిన ఏ ప్రభుత్వం నిలబడలేదన్న విషయాన్ని పాలకులు మర్చిపోకూడదని తెలిపారు. జిల్లా కమిటీ సభ్యురాలు సున్నం గంగా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి. నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు, ఎర్రశెట్టి వెంకట్రామారావు, పట్టణ కమిటీ సభ్యులు జి.లక్ష్మీకాంత్, కుంజ శ్రీను, ఎస్‌డి. ఫిరోజ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శిబిరాలకు నిరసనగా మావోల మెరుపు దాడి

- పూసుగుప్ప బేస్ క్యాంపు పై గంట పాటు కవ్వింపు చర్య
- ప్రతి దాడి చేసిన సీఆర్పీఎఫ్ 81 బెటాలియన్
- వివరాలు వెల్లడించిన చర్ల సీఐ రాజు వర్మ

నవతెలంగాణ-చర్ల



మావోయిస్టు విలీన ఉత్సవాల నేపథ్యంలో మండల పరిధిలోని పుసుగుప్ప సమీప సిఆర్పిఎఫ్ 81 బెటాలియన్ బేస్ క్యాంపు పై మెరుపు దాడి చేశారు. బుధవారం సాయంత్రం 6:30 గంటల నుండి రాత్రి 7.30 గంటల వరకు సుమారు 15 రౌండ్ల కాల్పులు, బిజిఎల్ (దేశవాళీ రాకెట్ లాంచర్) లను ఉపయోగించి పోలీసులను మట్టు పెట్టాలని వ్యూహంతో మావోయిస్టులు దాడి జరిపినట్లు సిఐ రాజు వర్మ తెలిపారు. అటు చతీస్‌గడ్ ఇటు తెలంగాణ సరిహద్దు దండకారణ్యంలో ఉన్న ఆదివాసి గ్రామమైన రాంపురం వైపు నుండి మావోయిస్టులు బేస్కాంప్ పై ఎటాక్ చేసినట్లు ఆయన తెలిపారు. వరుస పోలీస్ శిబిరాలను జీర్ణించుకోలేని మావోయిస్టులు ఇలాంటి కవ్వింపు చర్యలకు పాలు పడడం పరిపాటయిందని తెలిపారు. మావోయిస్టులు ఫైరింగ్ చేయడంతో పాటు మందు పాత్రలు పేల్చి ఆ ప్రాంతమంతా హల్చల్ చేసినట్లు స్థానికులు తెలుపుతున్నారు. ఉద్యమకారులంతా ఒక తాటిపైకి వచ్చి మావోయిస్టు పార్టీ స్థాపించి 20 సంవత్సరాలు అయిన నేపథ్యంలో సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 20 వరకు పెద్ద ఎత్తున మాస ఉత్సవాలు జరపాలని మావోయిస్టు కేంద్ర కమిటీతో పాటు ఏరియా కమిటీలు సైతం పెద్ద ఎత్తున లేఖల ద్వారా ప్రచారం చేసిన సంగతి పాటకులకు విధితమే. కాగా దండకారణ్యంలో యుద్ధమేఘాలు అలుముకున్న తరుణంలో బుధవారం పూసుగుప్ప క్యాంపుపై జరిగిన మావోయిస్టుల మెరుపు దాడి రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇదిలా ఉంటే గురువారం చర్ల సీఐ నేతృత్వంలో భారీగా వాహన తనిఖీ నిర్వహించి అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.

పాషాని సన్మానించిన ముస్లీం సోదరులు

- రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు మండలంలో ఉండటం గర్వకారణం

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



ఆళ్ళపల్లి మండలం జాకారం మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న మహమూద్ పాషా ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ అమృతరావు ఎడ్యుకేషనల్ సొసైటీ, ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న విషయం విదితమే. ఈ మేరకు గురువారం ఆళ్ళపల్లి మండల కేంద్రంలోని ముస్లిం సోదరులు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో అవార్డు గ్రహీత షేక్ మహమూద్ పాషాకి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్ఎంపి మొహమ్మద్ నయీమ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ మండల నాయకుడు మొహమ్మద్ అతహార్, ఆర్ఎంపి మొహమ్మద్ ఖాలిద్ మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక మూడు రాష్ట్రాలకు చెందిన వెయ్యి మంది ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డు ఇస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పాషా మాత్రమే ఎన్నిక కావడం సంతోషకరమని పేర్కొన్నారు. జాకారం పాఠశాలలో అంకిత భావంతో పనిచేస్తూ, ఏజెన్సీలో ఆదివాసీ పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న పాషా ఆళ్ళపల్లి మండలంలో ఉండటం మాకు గర్వంగా ఉన్నదన్నారు. అయన చేస్తున్న ప్రకృతి, పర్యావరణ సేవలకుగాను ప్రపంచ పర్యావరణ సంస్థ వారు తెలంగాణ స్టేట్ గ్రీన్ రేంజర్ కో ఆర్డినేటర్‌గా నియమించడం హర్షణీయమని కొనియాడారు. రాబోయే రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పాషా కు రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ సాబీర్, ఎండి ముజహార్, షేక్ ఖదీర్, షేక్ ఇమ్రాన్, షేక్ గౌస్ పాషా, మొహమ్మద్ అఫ్రోజ్, మహమ్మద్ ఫయీమ్, మొహమ్మద్ ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

మున్నేరు బాధితుల సహాయార్థం బియ్యం అందజేత

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని లింగాల గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పిలుపు మేరకు 'మన ఖమ్మం- మనం' అంటూ దాతల నుండి సేకరించిన 18 వేలు నగదును, 8 క్వింటాల బియ్యంను సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌కి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ సత్తుపల్లి క్యాంప్ ఆఫీసులో గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు పసుమర్తి చంద్రరావు, మండల నాయకులు ఏనుగు సత్యం బాబు, దేవరపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చివరి మజిలీ చేరేదెలా....!



- స్మశాన వాటిక ఘట్టాల వద్ద కుళాయిలు ధ్వంసం

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం నగరంలోని కాల్వ ఒడ్డు హిందూ స్మశాన వాటిక ఇటీవల కురిసిన ఆకాల తుఫాన్‌కు మున్నేరు వరద ఉధృతి పెరిగి, స్మశాన వాటిక పూర్తిగా మునిగిపోయింది. దీంతో స్మశాన వాటికలోని స్నాన ఘట్టాల వద్ద ఉన్న కుళాయిలు ధ్వంసం అయ్యాయి. నీటి కొరత తీవ్రతరమైంది. అంత్యక్రియలు జరిపే చోటు నేలమట్టమైంది. పిండాలు పెట్టె, కర్మలు చేసే మెట్ల వద్ద ఇనుప పందిరి కూలిపోయింది. స్మశాన వాటికకు ఉన్న ఇరువైపులా ప్రహరీలు కూలిపోయాయి. దీంతో చివరి మజిలీ సాగేదెలానని ఖమ్మం ప్రజలు ఆందోళన చెందుతున్నారు. హిందూ స్మశాన వాటికకు వచ్చే మృతుల బంధువులు అంత్యక్రియలు చేసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్మశాన వాటికలో పూర్తిగా బురద నిలిచి పోవడంతో కాలు జారీ పడుతున్నారు. స్మశాన వాటికకు మృతదేహాలను తీసుకొచ్చే బంధువులు స్నానం చేసేందుకు ట్యాంక్‌లలో నీళ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద ఉధతి తగ్గి కొన్ని రోజులు గడుస్తున్నప్పటికీ స్మశాన వాటికలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర ఆలస్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు తక్షణమే స్పందించి, స్మశాన వాటికలో మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అంత్యక్రియలకు వచ్చే బంధువుల వద్ద గుండుకు రూ.1,116 లు డిమాండ్ చేసి తీసుకోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇంకా నీళ్లల్లోనే 'వట్టెం' మోటార్లు

- ఆ వైపు వెళ్లకుండానే వెనుదిరిగిన మంత్రులు
- తొమ్మిదేండ్లయినా పూర్తికాని పనులు
- సాగు,తాగునీటికి తప్పని కష్టాలు

22 రోజులు కావస్తున్నా.. వెలికితీయని వైనం





నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన వట్టెం పంపుహౌజ్ నీటిలో మునిగి దాదాపు నెల రోజులు కావస్తున్నా.. నేటికీ మునిగిన మోటార్లను వెలికి తీయలేదు. ఇక్కడ మొత్తం 10 మోటార్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా నాలుగు బిగించారు. మరో మోటారు నిర్మాణ దశలో ఉండగానే ఈనెల ఒకటిన కురిసిన భారీ వర్షానికి రింగ్‌బాండ్ తెగి నీరంతా టన్నెల్‌లోకి చేరింది. దీంతో ప్రాజెక్టు పనులు ఆలస్యం అవుతున్నాయి. జరిగిన నష్టాన్ని పరిశీలించి పనులు పూర్తి చేయించడా నికి వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు నీట మునిగిన మోటార్ల వైపు రాకుండానే వెళ్లిపోయారు. ఇప్పటికే మూడేండ్లలో పూర్తి చేయాల్సిన ప్రాజెక్టు పనులు ఆగుతూ.. సాగుతూ జరుగుతున్న తరుణంలో మోటార్లు వరదలో మునగడంతో మరింత ఆలస్యం జరిగే అవకాశం ఉంది. మరోవైపు సాగునీరందక.. భూములు కోల్పోయిన వారు ఉపాధి లేక హైదరాబాద్ వంటి నగరాలకు వలస పోతున్నారు. నాగర్‌కర్నూల్ మండలం శ్రీపురం గ్రామానికి సమీపంలో పాలమూరు -రంగారెడ్డి టన్నెల్ నిర్మాణ దశలో ఉంది. టన్నెల్ పైభాగాన ఉన్న గొలుసుకట్టు చెరువుల్లో అధిక వర్షాలకు భారీగా వరద చేరింది. ఈ తాకిడికి రింగ్‌బాండ్ తెగి సర్జిపుల్ ద్వారా పంపు హౌజ్‌లోకి నీళ్లు వచ్చాయి. నెల రోజులు కావస్తున్నా డీవాటరింగ్ కావడం లేదు. ప్రాజెక్టుల పరిశీలనకు వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు మునిగిన మోటార్ల వైపు వెళ్లకుండానే పర్యటన ముగించారు. ఈ ప్రాజెక్టును 2016 జూన్‌లో రూ.32500 కోట్లతో మొదలు పెట్టారు. మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి ఈ ప్రాజెక్టు వల్ల పర్యావరణం దెబ్బతింటుందని గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేయడంతో పనులు మందగించాయి.

ఆ తర్వాత తాగునీటి పేరుతో అనుమతులు తెచ్చుకున్నారు. జూరాల, రాజోళీ ప్రాజెక్టుల ద్వారా 2 లక్షల ఎకరాలకు మాత్రమే సాగు నీరందుతోంది. అందుకే పాలమూరు-రంగారెడ్డి ద్వారా రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వికారాబాద్, నల్లగొండ జిల్లాల్లో 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందివ్వాలని లక్ష్యం నిర్ణయించారు. 61.67 కి.మీటర్ల సొరంగం, 915.47 కిలోమీటర్ల కాల్వలు తవ్వాల్సి ఉంది. తాగునీటి కోసం 7.15 టీఎంసీలు, పరిశ్రమలకు 3 టీఎంసీలు, సాగునీటి కోసం 75 టీఎంసీలు ఇవ్వాల్సి ఉంది. 1200 గ్రామాలకు తాగునీరు కూడా ఇవ్వాల్సి ఉంది. నీటిని తోడటానికి 31 మోటార్లు 145 మెగావాట్లు, 3 మోటార్లు 75 మెగావాట్లవి బిగించాల్సి ఉంది. బడ్జెట్ లేక పనులు నత్తను తలపిస్తు న్నాయి. తాజాగా మోటార్లు మునగడంతో ప్రాజెక్టు పనులు మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

పాలకుల నిర్లక్ష్యం

జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టులపై పాలకులు ఆది నుంచీ నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. మూడేండ్లలో పూర్తి కావాల్సిన పనులు ఎనిమిదేండ్లు గడిచినా 70 శాతమైనా పూర్తి కాలేదు. 2024 బడ్జెట్‌లో పాలమూరు-రంగారెడ్డికి రూ.1285 కోట్లు కేటాయించారు. ఈ నిధులు ఇప్పటి వరకు చేసిన పనులకే సరిపోతాయి. మరో రూ.10 వేల కోట్లు ఇస్తేనే పనులు ముందుకు సాగుతాయని పలు రాజకీయ పార్టీల నేతలు చెబుతున్నారు. ప్రభుత్వం కల్వకుర్తికి రూ.715, కోయిల్‌సాగర్‌కు రూ.429 కోట్లు, సంగంబండకు రూ.138కోట్లు, నెట్టెంపాడుకు రూ.105కోట్లు, ఆర్డీఎస్‌కు రూ.29.50 కోట్లు, జూరాలకు రూ.5కోట్లు, బీమాకు రూ.32 కోట్లు కేటాయించింది. ఈ నిధులు నిర్వహణకు తప్ప పనుల పొడిగింపునకు ఏమాత్రం సరిపోవని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఏడాదిలోపు పూర్తి చేస్తాం

పెండింగులో ఉన్న పాలమూరు రంగారెడ్డితో పాటు ఇతర ప్రాజెక్టులను ఏడాదిలోపు పూర్తి చేస్తాం. ప్రాధాన్యత క్రమంగా పూర్తి చేసి ఆయకట్టుకు నీరందిస్తాం. ప్రాజెక్టులకు నిధుల కొరత రాకుండా చూస్తాం. గత పాలకుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజా ప్రభుత్వంలో ప్రాజెక్టులను పూర్తి చేయడంలో ఎవరికీ ఎటువంటి అనుమానాలూ అవసరం లేదు.

జూపల్లి కృష్ణారావు, ఎక్సైజ్, పర్యాటక శాఖామంత్రి

ప్రజాస్వామ్యాన్ని కాలరాసింది బీఆర్ఎస్సే..

- ఎదురు తిరగడం వల్లే రెండోసారి మంత్రి పదవి రాలేదు
- పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది బీఆర్ఎస్ పార్టీయే..
- ఏ పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధం : స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



నవతెలంగాణ-స్టేషన్ ఘన్‌పూర్

అవినీతి, అక్రమాలకు మారుపేరు బీఆర్ఎస్ పార్టీ.. పదేండ్లు అధికారంలో ఉండి ప్రజాస్వామ్యాన్ని కాలరాసి.. రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ సర్వనాశనం చేశారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు స్థాయి మరచి పిచ్చి పిచ్చిమాటలు మాట్లాడొద్దని, ప్రజలు ఎందుకు మిమ్మల్ని తిరస్కరించారో గుర్తెరిగి మాట్లాడాలని హితవు పలికారు. మూడు దశాబ్దాల రాజకీయ అనుభవం తనదని, ఎగిరిన వారందరూ కనుమరుగై పోయారని అన్నారు. తనకు ప్రజాశీర్వాదం ఉందని, ప్రజాస్వామ్యం, న్యాయవ్యవస్థ, ఎన్నికల వ్యవస్థలపై గౌరవముందని చెప్పారు. ఏ పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. వరంగల్ జిల్లా చరిత్రను కాలరాసే విధంగా వ్యవహరించొద్దని మొత్తుకున్నాను.. ఉమ్మడి జిల్లాను ఆరు ముక్కలు చేయొద్దని ఎదురు తిరిగాను కాబట్టే రెండోసారి తనకు మంత్రి పదవి రాలేదని అన్నారు. కేసీఆర్ నియంతృత్వంతో ప్రజాస్వామ్యవాదుల నోరు నొక్కారని విమర్శించారు. వారి కుటుంబమంతా కలిసి ఇష్టారీతిగా దోపిడీకి ఎగబడిందని ఆరోపించారు. కోట్లాది ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అలాంటోళ్లు ఇప్పుడు 9 నెలల పాలన పూర్తికాని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఆగం చేసి, అప్పుల ఊబిలోకి నెట్టి, ఖాళీ ఖజానాను అప్పజెప్పి సమయం ఇవ్వకుండా మాట్లాడటమేంటని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్ఎస్ అని, పదేండ్ల కాలంలో 38 మంది ఎమ్మెల్యేలను, చివరికి శాసనసభ పక్షాలను కూడా చేర్చుకున్నారని అన్నారు. అప్పుడు గుర్తుకురాని ప్రజాస్వామ్యం, ఫిరాయింపుల చట్టం ఇప్పుడెలా గుర్తుకొస్తున్నాయని ప్రశ్నించారు. కోర్టు తీర్పుకు కట్టుబడి ఉంటామని, ఉప ఎన్నికలు రావు.. ఒకవేళ వచ్చినా ఆందోళన లేదని, ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని చెప్పారు. బీఆర్ఎస్‌కు డిపాజిట్లు వస్తాయో.. లేదో ఆలోచించుకోవాలన్నారు.

గండిపేట్‌లో మూసీ ప్రక్షాళనకు సర్వే

- రివర్‌లో 32 నిర్మాణాల గుర్తింపు
- నాలుగు బృందాలు ఏర్పాటు
- గృహాలకు మార్క్ వేసిన అధికారులు



నవతెలంగాణ-గండిపేట్

మూసీ ప్రక్షాళనలో భాగంగా మూసీ రివర్‌లో ఉన్న ఇండ్లను రెవెన్యూ అధికారులు గుర్తించారు. గురువారం రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలంలో మొత్తం 32 నిర్మాణాలను గుర్తించారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ, పోలీసు అధికారుల సమన్వయంతో నాలుగు బృందాలుగా ఏర్పడి సర్వే చేపట్టారు. గుర్తించిన వాటికి ఆర్బీఎక్స్ అని ముద్రవేశారు. వీటిని త్వరలో కూల్చేందుకు ఏర్పాట్లు చేస్తామని అధికారులు తెలిపారు. బండ్లగూడ కిస్మత్‌పూర్, హైదర్‌షాకోట్, గంధంగూడ మంచిరేవుల, నార్సింగి, బైరాగిగూడ గ్రామాల మీదుగా మూసీ పరివాహక ప్రాంతంలో ఇండ్లను రీ సర్వే చేశారు. హైదర్‌షాకోట్‌లో సాయి హర్షనగర్, విశాల్‌నగర్, గంధంగూడాలోని విగ్నేశ్వర్‌నగర్ కాలనీలో రివర్‌పైన ఉన్న ఇండ్లను గుర్తించారు. వారి నుంచి పూర్తి వివరాలు సేకరించారు. అధికారుల సర్వేతో మూసీ పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇక్కడ తాము దశాబ్దాలుగా ఉంటున్నామని స్థానికులు తెలిపారు. ఇంటి ట్యాక్స్‌లు కూడా కడుతున్నామని చెప్పారు. ఇప్పుడు అధికారులు వచ్చి ఇండ్లకు మార్కులు వేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐలు, మున్సిపల్, ఇరిగేషన్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గోరిచెన్ శిఖరంపై గిరిజన యువకుడు

- 20 ఏండ్ల వయసులో భూక్య యశ్వంత్‌నాయక్ రికార్డు



నవతెలంగాణ -మరిపెడ

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యతండాకు చెందిన యువ పర్వతారోహకుడు భుక్య యశ్వంత్‌నాయక్ 20ఏండ్ల వయస్సులో రికార్డు సృష్టించాడు. అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రతిష్టాత్మకమైన ప్రమాదకరమైన శిఖరం, మౌంట్ గోరిచెన్‌ను విజయవంతంగా అధిరోహించాడు. రాష్ట్రంలోని గిరిజన ఏజెన్సీ ప్రాంతానికి చెందిన యశ్వంత్ నాయక్ తన ప్రయాణాన్ని అతి స్వల్ప వనరులతో ప్రారంభించాడు. అతనిలో ఉన్న అపారమైన పట్టుదల, కృషి, పర్వతారోహణ పట్ల ఉన్న ఆసక్తి ప్రపంచంలోని కఠినమైన శిఖరాలను అధిరోహించే స్థాయికి తీసుకొచ్చింది. 18 రోజుల పర్వతారోహణ యాత్ర సెప్టెంబర్ 4, 2024న ప్రారంభమైంది. సెప్టెంబర్ 19న మౌంట్ గోరిచెన్ శిఖరాన్ని అధిరోహించాడు. ప్రఖ్యాత ట్రాన్సెండ్ అడ్వెంచర్ కంపెనీకి చెందిన యశ్వంత్, ఈ అత్యంత క్లిష్టమైన శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించిన తొలి సివిలియన్ బృందంలో ఒకరిగా ఉన్నాడు. ఈ విజయం తనది మాత్రమే కాదని, తనను విశ్వసించిన, మద్దతిచ్చిన ప్రతి ఒక్కరిదని యశ్వంత్ నాయక్ అన్నారు. మౌంట్ గోరిచెన్‌ను అధిరోహించడం తన జీవితకాల స్వప్నం అన్నారు. నేడు దానిని సాధించినందుకు గర్వంగా ఉందని తెలిపారు.

కల్తీ నెయ్యి తయారీ పరిశ్రమపై ఎస్‌ఓటీ పోలీసుల దాడి

- మైలార్‌దేవ్‌పల్లి పీఎస్ పరిధిలో ఘటన

నవతెలంగాణ-రాజేంద్రనగర్



అపరిశుభ్ర వాతావరణంలో గుట్టుచప్పుడు కాకుండా కల్తీ నెయ్యి తయారు చేస్తున్న పరిశ్రమపై ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పరిధి మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో తెలంగాణ ఫుడ్స్ అనే కంపెనీ పేరుతో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. అపరిశుభ్ర వాతావరణంలో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నట్టు గుర్తించారు. అదేవిధంగా ఎలాంటి అనుమతులూ లేవని గుర్తించారు. అక్కడ ఉన్న నెయ్యిని ఫుడ్ సేఫ్టీ అధికారులు సేకరించారు. ఈ కంపెనీ నుంచి 7,280 లీటర్ల నెయ్యిని, 80 కేజీల మైదాపిండిని స్వాధీనం చేసుకున్నారు. నెయ్యిని పరీక్షించిన తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐటీలో తెలంగాణను ముందుకు తీసుకెళ్తాం

- స్కిల్ నాలెడ్జ్ యూనివర్సిటీతో మరిన్ని అవకాశాలు : ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- అనలిటికా అనకాన్ ఇండియా, ఇండియా ల్యాబ్ ఎక్స్‌పో, ఫార్మా ప్రో ప్యాక్ ఎక్స్‌పోను ప్రారంభించిన మంత్రి



నవతెలంగాణ- మియాపూర్

ఐటీలో తెలంగాణను మరింత ముందుకు తీసుకెళ్తామని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. స్కిల్ నాలెడ్జ్ యూనివర్సిటీ ఏర్పాటుతో మరిన్ని ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు. అనలిటికా అనకాన్ ఇండియా, ఇండియా ల్యాబ్ ఎక్స్‌పో, ఫార్మా ప్రో ప్యాక్ ఎక్స్‌పో-2024 కార్యక్రమాన్ని గురువారం హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ కేంద్రంలో మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మా ఉత్పత్తుల రంగంలో, పరిశోధన, రూపకల్పనలో భారత్ ప్రాధాన్యత గురించి వివరించారు. దాదాపు 500కుపైగా ఎగ్జిబిటర్లు, 7000కు పైగా ఉత్పత్తులు, 120కిపైగా కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణ తో ఈ ఏడాది కార్యక్రమం శాస్త్రీయ, ప్రయోగశాల ఫార్మా రంగాల్లో భారతదేశ వృద్ధిని మరింత పెంపొందించడంలో కీలకంగా మారిందన్నారు. ప్రపంచ ఔషధ ఉత్పత్తిలో భారత్ సహకారం ప్రస్తుతం 35 శాతం ఉండగా.. రానున్న రోజుల్లో అది 50 శాతానికి పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఫార్మాస్యూటికల్స్, లైఫ్ సైన్సెస్ రంగాలకు మంచి వనరులు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా జీనోమ్ వ్యాలీ నాలుగో దశ వంటి ప్రత్యేక జోన్ల వృద్ధి ద్వారా లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఈ రంగం ప్రపంచ విస్తరణలో తెలంగాణ బలమైన భాగస్వామిగా ఉందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ప్రపంచ లైఫ్ సైన్సెస్ వాల్యూ చైన్‌లో తెలంగాణ ఒక ముఖ్యమైన ప్రదేశంగా ఉండేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

ఈ సందర్భంగా మెస్సె మూంచెన్ ఇండియా సీఈఓ భూపిందర్‌సింగ్ మాట్లాడుతూ.. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఇది చాలా పెద్ద ట్రేడ్ ఫేర్ కార్యక్రమం అన్నారు. 70కి పైగా దేశాల నుంచి 25000 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నా రని తెలిపారు. ఇందులో అగ్రశ్రేణి నిర్ణయాలు తీసుకునే వారు, ఆవిష్కర్తలూ ఉన్నారని అన్నారు. ఫార్మాస్యూటికల్స్, బయోటెక్, ల్యాబ్ టెక్నాలజీల్లో భారత్‌ను గ్లోబల్ లీడర్‌గా నిలపాలన్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ రంగాల్లో తెలంగాణ నాయకత్వం ఎంతో గొప్పదని, రానున్న కార్యక్రమాల కోసం తెలంగాణను పర్మినెంట్ హోస్ట్ రాష్ట్రంగా నిర్వహిస్తే బాగుంటుందని ఆకాంక్షించారు.



బీఆర్ఎస్ పాలనలో విధ్వంసం

- రాష్ట్ర పునర్నిర్మాణంలో ఇంజినీర్లదే కీలక పాత్ర : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ- మియాపూర్

బీఆర్ఎస్ పాలనలో విధ్వంసమైన తెలంగాణను మళ్లీ పునర్నిర్మిస్తామని, రాష్ట్ర పునర్నిర్మాణంలో ఇంజినీర్లదే కీలక పాత్ర అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా మాదాపూర్ డివిజన్ పరిధిలోని నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. టీజీపీఎస్సీ నిర్వహించిన 1540 అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ పోస్టుల నోటిఫికేషన్‌లో ఉద్యోగాలు సాధించి.. ఆర్అండ్‌బీ శాఖకు కేటాయించిన 156 మంది ఏఈఈలకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లంతా కష్టపడి పని చేయాలని సూచించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య, నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ వంటి ఇంజినీర్లను ఆదర్శంగా తీసుకోవాలి.. కానీ, కాళేశ్వరం కట్టిన ఇంజినీర్లను కాదన్నారు. రాష్ట్రంలో కొన్ని ప్రాజెక్టులు కట్టిన వెంటనే కూలిపోయి ఇంజినీర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసిన ఘటనలను చూశామని అన్నారు. విధి నిర్వహణలో ఇంజినీర్ల పాత్ర ఎంతో గొప్పదని, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకూ తలొగ్గకుండా తమ కర్తవ్యాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పనిపట్ల ఎంతో సునిశితంగా, ఏకాగ్రతతో పనిచేయాలని చెప్పారు.

నిండుకుండలా సింగూరు ప్రాజెక్టు

- ప్రాజెక్టులోకి భారీ వరద

నవతెలంగాణ-పుల్కల్



ఉమ్మడి మెదక్ జిల్లాలో అతిపెద్ద ప్రాజెక్టు అయిన సింగూరు ప్రాజెక్టుకు భారీగా వరద వస్తుండటంతో నిండుకుండలా మారింది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 29.917 టీఎంసీలు. వారం రోజులుగా ఎగువ భాగం నుంచి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. గురువారం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 12.128 క్యూసెక్కులు రావడంతో అధికారులు అప్రమత్తమై ప్రాజెక్టు 11వ గేటును 1.50 మీటర్ల పైకి లేపి దిగువకు 11.446 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టుకు పర్యాటకుల తాకిడి పెరిగింది. అయితే, ప్రాజెక్టు పైకి అనుమతి ఇవ్వకపోవడంతో పర్యాటకులు నిరాశకు గురవుతున్నారు. ప్రాజెక్టు దిగువ భాగంలో ఉన్న మంజీరా నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉందని, ముఖ్యంగా మత్స్యకారులు, గొర్రెలు, పశువుల కాపర్లు ఆ వైపు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు.

నా మీద కక్షతో నేతన్నల పొట్టకొట్టొద్దు



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ / బోయినిపల్లి

- ఉపాధి కల్పించి ఆదుకోవాలి
- బీఆర్ఎస్ హయాంలో చేతినిండా పని కల్పించాం
- ప్రభుత్వం దివాళాకోరు రాజకీయం చేస్తోంది : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

"తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సిరిసిల్ల నేతన్నలను అన్ని విధాలుగా ఆదుకుని, చేతినిండా పని కల్పించింది బీఆర్ఎస్ ప్రభుత్వం.. సిరిసిల్లను మరో తిర్పూర్ చేయాలని సంకల్పించాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్ ఆపేసి దివాళాకోరు రాజకీయం చేస్తోంది.. నాపై కోపంతో నేతకార్మికుల పొట్టకొట్టొద్దు.. ఆర్డర్లు ఇచ్చి ఉపాధి కల్పించాలి" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో 2004నుంచి 2014వరకు కాంగ్రెస్ హయాంలో సిరిసిల్లలో ఆత్మహత్యలు జరిగాయన్నారు. ఒకే వారంలో తొమ్మిది మంది నేతన్నలు ఆత్మహత్య చేసుకోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. నాడు ఎంపీగా ఉన్న కేసీఆర్ చలించిపోయి పద్మశాలీ ట్రస్ట్‌కు రూ.50 లక్షలు అందజేశారని చెప్పారు. రాష్ట్రం ఏర్పడ్డాక సిరిసిల్ల వ్యాపారవేత్తలతో నాటి సీఎం కేసీఆర్ సమావేశమై నేతన్నలను ఆదుకునేందుకు చర్చలు జరిపారన్నారు. వారికి ఉపాధి కల్పించడంతో కోటి మంది ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేయాలని కేసీఆర్ నిర్ణయించారన్నారు. అందుకు సిరిసిల్లలో బతుకమ్మ చీరలు ఉత్పత్తిచేసి ఏడాదికి 8నెలలు ఉపాధి కల్పించి నేతన్నలను ఆదుకున్నట్టు వివరించారు. స్కూల్ యూనిఫామ్స్, కేసీఆర్ కిట్‌లో ఇచ్చే చీరలు, రంజాన్ తోఫా, క్రిస్మస్‌కు కానుక చీరలను సిరిసిల్లలో తయారు చేయించామన్నారు. ఎనిమిదేండ్ల పాటు రూ.3,312కోట్ల ఆర్డర్లు సిరిసిల్లకు ఇవ్వడంతో నేతన్నలకు ఉపాధి లభించి ఆత్మహత్యలు ఆగిపోయాయన్నారు. ఈ క్రమంలోనే ఆధునీకరణ వైపు ఆలోచనలను చేస్తూ సిరిసిల్లను మరో తిర్పూర్ చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వం ఆశించిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బతుకమ్మ చీరలను నిలిపివేసి కార్మికుల ఉపాధిపై దెబ్బ కొట్టిందన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్లను బంద్ చేయడంతో నేతన్నల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కోటి మందికి పైగా ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు బంద్ అయ్యాయన్నారు. రాజకీయంగా తన మీద కోపంతో రాజన్న సిరిసిల్ల ప్రజలు, నేతన్నల మీద కక్ష తీసుకోవద్దని కోరారు.

సిరిసిల్లలో రేషన్ షాప్ కేటాయింపుల్లో జరిగిన అవకతవకలపై న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. హైడ్రా మీద ప్రభుత్వం హైడ్రామా చేస్తున్నదని, ఎవరికైనా అన్యాయం జరిగితే, తమను సంప్రదిస్తే వారి తరపున న్యాయ పోరాటం చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయుకుడు గూడూరి ప్రవీణ్, జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, సెస్ చైర్మెన్ చిక్కాల రామరావు, బొల్లి రాంమోహన్ ఉన్నారు.

కొదురుపాకలో ప్రాథమిక పాఠశాల భవనం ప్రారంభం

సిరిసిల్ల బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామంలో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తన అమ్మమ్మ ఊరు కొదురుపాకలో.. అమ్మమ్మ- తాతయ్య పేరు మీద ఈ స్కూలు నిర్మాణానికి తనవంతు సహాయం చేశానన్నారు. ప్రభుత్వంలో ఉన్నా లేకపోయినా బీఆర్ఎస్ విద్యార్థుల భవిష్యత్ కోసం పనిచేస్తుందన్నారు. విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా తాను ముందుంటానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కూస రవీందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కొండయ్య, మార్కెట్ కమిటీ చైర్మెన్ ఎల్లేస్, వైస్ చైర్మెన్ నిమ్మ వినోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉసురు తీస్తున్న మానసిక ఒత్తిడి

(మొదటిపేజీ తరువాయి)

నాలుగు పేజీల లేఖ రాశారు. 2021లో హైదరాబాద్‌లోని టీసీఎస్‌లో పని చేస్తున్న అనిల్ కుమార్ పని ఒత్తిడి కారణంగా ఉరి వేసుకొని చనిపోయారు. 2019లో 24 సంవత్సరాల సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పొగాకు హరిణి హైదరాబాద్ రాయదుర్గంలోని ఓ హోటల్ గదిలో బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇక నీకు పని లేదని యాజమాన్యం చెప్పడంలో కలత చెంది ఆమె ఆత్మహత్య చేసుకున్నారు. అదే సంవత్సరం 23 ఏండ్ల ఐటీ ఉద్యోగి గుండ్ల చైతన్య హైదరాబాద్‌లోని ఓ హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. ఉద్యోగంతో అసంతృప్తి చెందానంటూ ఆయన ఓ నోట్ రాశారు. ఇలాంటి విషాదాంతాలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి.

పని ఒత్తిడికి కారణాలు అనేకం

ఐటీ పరిశ్రమలో, బహుళజాతి కంపెనీలలో పనిచేస్తున్న ఉద్యోగులు పని ఒత్తిడి కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్న ఉదంతాలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే పని ఒత్తిడికి కారణాలు అనేకం. దీర్ఘకాల పని గంటలు, క్లిష్టతరమైన డెడ్‌లైన్‌లు, అధిక పనిభారం, ఉద్యోగంలో అభద్రత, సహచరులు, యజమానులతో ఘర్షణలు...ఇవన్నీ ఒత్తిడికి దారితీస్తున్నాయి. బహుళజాతి కంపెనీలు ఆకర్షణీయమైన వేతనాలు, ప్రోత్సాహకాలు అందజేస్తున్నప్పటికీ ఉద్యోగులపై ఒత్తిడి పెంచుతున్నాయి. కంపెనీలలో పని సంస్కృతి దారుణంగా ఉంటోందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. దీర్ఘకాల పనిగంటలతో పాటు వారాంతపు సెలవు దినాలలో కూడా పని చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఊపిరి తీసుకోవడానికి కూడా సమయం చిక్కడం లేదన్నది వారి ఆందోళన. సెలవు పెట్టినా, ఆఫ్ రోజైనా వెంట ల్యాప్‌టాప్ తప్పనిసరిగా ఉండాల్సిందే. ఎప్పుడు ఏ అవసరం వస్తుందో ఎవరికి తెలుసు?

ఆటవిక చర్యలపై కఠినంగా వ్యవహరించాలి

- దప్పు కొట్టనందుకు సాంఘిక బహిష్కరణ దుర్మార్గం
- బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు నోరు విప్పాలి
- సామాజిక చైతన్యంతో గ్రామస్తులు ఐక్యతను చాటాలి : కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు
- గౌతోజీగూడెంలో బాధితులకు పరామర్శ



నవతెలంగాణ-మనోహరాబాద్

నేటి ఆధునిక యుగంలో ఆటవిక చర్యలకు ఉసిగొల్పుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని.. పల్లె ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు అన్నారు. డప్పు కొట్టనందుకు గ్రామం నుంచి సాంఘిక బహిష్కరణ చేయటం దుర్మార్గమైన చర్యని, పౌర సమాజం, ప్రభుత్వం ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండించాలని అన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం గౌతోజీగూడెం గ్రామంలో డప్పు కొట్టనందుకు సాంఘిక బహిష్కరణకు గురైన దళితులు పంచమి చంద్రం, అర్జున్ కుటుంబాన్ని గురువారం కేవీపీఎస్, సీఐటీయూ నేతలు పరామర్శించారు. బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. 'మీరు ఉన్నత చదువులు చదువుకున్నా డప్పు కొట్టాల్సిందే.. లేకపోతే ఊరు నుంచి బహిష్కరిస్తాం.. సర్కార్ ఇచ్చిన భూమిని లాక్కుంటాం.. కిరాణం షాపుల్లో సరుకులు ఇవ్వనీయం.. మీతో ఎవరు మాట్లాడినా రూ.5000 జరిమానా, 25 చెప్పు దెబ్బలు" అంటూ దళిత కుటుంబంపై మధ్యయుగాల కాలపు నాటి శిక్షలు విధించడం సిగ్గుచేటన్నారు. రాజ్యాంగబద్ధంగా ప్రజల ఓట్లతో ఎన్నికైన సర్పంచి, గ్రామ పెద్దలు ఇందులో భాగం అవ్వడం దారుణమన్నారు. గ్రామంలో పెద్దలందరూ సెప్టెంబర్ 10న తీర్మానం చేసి ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు గ్రామస్తులతో సమావేశం నిర్వహించి వారిలో చైతన్యం తీసుకొచ్చి సాంఘిక బహిష్కరణను ఎత్తేయించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఈ ఘటనను ఎందుకు ఖండించలేదో చెప్పాలన్నారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి ప్రభుత్వ ఉన్నతాధికా రులు నెల రోజుల పాటు ప్రత్యేక చైతన్య సభలు నిర్వహించాలన్నారు. ఊర్లోని విద్యావంతులు ఈ దుశ్చర్యను ఖండిస్తున్నారని, ఇది అభినందనీయమన్నారు. గ్రామంలో 31 మంది మొత్తం గ్రామ ప్రజల ఐక్యతను దెబ్బ తీశారన్నారు. బహిష్కరణకు గురైన కుటుంబానికి ప్రభుత్వం పూర్తిస్థాయి రక్షణ కల్పించాలని కోరారు. అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడంతోపాటు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాణిక్యం మాట్లాడుతూ.. డప్పు కొట్టకుంటే సాంఘిక బహిష్కరణ చేస్తారా? అని ప్రశ్నించారు. ఒక వ్యక్తి బ్రాహ్మణుడిగా పుట్టి.. అధికారిగా మారిన తర్వాత కూడా ఆఫీసర్ ఉద్యోగం చేస్తాడా, అర్చక ఉద్యోగం చేస్తాడా, ఒకవేళ అర్చక ఉద్యోగం చేయకుంటే అతన్ని ఎక్కడైనా సాంఘిక బహిష్కరణ చేశారా? అని ప్రశ్నించారు. దళితులు కావడం వల్లే సాంఘిక బహిష్కరణ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను ప్రజలు ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించాలన్నారు.

ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు బక్కేల్లి బాలకిషన్ మరాఠీ కృష్ణమూర్తి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మహేందర్ రెడ్డి, సీఐటీయూ నాయకులు కడారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇట్ల చేద్దాం

పుదీనా ఆకులను మరిగించిన నీటిని తాగితే జలుబు, దగ్గుతో ఉపశమనం కలుగుతుంది.



మేము సిద్ధంగా ఉన్నాం

నిజమైన ఛాంపియన్‌లు మైదానంలో మాత్రమే తయారు చేయబడరు. వారి చుట్టూ ఉన్న నిరంతర ప్రోత్సాహం, శిక్షణ, మద్దతు ద్వారా వారు రూపొందించబడతారు. పునాది బలంగా ఉండి, సరైన మార్గదర్శకత్వం లభిస్తే అత్యంత సవాలుగా ఉన్న కలలను కూడా సాధించవచ్చని ఈ ఐదుగురు అమ్మాయిలు రుజువు చేస్తున్నారు. పోడియంకు వెళ్లే మార్గం కోసం లెక్కలేనన్ని గంటలపాటు కఠినమైన శిక్షణ పొందారు. అన్ని స్పోర్ట్స్ ఈవెంట్‌లలో దేశానికి ప్రాతినిధ్యం వహించే సామర్థ్యాన్ని పొందారు. 'ఇప్పుడు మేము పోటీకి సిద్ధంగా ఉన్నాం' అంటూ ఆత్మవిశ్వాసంతో చెబుతున్న ఔత్సాహిక అథ్లెట్ల పరిచయాలు నేటి మానవిలో...

ఆరేండ్లు కష్టపడింది.....



కుసుమ రావాడ... ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఈ అథ్లెటిక్స్ తన ప్రయాణంలో అనేక సవాళ్లు ఎదుర్కొంది. 23 ఏండ్ల ఈమె లాంగ్ జంప్‌లో పతకం కోసం ఆరేండ్ల పాటు కష్టపడింది. గాయాలతో పోరాడింది. జాతీయ పోటీల్లో అవకాశాలు రాక విపరీతమైన ఒత్తిడికి గురయింది. ఒకానొక సమయంలో అథ్లెటిక్స్‌ను వదులుకోవాలని కూడా భావించింది. 2017లోనే కుసుమ ABSFలో చేరి నిజమైన క్రీడాకారిణిలా శిక్షణ పొందడం ప్రారంభించింది. చివరకు 2023లో ఆమె కృషి ఫలించింది. U23 జాతీయ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం, ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో రజతం సాధించింది. 2024లో ఖేలో ఇండియా యూనివర్శిటీ గేమ్స్‌లో స్వర్ణం సాధించింది. ఆమె అథ్లెటిక్ కెరీర్‌లో ఒక ముఖ్యమైన మలుపు తిరిగింది. ఎన్ని సవాళ్లు ఎదురైనా తన కలలను ఎప్పటికీ వదులుకోకూడదని బలంగా నిర్ణయించుకున్న కుసుమ నేడు ఒలింపిక్స్‌తో పాటు మరిన్ని విజయాలు సాధించడంపై దృష్టి సారించింది. ■

లాంగ్ జంప్ స్టార్

సుస్మిత... రాజస్థాన్‌లోని రాజ్‌గఢ్ అనే చిన్న నగరం నుంచి వచ్చిన ఈమెకు క్రీడా ప్రపంచంలోకి అడుగుపెట్టడం అంత సులభం కాలేదు. ఆమె ఎదుర్కొన్న అనేక సవాళ్లు, గాయాలు, ఎదురుదెబ్బలు ఆమెను మరింత దృఢంగా తీర్చిదిద్దాయి. 2020లో ABSFలో చేరడం, లెజెండరీ కోచ్ రాబర్ట్ బాబీ జార్జ్ వద్ద శిక్షణ పొందడం సుస్మిత జీవితంలో ఒక కీలకమైన మలుపు. 2023లో జరిగిన ఆసియా U20 అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో రజత పతకాన్ని, 2023లో జరిగిన U20 నేషనల్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించింది. ఆమె తన ప్రతిభకు స్కాలర్‌షిప్ కూడా అందుకుంది. సుస్మిత కుటుంబ సభ్యులు, ముఖ్యంగా తండ్రి ఆమెను నిత్యం ప్రోత్సహిస్తున్నారు. గొప్ప కోచింగ్, అత్యుత్తమ శిక్షణా పరికరాలు, తగిన ఆహారంతో ఆమె ముందుకు సాగుతుంది. తదుపరి ఒలింపిక్స్‌కు అర్హత సాధించ గలదని ఆమె ఇప్పుడు నమ్మకంగా ఉంది. ■



ట్రిపుల్ జంప్ ఛాంపియన్

పూర్వా సావంత్... 2021లో ట్రిపుల్ జంప్‌లో తన అభిరుచిని కనుగొనే ముందు ఆమె వివిధ ఈవెంట్‌లను అన్వేషించడం మొదలుపెట్టింది. అథ్లెటిక్స్‌లో ఈమె ప్రయాణం ఏడేండ్ల వయసులోనే ప్రారంభమైంది. ఆమె 2023 ఆసియా ఇండోర్ ఛాంపియన్‌షిప్‌తో సహా అంతర్జాతీయ వేదికపై రెండుసార్లు భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది. మార్చి 2022లో ABSFలో చేరినప్పటి నుండి ఆమె తన క్రీడపై కోచ్ రాబర్ట్ బాబీ జార్జ్ నుండి స్థిరమైన మార్గదర్శకత్వం పొందింది. ఆమె భారతదేశానికి రెండుసార్లు ప్రాతినిధ్యం వహించింది. ఒకసారి కజకిస్తాన్ 2023లో జరిగిన 10వ ఆసియా ఇండోర్ ఛాంపియన్‌షిప్‌లో, మరొకసారి చెంగ్డూలో జరిగిన వరల్డ్ యూనివర్శిటీ గేమ్స్ 2024లో. ఆమెను ప్రేరేపించిన విషయం ఏమిటని అడిగినప్పుడు పెద్దగా నవ్వుతూ తన తల్లిదండ్రులు అని చెప్పింది. 'వారు మానసికంగా ఇచ్చే మద్దతు నాకు చాలా విలువైనది. వారు నన్ను మరింత మెరుగ్గా తీర్చిదిద్దేందుకు ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటారు' అని ఆమె జోడించింది. ■



ఎ ప్రామిసింగ్ ఫ్యూచర్

సమయి రుచిత... అథ్లెటిక్స్‌లో ఈమె ప్రయాణం ప్రత్యేకమైనది. ఒక చిన్న పట్టణంలో పరిమిత వనరులతో ప్రారంభించింది. తాత్కాలిక అడ్డంకులతో అసమానమైన ట్రాక్‌లపై అలసిపోకుండా శిక్షణ పొందింది. అయితే ఇది అందరూ చేరుకోలేనిదిగా అనిపించే కలతో నడిచేది. ఆమె ప్రారంభ ఏడాది ఎదురుదెబ్బలు, గాయాలు, ఆర్థిక సవాళ్లు, సందేహాస్పద క్షణాలతో నిండి ఉంది. 2018లో ఆమె ABSFలో చేరినప్పుడు అంతా మారిపోయింది. అక్కడ ఆమె పోషకాహారం, పునరుద్ధరణ, శిక్షణా పరికరాలతో సహా సౌకర్యాలు, కోచింగ్, అవసరమైన మద్దతును పొందింది. ఈ కొత్త మద్దతుతో ఖేలో ఇండియా యూనివర్శిటీ గేమ్స్‌లో బంగారు పతకాన్ని గెలుచుకోవడంతో రుచిత కష్టానికి ఫలితం దక్కింది. ఆమె కొత్త ఎత్తులను సాధించడానికి సిద్ధమవుతుంది. ప్రతిష్టాత్మకమైన లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రేరణ పొందింది. ■



ఎ లెజెండ్ ఇన్ ది మేకింగ్

శైలి సింగ్ ఝాన్సీ... చిన్న పట్టణానికి చెందిన అమ్మాయి. అలాంటి చోట లాంగ్ జంప్ వంటి క్రీడలలో మహిళలు పాల్గొనడం అసాధారణం. అభిరుచి ఉన్నప్పటికీ ఎక్కడ నుండి ప్రారంభించాలనే దానిపై ఆమెకు సరైన మార్గదర్శకత్వం లేదు. 2018లో ABSFలో చేరి క్రీడల్లోని సూక్ష్మ నైపుణ్యాలను నేర్చుకోవడం మొదలుపెట్టిన తర్వాత ఆమె పరిస్థితి మారిపోయింది. 'జీవితం మీకు ఇచ్చే అవకాశాన్ని పొందండి' అనే తన గురువు మాటలను ఆమె ఎంతో శ్రద్ధగా పాటించింది. ఎంతో ఉత్సాహంతో శిక్షణ పొందుతోంది. శైలి ప్రస్తుతం U-16 కేటగిరీ (6.15 మీ), U-18 కేటగిరీ (6.48 మీ), U-20 కేటగిరీ (6.76 మీ)లలో జాతీయ రికార్డులను కలిగి ఉంది. ఏప్రిల్ 2023లో జరిగిన ఇండియన్ గ్రాండ్ ప్రిక్స్‌లో 6.76 మీటర్ల వ్యక్తిగత అత్యుత్తమ జంప్‌తో స్వర్ణంతో సహా పలు పోటీల్లో పతకాలు గెలుచుకున్నప్పటికీ ఒలింపిక్స్ 2024కి అర్హత సాధించలేకపోయింది. ఇదే ఆమెను ప్రేరేపించింది. ఈసారి మరింత కష్టపడి దేశం కోసం ప్రశంసలు పొందాలని నిర్ణయించుకుంది. అథ్లెట్లకు ప్రజల నుండి మంచి ప్రోత్సాహం లభిస్తుందని ఆమె నమ్ముతుంది. ఇది వారిని మెరుగ్గా రాణించేలా ప్రోత్సహించడమే కాకుండా వారి కెరీర్, అభిరుచిని క్రీడల్లో కొనసాగించేందుకు విశ్వాసాన్ని ఇస్తున్నాయి. ■



కొలెస్ట్రాల్ తగ్గేందుకు...



కరివేపాకు.. దీనితో ఆరోగ్య ప్రయోజనాలతో పాటు కొన్ని బ్యూటీ బెనిఫిట్స్ కూడా ఎన్నో లాభాలున్నాయి. వీటిని తినడం వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ పెరిగి ఐరన్ లోపం తగ్గుతుంది. ఇందులో ఎన్నో అద్భుత గుణాలు ఉన్నాయి. పచ్చి కరివేపాకును రోజూ కొద్దిగా తినటంవల్ల కలిగే లాభాలేమిటో చూద్దాం...

ఎముకల బలానికి..

కరివేపాకులో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది దంతాలు, ఎముకల ఆరోగ్యానికి మంచిది. కీళ్ళనొప్పులు, షుగర్ ఉన్నవారిలో ఎముకల నొప్పిని తగ్గించి వాటిని బలంగా మారుస్తుంది.

కొలెస్ట్రాల్‌ని తగ్గించడం..

కరివేపాకు తింటే LDL అనే చెడు కొలెస్ట్రరాల్ తగ్గుతుంది. దీంతో రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోదు. చెడు కొలెస్ట్రాల్ తగ్గితే బీపి కూడా కంట్రోల్ అవుతుంది. దీంతో గుండె సంబంధ సమస్యలు తగ్గి హార్ట్ హెల్త్ బాగుంటుంది.

ఇమ్యూనిటీ పెరుగుదలకు

రోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఓ గ్రాము పచ్చి కరివేపాకు తింటే ఇమ్యూనిటీ పెరుగుతుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. కరివేపాకులో ప్రోటీన్స్, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. దీని వల్ల ఇమ్యూనిటీ బలంగా మారతుంది. ఇన్ఫెక్షన్లు దూరమవుతాయి. ■



ప్రాణాలు తీసిన పవిత్ర స్నానం

బిహార్‌లో 47 మంది భక్తులు మృతి

పాట్నా : బీహార్‌లో పవిత్ర స్నానం ప్రజల ప్రాణాలను తీసింది. 'జీవిత్‌పుత్రిక' పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మూడ్రోజుల వేడుకల్లో భాగంగా పలు నదులు, చెరువుల్లో పవిత్ర స్నానాలు ఆచరించే క్రమంలో సుమారు 50 మందికి పైగా నీటిలో మునిగిపోయారు. 47 మంది చనిపోగా, ముగ్గురు గల్లంతయ్యారు. వీరిలో 37 మంది చిన్నారులు, నలుగురు మహిళలు ఉన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఒక ప్రకటనను విడుదల చేసింది.

గతేడాది ఇదే పండుగ సందర్భంగా పవిత్ర స్నానాలు ఆచరిస్తూ మొత్తం 22 మంది చనిపోయారు. జితియా లేదా జీవిత్‌పుత్రిక పండుగ సందర్భంగా మహిళలు వారి పిల్లల బాగు కోసం ఉపవాసం ఆచరిస్తారు. మూడ్రోజుల పాటు ఈ పండుగ వేడుకలు జరుగుతాయి. రాష్ట్రవ్యాప్తంగా పలు నదులు, చెరువుల్లో భక్తులు పవిత్ర స్నానాలను ఆచరిస్తారు. ఈ సారి చోటు చేసుకున్న మరణాలు రాష్ట్రంలో 15 జిల్లాల నుంచి నమోదయ్యాయి. "ఇప్పటి వరకు 47 మృతదేహాలను వెలికి తీశాం. తదుపరి గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి" అని బీహార్ విపత్తు నిర్వహణ విభాగం తెలిపింది. ఈ ఘటనల పట్ల బీహార్ సీఎం నితీశ్ కుమార్ సంతాపాన్ని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

బిల్కిస్ బానో కేసులో గుజరాత్ సర్కార్‌కు షాక్

దోషులతో బీజేపీ ప్రభుత్వం కుమ్మక్కైనట్టుందని సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ : గుజరాత్ ప్రభుత్వానికి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. బిల్కిస్ బానో కేసుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను తీర్పు నుంచి తొలగించాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ కేసులో దోషులుగా తేలిన 11 మందికి శిక్షాకాలం ముగియకముందే దానిని మాఫీచేసి (రెమిషన్ ఇచ్చి) వారిని గుజరాత్ ప్రభుత్వం విడుదల చేయడాన్ని తప్పుబడుతూ సుప్రీంకోర్టు గతేడాది కీలక వ్యాఖ్యలు చేసింది. దోషులతో ప్రభుత్వం కుమ్మక్కైనట్టుందని వ్యాఖ్యానించింది. తీర్పులో ఈ వ్యాఖ్యలను తొలగించాలంటూ గుజరాత్ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. ప్రభుత్వ తీరును మరోసారి ఎండగడుతూ పిటిషన్‌ను కొట్టివేసింది.

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బిల్కిస్ బానో సామూహిక లైంగికదాడి, ఆమె కుటుంబంలో ఏడుగురు సభ్యుల దారుణ హత్య కేసులో 11 మంది దోషుల విడుదల చెల్లదంటూ జనవరిలో సుప్రీం తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. గుజరాత్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడిందని, రెండు వారాల్లోగా దోషులను మళ్లీ జైల్లో పెట్టాలని ఆదేశించింది. " లేని అధికారాన్ని గుజరాత్ ప్రభుత్వం వాడుకుంది. అది చట్ట ఉల్లంఘనే. ఆ ప్రాతిపదికన చూసినా రెమిషన్ ఉత్తర్వుల్ని కొట్టివేయాల్సిందే. సుప్రీంకోర్టు తీర్పును ఉపయోగించుకుని, చట్టాన్ని ధిక్కరించి, దోషులకు శిక్ష తగ్గించారని చెప్పడానికి ఇదో తిరుగులేని ఉదాహరణ. విచక్షణాధికారాన్ని గుజరాత్ దుర్వినియోగం చేసింది" అని అప్పట్లో సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది.

2002 నాటి ఘటన..

2002లో గోద్రా రైలు దహనకాండ అనంతరం గుజరాత్‌లో మతపరమైన అల్లర్లు జరిగినప్పుడు భయాందోళనతో పారిపోతున్న బిల్కిస్ బానో (అప్పటి వయసు 21 ఏండ్లు) లైంగికదాడికి గురయ్యారు. ఆ సమయంలో ఆమె ఐదు నెలల గర్భిణి. ఆమెపై దారుణానికి ఒడిగట్టడంతో పాటు ఆమె మూడేండ్ల కుమార్తె సహా కుటుంబ సభ్యుల్లో ఏడుగురిని హతమార్చడం పెను సంచలనమైంది. 11 మంది నిందితులకు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం 2008 జనవరి 21న యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. తర్వాత బాంబే హైకోర్టు కూడా దీన్ని సమర్థించింది. (సాక్ష్యాలను ప్రభావితం చేస్తారని, సాక్షులకు ముప్పు ఉంటుందని బానో అనుమానాలు వ్యక్తం చేయడంతో అప్పట్లో విచారణను అహ్మదాబాద్ నుంచి ముంబయికి మార్చారు.) దోషులు 15 ఏండ్లు కారాగారంలో గడిపారు. అనంతరం తనను విడుదల చేయాలంటూ వారిలో ఒకడు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో దానిని పరిశీలించాలని సర్వోన్నత న్యాయస్థానం గుజరాత్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనిపై ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కేసులో నిందితులందరికీ రెమిషన్ మంజూరు చేయాలని కమిటీ సభ్యులు సిఫారసు చేశారు. 2022 ఆగస్టు 15న దోషులంతా విడుదలయ్యారు.

లడ్డూ వెనుక రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పుడు కొత్తగా వచ్చే లబ్ది ఏమీ ఉండదని, అయితే ప్రత్యర్థులు పైచేయి సాధించకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత తమపై ఉన్నదని వారు చెప్పారు. చంద్రబాబు చర్యలతో పార్టీకి లబ్ది చేకూరుతుందని ఓ టీడీపీ ఎమ్మెల్యే తెలిపారు. చంద్రబాబు చర్యలు ఆంధ్రప్రదేశ్‌లోని హిందువులకే కాకుండా ప్రపంచంలోని హిందువులందరికీ భరోసా ఇచ్చాయని టీడీపీ ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు చెప్పారు.

నేను సైతం అంటున్న జనసేన

బీజేపీకి మిత్రపక్షంగా, ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ కూడా సనాతన ధర్మం నినాదాన్ని ఎత్తుకుంది. ఆ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రస్తుతం 11 రోజుల 'ప్రాయశ్చిత్త దీక్ష'లో భాగంగా ప్రసిద్ధ దేవాలయాలను సందర్శిస్తూ తిరుపతిలో జరిగిన తప్పిదానికి క్షమాపణలు కోరుకుంటున్నారు. విజయవాడలోని కనకదుర్గ దేవాలయాన్ని సందర్శించి మెట్లు కడిగారు. దేవాలయాలకు సంబంధించిన వ్యవహారాలను చూడడానికి సనాతన ధర్మ రక్షణ బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. జగన్ పాలనలో రాష్ట్రంలోని హిందూ దేవాలయాలపై జరిగిన దాడులను నిరసిస్తూ ధర్మ పరిరక్షణ దీక్ష చేపట్టాలని పవన్, బీజేపీ నేతలు 2020లో పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. టీడీపీ వ్యవస్థాపకుడు, ఏపీ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావును అనుకరిం చేందుకు పవన్ చేస్తున్న ప్రయత్నాలను తాము గమనిస్తున్నామని టీడీపీ నాయకులు చెప్పారు. వేషధారణలో కూడా పవన్ ఇటీవల ఎన్టీఆర్‌ను అనుకరించారు.

పవన్ చర్యలపై బీజేపీ సంబరం

ఏపీలో పార్టీకి నిర్మాణపరంగా కానీ, నాయకత్వ పరంగా కానీ తగిన బలం లేకపోయినా పవన్ కల్యాణ్ కేంద్ర నాయకత్వంతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారని, తాము ఏ భావజాలంతో ఉన్నామో దానికి ఆయన మద్దతుగా నిలుస్తున్నారని బీజేపీ సంబరపడుతోంది. 'పార్టీ మద్దతుదారులలో ఆయన అత్యంత విశ్వసనీయ వ్యక్తి. నరేంద్ర మోడీ సహా పార్టీ నాయకత్వం ఆయన పట్ల తమ అభిమానాన్ని, గౌరవాన్ని ఎన్నడూ దాచుకోలేదు' అని ఓ బీజేపీ నేత వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన తొలి ఎన్డీఏ సమావేశంలో పవన్‌ను ఉద్దేశించి 'ఆయన పవనం కాదు. తుఫాను' అని మోడీ వ్యాఖ్యానించారని గుర్తు చేశారు.

నితీష్ అడుగులతో బీజేపీ బెంబేలు

రామ మందిరం నిర్మించినందుకు బీహార్ నేత నితీష్ కుమార్ ప్రధానిపై ప్రశంసలు కురిపించారు. సీతామర్హి-అయోధ్య మధ్య నేరుగా రైల్వే లైను నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. నితీష్ వైఖరి బీహార్‌లోని బీజేపీ వర్గాలలో ఆందోళన కలిగిస్తోంది. లోక్‌సభ ఎన్నికలలో అనూహ్య ఫలితాలు సాధించిన నితీష్ కుమార్, ఇప్పుడు తమ హిందూ ఓటు బ్యాంకుకు ఎక్కడ గండి కొడతారోనని కొందరు బీజేపీ నేతలు భయపడుతున్నారు. 'గత ఎనిమిది నెలల కాలంలో ఆయన ఎప్పుడూ ఇలాంటి వ్యాఖ్యలు చేయలేదు. మా ఓటు బ్యాంకును గండి కొట్టేందుకు ఇది ఓ ప్రయత్నం కావచ్చు. సంకీర్ణ భాగస్వామిగా ఉన్నప్పటికీ గత ఎనిమిది నెలలుగా ఆయన మౌనంగానే ఉన్నారు. ఇప్పుడు హఠాత్తుగా రామ మందిర నిర్మాణాన్ని కొనియాడారు. ఆయన ఏం చేయబోతున్నారో పార్టీ గమనించాల్సి ఉంది' అని బీజేపీ నాయకుడొకరు చెప్పారు. శ్రీరాముడు కేంద్రంగా బీజేపీ సాగించిన రాజకీయాలకు భిన్నంగా సీతాదేవి కేంద్రంగా నితీష్ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇది బీజేపీ రాజకీయాలకు ఆమోదం తెలిపినట్లే కన్పిస్తున్నప్పటికీ రామాయణ సర్క్యూట్, రాష్ట్రంలో టూరిజం అభివృద్ధిపై నితీష్ దృష్టి కేంద్రీకరించారని బీజేపీ నాయకులు గుర్తు చేశారు.

రేపు వైసీపీ పూజలు

లడ్డూ వివాదంలో చంద్రబాబు పైచేయి సాధిస్తున్నారేమోనన్న అనుమానంతో వైసీపీ కూడా రంగంలోకి దిగింది. చంద్రబాబు దెబ్బతీసిన తిరుమల పవిత్రతను పునరుద్ధరించేందుకు శనివారం రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల్లో పూజలు నిర్వహించాలని వైసీపీ అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డి పిలుపునిచ్చారు. చంద్రబాబు దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు.

30రోజుల్లో డిజిటల్ హెల్త్‌కార్డులు

(మొదటిపేజీ తరువాయి)

పోరాడుదామని ఆయన పిలుపునిచ్చారు.

తమ ప్రభుత్వం లాభాలార్జించే ప్రభుత్వం కాదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తున్నామని తేల్చిచెప్పారు. స్వాతంత్ర్య భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ తీసుకున్న విప్లవాత్మక చర్యల ఫలితంగా సమాజంలో ఆకలి, కరువు చావులు లేవనీ, ప్రజల ఆయుష్షు పెరిగిందని తెలిపారు. ప్రస్తుత సమాజానికి అత్యంత అవసరమైన విద్య, వైద్యమే తమ ప్రాధాన్యతలని తేల్చి చెప్పారు. దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ట్రస్ట్ చైర్మెన్ ఎస్.వి.రావు వినతి మేరకు, ఇబ్రహీంపట్నంలో స్పోర్ట్స్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు కోసం స్థలం కేటాయించేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారు. అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉస్మానియా యూనివర్సిటీలో స్థలం అప్పగింతకు సంబంధించిన విజ్ఞప్తిని పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ క్యాన్సర్ సేవలు ఒక సంక్లిష్టమైన విషయమని తెలిపారు. క్యాన్సర్ బాధితులు ఆస్పత్రులకు ఆలస్యంగా వస్తుండటం సమస్యగా ఉందని తెలిపారు. దీనిపై ప్రజల్లో ఇంకా అవగాహన పెరగాలన్నారు. క్యాన్సర్ రోగులకు సేవలందించేందుకు స్పష్టమైన అవగాహనతో ముందుకెళ్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో సెంటర్ ఏర్పాటుకు సహకరించిన దాతలను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎండీ శ్రీధర్ పెద్దిరెడ్డి, దుర్గాబాయ్ దేశ్ ముఖ్ ట్రస్టీ చైర్మెన్ ఎస్.వీ.రావు, మాజీ అధ్యక్షురాలు లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నీళ్లను ఒడిసిపట్టి ప్రజలకందించాలి

(మొదటిపేజీ తరువాయి)

నియమితులవుతున్నారని తెలిపారు. తెలంగాణ ప్రజల భావోద్వేగం నీళ్లతో నిండి ఉందని తెలిపారు. ఏ వృత్తిలోనైనా క్షేత్ర స్థాయిలో అనుభవం ఉన్నవాళ్లే రాణిస్తారని సీఎం వ్యాఖ్యానించారు. గతంలో ఇంజనీర్లు ఉదయం 5 గంటలకే ఫీల్డ్ విజిట్‌కు వెళ్లి రిపోర్టులు రాసే వారనీ, మధ్యలో పర్యటనలు ఆగిపోతే తాము అధికారంలోకి వచ్చాక క్షేత్ర స్థాయిలో పర్యటనలకు ఆదేశించినట్టు తెలిపారు. కాళేశ్వరానికి రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తే కూలిందనీ, దీనికి రాజకీయ నాయకులు, అధికా రుల్లో ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుం టున్నారనీ, చర్యలు తీసుకుంటే డిపార్ట్‌మెంటే మిగలదన్నారు. గత పదేండ్లలో రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేసిన ప్రాజెక్టులు పూర్తి కాలేదని తెలిపారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారు లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆపరేషన్ మూసీ

(మొదటిపేజీ తరువాయి)

మూసానగర్, శంకర్ నగర్‌లో హిమయత్ నగర్ తహసీల్దార్ సంధ్యారాణి, గోల్కొండ మండల పరిధిలోని ఇబ్రహీంబాగ్, ఆశ్రమ్‌నగర్ ఎమ్మార్వో అహల్య, బహదూర్‌పురా, కిషన్‌బాగ్ పార్క్ సమీపంలో తహసీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి మార్కింగ్ చేశారు.

అక్కడక్కడా నిరసన సెగలు

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లు ఇండ్లను మార్కింగ్ చేసి, నివాసితులను ఒప్పించడానికి 25 బృందాలను బుధవారం ఏర్పాటు చేశారు. గురువారం మొదటి రోజు ఆయా బృందాలు ప్రతి ఇల్లూ తిరుగుతూ నివాసితులతో మాట్లాడాయి. ఇప్పుడుంటున్న ఇండ్లకు వరదల ముప్పు ఉంటుందని, ఎప్పటికైనా ఇబ్బందులు తప్పవని వివరించారు. డబుల్ ఇండ్ల డ్రాను నివాసితులతోనే తీయిస్తామని, ఖాళీ చేసే సమయంలో సామాను తీసుకెళ్లడానికి ట్రాన్స్‌పోర్టు ఖర్చు సైతం ప్రభుత్వమే భరిస్తుందని రివర్ బెడ్ నివాసితులకు తెలియజెప్తున్నారు. అయితే, అక్కడక్కడ అధికారులకు నిరసన సెగలు తగిలాయి. చైతన్యపురిలోని సాయినగర్‌లో బఫర్‌జోన్ నివాసితులు రెవెన్యూ అధికారులను అడ్డుకున్నారు. తహసీల్దార్ విద్య బృందంతో వాగ్వాదానికి దిగారు. రివర్ బెడ్‌లో నిర్మించుకున్న ఇండ్లకు నోటీసులు ఇస్తున్న సమయంలో బఫర్ జోన్‌లో ఉన్నవారు ఆందోళనకు దిగడంతో అధికారులు నచ్చజెప్పారు. ప్రస్తుతం రివర్ బెడ్ పరిధిలోనే మార్కింగ్ చేస్తున్నామని సర్దిచెప్పటంతో శాంతించారు. ఈ సర్వే రివర్ బెడ్‌కే పరిమితమని, మిగతావారు ఆందోళన చెందొద్దని సూచించారు. కాగా, హైదరాబాద్ జిల్లాలో మొత్తం 1071 ఇండ్లు, కమర్షియల్ కట్టడాలు ఉండగా.. గురువారం 780 ఇండ్లకు మార్కింగ్ చేశారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 239 ఉండగా.. 75 ఇండ్లకు మార్కింగ్ చేశారు. రంగారెడ్డి జిల్లాలో 333 ఉండగా, 150 ఇండ్లకు మార్కింగ్ చేశారు. గండిపేటలో మరో 32 షెడ్లను స్వయంగా యజమానులే కూల్చేసుకున్నారు.

కావాల్సిన చోట 'డబుల్' ఇండ్ల కేటాయింపు!?

ప్రస్తుతం చేస్తున్న సర్వే ఆధారంగా అయితే సొంత ఇండ్లు ఉన్నవారందరికీ డబుల్ బెడ్‌రూమ్ నివాసాలు కేటాయించే అవకాశం ఉందని సమాచారం. ఇండ్లు కోల్పోతున్న వారికి వేరొక చోట డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించే అవకాశం ఉంది. సర్వే సందర్భంగా మూడు ప్రాంతాలను సూచిస్తూ.. ఎక్కడ ఇల్లు కావాలనేది అడిగి తెలుసుకుంటున్నారు. ప్రధానంగా హైదరాబాద్‌లో ఇండ్లు కోల్పోయిన వారికి సిటీలోనే కేటాయించే అవకాశముంది.

మలక్‌పేట చంచల్‌గూడలో 141 డబుల్ బెడ్రూం ఇండ్లు ఖాళీగా ఉన్నాయి. వనస్థలిపురంలోని సాహెబ్ నగర్‌లో 95 డబుల్ ఇండ్లు, ధూల్‌పేటలోనూ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఖాళీగా ఉన్నాయి. వాటిని కేటాయించే అవకాశం ఉందని సమాచారం. బఫర్ జోన్‌లో, ఎఫ్టీఎల్‌లో ఇండ్లు ఉన్నవారికి కొల్లూరు డబుల్ బెడ్రూంలలో అవకాశం ఇస్తారని తెలుస్తోంది. నాగోల్ బండ్లగూడలోని ఖాళీ రాజీవ్ స్వగృహ ఇండ్లను నిర్వాసితులకు కేటాయిస్తారని ప్రచారం నడుస్తోంది.



తల్లి మనసు షూటింగ్ పూర్తి

రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్ర ధారులుగా రూపొందుతున్న చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిషోర్ నిర్మాతగా తొలిసారి సినీరంగంలోకి అడుగుపెట్టి నిర్మిస్తున్న చిత్రమిది. పలువురు ప్రముఖ దర్శకుల వద్ద దర్శకత్వ శాఖలో విశేష అనుభవం గడించిన వి.శ్రీనివాస్ (సిప్పీ) దీని ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు.

ఈ సినిమా షూటింగ్ పార్ట్ పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని నిర్మాత ముత్యాల అనంత కిషోర్ మాట్లాడుతూ, "సన్నివేశాలకు అనుగుణంగా హైదరాబాద్‌లోని వివిధ లొకేషన్స్‌లో టాకీ, క్లైమాక్స్, పాటలతో సహా షూటింగ్ పార్ట్ మొత్తం సింగిల్ షెడ్యూల్లో పూర్తి చేశాం. మంచి కథ, కథనాలు ఈ చిత్రానికి ప్రధాన బలమైతే, అందుకు సరిపోయే ఆర్టిస్టులు, సాంకేతిక నిపుణులు మరో బలం. మనసును కట్టి పడేసే అద్భుత చిత్రంగా దీనిని మలిచాం. మా నాన్న పర్యవేక్షణలో దర్శకుడు అద్భుతంగా సినిమాను తీశారు. మేము అనుకున్నట్లే చాలా బాగా వచ్చింది. తొలి ప్రయత్నం లోనే ఒక మంచి సినిమా తీసినందుకు ఆనందంగా ఉంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి' అని చెప్పారు.

'ఓ మంచి చిత్రాన్ని ప్రేక్షకులకు అందించాలన్న తపనతో మా అబ్బాయి నిర్మాతగా చేస్తున్న చిత్రమిది. వాస్తవిక జీవితానికి అద్దంపట్టే విధంగా ఉంటుంది' అని చిత్ర సమర్పకులు ముత్యాల సుబ్బయ్య అన్నారు.

దర్శకుడు వి.శ్రీనివాస్ (సిప్పీ) మాట్లాడుతూ, 'ఓ మధ్య తరగతి తల్లి చుట్టూ తిరిగే కుటుంబ కథ ఇది. పలురకాల భావోద్వేగాలు, ఆ తల్లి సంఘర్షణల నేపథ్యంలో ఈ చిత్రాన్ని మలిచాం' అని తెలిపారు.

రఘుబాబు, శుభలేఖ సుధాకర్, సాహిత్య, వైష్ణవి, దేవిప్రసాద్, ఆదర్శ్ బాలకృష్ణ, శాంతకుమార్, గౌతం రాజు, దేవిశ్రీ, జబర్దస్త్ ఫణి తదితరులు ఈ చిత్రంలోని ఇతర ముఖ్య తారాగణం.

నవచిత్రం

ఆయుధ పూజ..సందడి షురూ



ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'దేవర'. నేడు (శుక్రవారం) ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాలోని 'ఆయుధ పూజ..' సాంగ్‌ను మేకర్స్ గురువారం విడుదల చేశారు. ఈ పాటను రామజోగయ్యశాస్త్రి రాయగా, కాలభైరవ ఆలపించారు. దీనికి అనిరుధ్ అద్భుతమైన స్వరాలను సమకూర్చారు. రిలీజైన కొద్ది నిమిషాల్లోనే ఈ పాట విశేష ప్రేక్షకాదరణ పొంది, సినిమాపై మరిన్ని అంచనాలను పెంచింది.

యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపొందింది. దేవర, వర అనే రెండు పాత్రల్లో ఎన్టీఆర్ తన నట విశ్వ రూపాన్ని మరోమారు చూపించబోతున్నారు. బాలీవుడ్ నటి జాన్వీకపూర్ కథానాయికగా, బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ శక్తివంతమైన ప్రతినాయకుడిగా నటించారు.

నందమూరి కళ్యాణ్‌రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ కె నిర్మించిన ఈచిత్రం తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ కానుంది.

1000కి పైగా జానపద కళాకారులతో

రా మచ్చా మచ్చా..



తమన్, శంకర్, రామ్‌చరణ్, శిరీష్

పక్కా కమర్షియల్ సినిమాల్లో సందేశాన్ని సైతం మిళితం చేస్తూ ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేయటంలో దర్శకుడు శంకర్ దిట్ట. అలాగే ఆయన సినిమాల్లోని పాటలు సైతం చాలా వైవిధ్యంగా ఉంటాయి.

తాజాగా 'గేమ్ చేంజర్' సినిమాలోని పాటలతో ఆయన మరోసారి తన ప్రత్యేకత చాటుకున్నారు. ఈ సినిమా నుంచి విడుదలైన తొలి పాట 'జరగండి.. జరగండి' ఇప్పటికే విశేష ఆదరణ పొందింది. ఈనెల 28న రెండవ సాంగ్ 'రా మచ్చా మచ్చా' ప్రోమోను, 30న పాటను రిలీజ్ చేయబోతున్నారు.

ఈ పాట కోసం శంకర్ ఏకంగా 1000కి పైగా జానపద కళాకారులను తీసుకున్నారు.

వీరంతా ఈ పాటలో రామ్ చరణ్‌తో కలిసి డాన్స్ చేయటం విశేషం.

రామ్ చరణ్, డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'గేమ్ చేంజర్'. అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్‌రాజు ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమాలో కియారా అద్వాని హీరోయిన్. క్రిస్మస్ సందర్భంగా సినిమాను తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల చేయబోతున్నారు.

ఈ పాట గురించి డైరెక్టర్ శంకర్ మాట్లాడుతూ, 'నేను రామ్‌చరణ్ కోసం ఓ ఇంట్రడక్షన్ సాంగ్ కావాలని తమన్‌ను అడిగాను. డిఫరెంట్‌గా చేద్దామని ఇద్దరం అనుకున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో సంస్కృతులను బేస్ చేసుకుని పాటని చేశాం. ఏపీలో గుసాడి, కొమ్ము కోయ, తప్పెట గుళ్లు వంటి జానపద నృత్యాలను పాటలో భాగం చేయాలనుకున్నాను.అలాగే వెస్ట్ బెంగాల్‌కు చెందిన చౌ, ఒరిస్సాకు చెందిన గుమ్రా, రానప్ప, పైకా, దురువ వంటి వాటితో పాటు కర్ణాటకు చెందిన హలారి. ఒక్కలిగ, గొరవర, కుణిత వంటి నృత్య రీతులను కూడా భాగం చేశాం. దీని వల్ల పాట గ్రాండియర్ లుక్‌తో వచ్చింది. సౌండింగ్ కూడా చాలా ఫ్రెష్‌గా ఉంది. పాట ఒక సెలబ్రేషన్‌లా ఉంటుంది. గణేష్ ఆచార్య కొరియోగ్రఫీ అందించారు. రామ్‌చరణ్ అయితే ఓ బీజీఎంను సింగిల్ షాట్‌లో పూర్తి చేశారు. ఇది చరణ్ ఫ్యాన్స్, సినీ లవర్స్‌కు ఓ ట్రీట్‌లా ఉంటుంది. అనంత్ శ్రీరామ్ పాటను సూపర్బ్‌గా రాశారు. దిల్ రాజు, శిరీష్ చాలా సపోర్ట్‌గా నిలిచారు' అని అన్నారు.

'రా మచ్చా మచ్చా' సాంగ్‌లో అన్నీ సంస్కృతులను చూపించటం ఐ ఫీస్ట్‌లా ఉంటుంది. దర్శకుడు శంకర్ చాలా హుక్ లైన్స్ రాశారు. చివరకు 'రా మచ్చా మచ్చా..' అనే లైన్‌ను సెలక్ట్ చేసుకున్నారు. పాటను స్క్రీన్‌పై చూస్తున్నప్పుడు చాలా ఎంజాయ్ చేస్తారు.
- సంగీత దర్శకుడు తమన్



మిస్టర్ సెలెబ్రిటీ రిలీజ్‌కి రెడీ

'మిస్టర్ సెలెబ్రిటీ' సినిమాతో సుదర్శన్ పరుచూరి హీరోగా పరిచయం అవుతున్నారు. ఆర్‌పి సినిమాస్ బ్యానర్ మీద చిన్న రెడ్డయ్య, ఎన్.పాండు రంగా రావు నిర్మాతలుగా రాబోతోన్న ఈ మూవీకి చందిన రవి కిషోర్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో వరలక్ష్మీ శరత్ కుమార్, శ్రీ దీక్ష, నాజర్, రఘుబాబు వంటి వారు ముఖ్య పాత్రలను పోషించారు.

ఈ సినిమా నుంచి ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్, టీజర్, పాటలు ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌ను ఆకట్టుకున్నాయి.

తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్ పోస్టర్‌ను పరుచూరి గోపాలకృష్ణ రిలీజ్ చేశారు. అక్టోబర్ 4న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'మా మనవడు పరుచూరి సుదర్శన్ నటించిన ఈ సినిమా అక్టోబర్ 4న రాబోతోంది. మమ్మల్ని ఆదరించినట్టుగానే మా మనవడ్ని కూడా ఆదరిస్తారని కోరుకుంటున్నాను. కొత్త దర్శకుడైనా కూడా సినిమాను బాగా తీశారు. ఈ చిత్రం అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది' అని చెప్పారు.



'మమ్మల్ని ప్రేక్షకులు ఈ నలభై ఏళ్లుగా ఆదరిస్తూనే ఉన్నారు. ఇప్పుడు మా మనవడు పరుచూరి సుదర్శన్ ఈ సినిమా ద్వారా ఆడియెన్స్ ముందుకు రాబోతున్నాడు. ఈ చిత్రాన్ని నిర్మాతలు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా గొప్పగా నిర్మించారు. దర్శకుడు అద్భుతంగా సినిమాను తీశారు. మా మనవడ్ని ఆదరించి ఈ సినిమాను విజయవంతం చేయండి' అని పరుచూరి వెంకటేశ్వరరావు అన్నారు.

ఆటలు

క్లీన్‌స్వీప్‌పై కన్నేసి..

- 2-0తో విజయంపై భారత్ గురి
- కాన్పూర్ టెస్టుకు వర్షం ముప్పు
- నేటి నుంచి భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టు

ఉ॥ 9.30 నుంచి జియో సినిమాలో..

భారత్, బంగ్లాదేశ్ టెస్టు సవాల్ కాన్పూర్‌కు చేరుకుంది. చెపాక్‌లో బంగ్లాను చిత్తు చేసిన టీమ్ ఇండియా.. కాన్పూర్‌లో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. నల్ల మట్టి పిచ్‌పై స్పిన్ మ్యాజిక్‌కు రంగం సిద్ధం చేసుకున్న రోహిత్‌సేన 2-0తో సిరీస్ సాధించటంపై కన్నేసింది.

క్లీన్‌స్వీప్‌పై భారత్, సమంపై బంగ్లాదేశ్ ఆశలు పెట్టుకోగా.. మరోవైపు మూడు రోజుల కుండపోతకు సిద్ధమవుతున్నాడు. కీలక కాన్పూర్ టెస్టుకు వర్షం ముప్పు పొంచి ఉండటంతో తుది జట్టు కూర్పు, ముగ్గురు స్పిన్నర్ల ప్రణాళిక ప్రభావితం అవుతాయా? చూడాలి. భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టు నేటి నుంచి ఆరంభం.

నవతెలంగాణ-కాన్పూర్

పాకిస్థాన్‌పై 2-0తో చారిత్రక టెస్టు సిరీస్ విజయంతో భారత్‌లో అడుగుపెట్టింది బంగ్లాదేశ్. తొలి టెస్టు తొలి రోజు భారత్‌ను 144/6తో కట్టడి చేసి ఆ జోరు కొనసాగించింది. కానీ ఆ తర్వాత టీమ్ ఇండియా మ్యాచ్‌ను మలుపుతిప్పింది. 280 పరుగుల తేడాతో చెపాక్ టెస్టులో ఏకపక్ష విజయం సాధించింది. స్వదేశంలో టీమ్ ఇండియా అత్యంత బలమైన జట్టుగా ఎందుకు కొనసాగుతుందో చెపాక్ టెస్టు ఓ ఉదహారణ. బంగ్లాదేశ్ శిబిరంలో ఇప్పుడు పాక్ సిరీస్ ఉత్సాహం లేదు. ఈ తరుణంలో నేటి నుంచి కాన్పూర్‌లో రెండో టెస్టు ఆరంభం కానుంది. వర్షం ముప్పు పొంచి ఉన్న టెస్టులో విజయమే లక్ష్యంగా ఇరు జట్లు బరిలోకి దిగుతుండగా.. ఆతిథ్య జట్టు క్లీన్‌స్వీప్‌కు రంగం సిద్ధం చేసుకుంది.

కుర్రాళ్లే బలం

విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ.. సహజంగా భారత టెస్టు మ్యాచ్‌లో పరుగుల భారం ఈ ఇద్దరిదే. కానీ చెన్నై టెస్టులో ఈ ఇద్దరు కలిపి నాలుగు ఇన్నింగ్స్‌ల్లో కేవలం 34 పరుగులే చేశారు. అయినా, భారత్ 280 పరుగుల తేడాతో విజయం సాధించింది. అందుకు కారణం జట్టులోని యువ క్రికెటర్లు రాణించటమే. శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్ మెరుపు ఇన్నింగ్స్‌లతో కదం తొక్కారు. సీనియర్లు అశ్విన్, జడేజాలు తొలుత బ్యాట్‌తో ఆదుకున్నా.. కుర్ర బ్యాటర్లు క్లిష్ట సమయంలో అండగా నిలిచారు. న్యూజిలాండ్‌తో సిరీస్ ముంగిట కోహ్లి, రోహిత్ ఫామ్ భారత్‌కు కీలకం. నేడు కాన్పూర్‌లో ఈ ఇద్దరి ఇన్నింగ్స్‌పై ఫోకస్ ఉండనుంది. స్పిన్ పిచ్‌పై భారత్ ముగ్గురు స్పిన్నర్లతో ఆడనుంది. అశ్విన్, జడేజాలకు తోడుగా లోకల్ బాయ్ కుల్దీప్‌ను ఎంచుకునే అవకాశం ఉంది. అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా బౌలింగ్ శైలి ఒకే విధంగా ఉంటుంది. దీంతో స్పిన్ ఎటాక్‌లో భిన్నత్వం కోసం కుల్దీప్‌ను తీసుకునే వీలుంది. జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌లు పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. చెన్నై టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో సీమర్లు 8 వికెట్లు పడగొట్టగా.. రెండో ఇన్నింగ్స్‌లో స్పిన్నర్లు 9 వికెట్లు కూల్చారు. ఇదే జోరు గ్రీన్‌పార్క్ పిచ్‌పై కొనసాగించేందుకు బౌలర్లు ఎదురు చూస్తున్నారు.





పుంజుకోగలరా?

స్పిన్ అనుకూల కాన్పూర్ టెస్టులో పుంజుకోవాలని బంగ్లాదేశ్ ఆశిస్తోంది. షకిబ్, మిరాజ్, తైజుల్ రూపంలో నాణ్యమైన స్పిన్నర్లు ఆ జట్టులో ఉన్నారు. బ్యాట్‌తో బంగ్లాదేశ్ ఆటగాళ్లు బాగానే ఆడుతున్నారు. చెన్నై టెస్టులో కెప్టెన్ నజ్ముల్ శాంటో ఫామ్‌లోకి వచ్చాడు. షకిబ్ అల్ హసన్, మెహిది హసన్ మిరాజ్, లిటన్ దాస్‌లు మంచి ఆరంభాలను అందుకున్నారు. కానీ భారత్‌లో టెస్టు మ్యాచ్‌లో పైచేయి సాధించేందుకు ఆ మెరుపులు సరిపోవు. ఐదు రోజుల పాటు నిలకడగా ఉత్తమ ప్రదర్శన చేయగలిగితేనే ఇక్కడ విజయం కోసం పోరాడగలం. ఈ సంగతి బంగ్లాదేశ్‌కు బాగా తెలుసు. పేసర్ నహిద్ రానాకు రెండో టెస్టులో ఆడే అవకాశం దక్కకపోవచ్చు. అతడి స్థానంలో మరో స్పిన్నర్‌ను తుది జట్టులో ఆడించనున్నారు.

పిచ్, పరిస్థితులు

కాన్పూర్ పిచ్ సంప్రదాయంగా స్పిన్‌కు అనుకూలం. తొలి రెండు రోజులు పేసర్లకు సహకారం లభించినా.. మూడో రోజు నుంచి బంతి గిరగిరా తిరుగుతుంది. నల్ల మట్టి పిచ్‌పై బ్యాటర్లకు పరుగుల వేట సులభం కానుంది. వర్షం సూచన ఉండటంతో ఇరు జట్ల తుది జట్టు కూర్పుపై ఆ ప్రభావం ఉండనుంది. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం కనిపిస్తోంది.

తుది జట్లు (అంచనా)

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), కెఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, కుల్దీప్ యాదవ్/అక్షర్ పటేల్, జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్.

బంగ్లాదేశ్ : షాద్‌మాన్ ఇస్లాం, జాకిర్ హసన్, నజ్ముల్ శాంటో (కెప్టెన్), మోమినుల్ హక్, ముష్ఫీకర్ రహీమ్, షకిబ్ అల్ హసన్, లిటన్ దాస్ (వికెట్ కీపర్), మెహిది హసన్ మిరాజ్, తైజుల్ ఇస్లాం, హసన్ మహ్మద్, టస్కిన్ అహ్మద్.

వరుణుడు కరుణించేనా?

భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టుకు వర్షం ముప్పు పొంచి ఉంది. ఐదు రోజుల ఆటలో తొలి మూడు రోజుల వర్షం కురిసే అవకాశం అధికంగా ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. శుక్రవారం ఉదయం నుంచే కాన్పూర్‌లో చిరు జల్లులతో కూడిన వర్షం సూచనలు ఉన్నాయి. ఉదయం 11 తర్వాత వర్షం తీవ్రత అధికం కానుంది. ఇక శనివారం భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. శుక్ర, శని, ఆదివారాలు వర్షం ప్రమాదంతో ఆటపై ప్రభావం పడనుంది. వర్షం కారణంగా ఇరు జట్ల తుది జట్ల కూర్పు, ప్రణాళికల్లో సైతం మార్పులు చేర్పులు చోటుచేసుకునే అవకాశం లేకపోలేదు.

రెండు పిచ్‌లు సిద్ధం!

చెపాక్ ఎర్రమట్టి పిచ్‌పై భారత్ 280 పరుగుల తేడాతో విజయం సాధించింది. కాన్పూర్ టెస్టులో పిచ్ స్పిన్నర్లకు అనుకూలం. కానీ మ్యాచ్ కోసం గ్రీన్‌పార్క్ స్టేడియం క్యూరేటర్ రెండు పిచ్‌లను సిద్ధం చేశారు. మ్యాచ్‌కు ముందు రోజు వరకు గ్రౌండ్స్‌మెన్ రెండు పిచ్‌లను సిద్ధం చేస్తూ కనిపించారు. టాస్ ముంగిట ఏ పిచ్‌ను వాడేది తెలిసే అవకాశం ఉంది. రెండు పిచ్‌లు సైతం నల్లమట్టితో చేసినవే అయినా.. వాతావరణ పరిస్థితులు ఆధారంగా పచ్చిక ఎక్కువ, తక్కువ ఉన్న పిచ్‌ను ఎంచుకోవాలనేది క్యూరేటర్ ఆలోచనగా తెలుస్తోంది.

అధునాతన ఫ్లడ్‌లైట్లు

గ్రీన్‌పార్క్ స్టేడియం చివరగా 2021లో టెస్టు మ్యాచ్‌కు ఆతిథ్యం ఇచ్చింది. న్యూజిలాండ్ పదో వికెట్ భాగస్వామ్యం పోరాడుతుండగా మరో 12 నిమిషాల ఆట మిగిలి ఉండగానే మ్యాచ్ నిలిచిపోయింది. వెలుతురు లేమి సమస్యతో అంపైర్లు మ్యాచ్‌ను కొనసాగించలేదు. దీంతో భారత్ విజయానికి వికెట్ దూరంలో ఆగిపోయింది. భారత్, బంగ్లాదేశ్ టెస్టుకు వెలుతురు లేమి సమస్యను అధిగమించేందుకు అధునాతన ఫ్లడ్‌లైట్లు ఏర్పాట్లు చేసినట్టు స్టేడియం అధికారులు వెల్లడించారు.

కోతులకు చెక్!

కాన్పూర్ అనగానే స్పిన్ స్వర్గధామ పిచ్‌తో పాటు కోతుల బెడద సైతం గుర్తుకొస్తుంది. స్టాండ్స్‌లో అభిమానులతో పాటు ఆటగాళ్లను కోతులు ఇబ్బందులకు గురిచేశాయి. భారత్, బంగ్లాదేశ్ టెస్టు మ్యాచ్‌కు యుపీసీఏ అధికారులు కోతులను కట్టడి చేసేందుకు రెండెంచల ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

క్వార్టర్స్‌లో శ్రీకాంత్

ట్రెసా, గాయత్రి జోడీ సైతం మకావు ఓపెన్ బ్యాడ్మింటన్



మకావు (చైనా) : మకావు ఓపెన్ సూపర్ 300 టోర్నమెంట్‌లో భారత షట్లర్లు క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నారు. పురుషుల సింగిల్స్ విభాగంలో కిదాంబి శ్రీకాంత్ వరుసగా రెండో విజయం నమోదు చేశాడు. మెన్స్ సింగిల్స్ రెండో రౌండ్లో సహచర భారత షట్లర్ ఆయుశ్ శెట్టిపై 21-13, 21-18తో వరుస గేముల్లో గెలుపొందాడు. మహిళల డబుల్స్‌లో ట్రెసా జాలి, పుల్లెల గాయత్రి జోడీ సైతం క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది. గురువారం జరిగిన ప్రీ క్వార్టర్స్‌లో 22-20, 21-11తో చైనీస్ తైపీ జోడీ లిన్ చున్, టెంగ్ చున్‌లపై వరుస గేముల్లో అలవోక విజయం సాధించింది. మహిళల సింగిల్స్‌లో తస్నీమ్ మిర్ 17-21, 21-13, 10-21తో మూడు గేముల మ్యాచ్‌లో జపాన్ షట్లర్ మియజాకి చేతిలో పోరాడి ఓటమి చెందింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి, సుమిత్ రెడ్డి జోడీకి నిరాశే ఎదురైంది. 17-21, 14-21తో మలేషియా షట్లర్లు వాంగ్, లిమ్ చేతిలో ఓటమి పాలయ్యారు.

టీ20లకు షకిబ్ గుడ్ బై

సొంతగడ్డపై సఫారీతో వీడ్కోలు టెస్టు



కాన్పూర్ : బంగ్లాదేశ్ స్టార్ ఆటగాడు షకిబ్ అల్ హసన్ టీ20లకు గుడ్ బై పలికాడు. 2024 ఐసీసీ టీ20 ప్రపంచకప్‌తోనే పొట్టి ఫార్మాట్ కెరీర్‌కు ముగింపు పలికానని వెల్లడించాడు. స్వదేశంలో దక్షిణాఫ్రికాతో వీడ్కోలు టెస్టు ఆడతానని ప్రకటించాడు. దీంతో బంగ్లాదేశ్ తరఫున షకిబ్ ఇక నుంచి వన్డేలు మాత్రమే ఆడనున్నాడు. భారత్‌తో టీ20 సిరీస్‌లోనూ షకిబ్ ఆడటం లేదు. అయితే, స్వదేశంలో వీడ్కోలు టెస్టుపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఏడాది ఆగస్టు 5న బంగ్లాదేశ్‌లో అవామీ లీగ్ ప్రభుత్వం కుప్పకూలింది. ఆ ప్రభుత్వంలో పార్లమెంట్ సభ్యుడిగా షకిబ్ భాగస్వామి. దీంతో మీర్పూర్‌లో జరిగే టెస్టులో షకిబ్‌కు భద్రత కల్పించటంపై బీసీబీ సహా ప్రభుత్వ విభాగాల నుంచి హామీ రావాల్సి ఉంది. టెస్టులో ఆడటంతో పాటు తిరిగి విదేశాలకు చేరుకునేందుకు స్పష్టమైన హామీ లభిస్తేనే ఆడతానని షకిబ్ తేల్చి చెప్పారు. బంగ్లాదేశ్‌లో సఫారీ పర్యటనకు దక్షిణాఫ్రికాకు ఇంకా భద్రతపరమైన క్లియరెన్స్ రావాల్సి ఉంది. 37 ఏండ్ల షకిబ్ 129 టీ20ల్లో 2551 పరుగులు, 149 వికెట్లు పడగొట్టాడు. 70 టెస్టుల్లో 4600 పరుగులు సహా 242 వికెట్లు తీసుకున్నాడు.



చెస్ హీరో అర్జున్‌కు ఘన స్వాగతం : ఫిడె 45వ చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణం సాధించిన భారత జట్టులో కీలక ఆటగాడు, తెలంగాణ స్టార్ అర్జున్ ఇరిగేశికి హైదరాబాద్‌లో ఘన స్వాగతం లభించింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అర్జున్‌కు రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షులు ప్రసాద్, శాట్ అధికారులు నందకిశోర్ గోకుల్ , అలెగ్జాండర్ ఫ్రాన్సిస్, సురేశ్ కాలేరు సహా చెస్ క్రీడాకారులు, క్రీడాభిమానులు తదితరులు అపూర్వ స్వాగతం పలికారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886